జనవరి ఆంధ్రభూమి.
1935


1. [illegible] ప్రవృత్తి — శ్రీ [illegible] — 553
2. [illegible] — [illegible] శాస్త్రి — 554-558
3. [illegible] — [illegible] కృష్ణమూర్తి — 559-560
4. [illegible] — [illegible] — 560
5. [illegible] — [illegible] — 561-566.
6. [illegible] — [illegible] — 566-567
7. [illegible] కథ — మొదలి వెంకటసుబ్రహ్మణ్య శర్మ. 568-572
8. [illegible] — [illegible] — 573
9. [illegible] — [illegible] — 574-576
10. భారతీయ గ్రంథాలయము — 577-579
11. [illegible] — [illegible] — 580-582
12. [illegible] — [illegible] — 583-587
13. [illegible] — [illegible] — 588-589.
14. ఆవేదన — [illegible] — 590
15. [illegible] — [illegible] — 591-596
16. [illegible] — [illegible] — 597-600
17. [illegible] — [illegible] — 600-603
18. [illegible] — 604-610
19. రాజమహేంద్రవరము — 610-611
20. [illegible] — [illegible] — 612-613
21. [illegible] — [illegible] — 613
22. [illegible] — 614-616
23. ~~[illegible]~~ [illegible] — 617-618.

# మోహన ప్రకృతి

ఈ మహాకాలవాహిని కెంద తెంద
అకట! యెదురీదఁగాంక్షించి యడఁగిచనిరొ
ఘోర దుస్తరమీ ప్రవాహంబు దీన
గలవు సుడిగుండములు మహాగ్రాహచయము;

లలిత శారద చంద్రికాలంకృతమయి
మహిత బాలాతపచ్ఛవి మండితమయి
సమధికరయంబుతోడ నెచ్చటికిఁ జనునొ
ఈమహా వాహినికి నంత మెవ్వఁడెఱుఁగు.

సుందర పతంగచయ మొకచోటగలదు.
కాలసర్పాదికంబు లొక్కటను గలవు
దరులవిహరించు యువకుల దరియనేగి
క్రూరజలజంతు రాజిగైకొని వధించె.

జలవిహార విలోలురౌ జనులు ఖేద
మోద సంలగ్న హృదయులై పొల్తురేల?
ప్రసవ భూషితమైన యీ పడవమీఁద
కన్నె దంపతులదె చనుచున్నవారు.

తీరవాసులు దరియనేతెంతు రనిరొ
గమ్య దేశంబు జేరుటే కామ్యమనియొ
ఉత్తరించుచున్నారు యోజనములు
మోహన ప్రకృతీ? నీకుఁ బూజసేయు
ముగ్ధ దంపతులేగదా పుణ్యమతులు;

—శేషాద్రిరమణకవులు.

# ఒక నాటి రాత్రి

౧

గోరుచుట్టుమీద రోకలిపోటన్నట్లుగా సాంసారిక వ్యథా పీడితుల్లైయున్న నా చెవుల్లోనే వచ్చి పడాలంటే ఆ మాటలు? దెబ్బ తగిలిన వేలికే మళ్ళీతగలడంలో రహస్య మేమంటారు? చూడండి.

చేసేది పడవప్రయాణం. ప్రశాంతంగా ఉంటుందని ఓగదిలో కూర్చున్నా. రాత్రి పన్నెండో, పన్నెండు న్నరో అవుతుం దప్పుడు. హాలులో ఓ చిన్నదీపం వెలుగు తోంది. గుణవతియగు మగనాలి యశస్సువలె తలుపు చెక్కల సందుల్లోంచి నాగదిలోకికూడా వచ్చి వ్యాపించినాయి దానికాంతులు; రహదారీ జనం ఎక్కువగా లేకపోవడంచేత పడవలో అంతా నిశ్శబ్దత; నేనూ కొంతసేపా దీపాన్ని చూస్తూ కూర్చున్నా; కర్కశ హృదయులగు అత్తమామల అడుపాజ్ఞలలో క్రుగ్గి పోతూ చావుబ్రతుకుల మధ్య అల్లల్లాడే అమ్మలమిన్న వలె గాలికి ఇటునటు ఊగిసలాడుతోంది ఆదీపం. కష్టాల కోర్చియున్న కలికివలె నిలిచి వెలుగుతుంది కొంతసేపు; ఒక్కొక్కమారు కట్నాపేక్షతో అత్త మామలవద్ద గడిబిడచేసే అల్లుణ్ణి స్ఫురణకు తెస్తుందని టపటపలాడి; ఈ జడప్రకృతే నన్నీవిధంగా గాభరా పెడ్తూంటే ప్రత్యక్షంగా విన్నమాట లెంత బాధ పెడ తాయో ఆలోచించండి.

* * *

'మకాముస్తోంది; గట్టిగా పాడండ్రోయ్' అని కళాసుల్ని కేకేశాడు సరంగు; ఊరుదగ్గరకు రాగానే బిగులూదుతూ పడవను దరికి పట్టేడు; కళాసులు ఆగి తాడులాక్కొని ఆపేశారు పడవని. కొందరు రహదారీ జనం ఎక్కేరు; కొత్తకళాసులు రావడంతోటే సరంగు బిగులూది తాడు జారుచేయమన్నాడు. కోడలంటే కేవలం దాసీదాన్నిగా భావించి అష్టకష్టాలూ పెట్టే అత్తమామల ఇంటికి, పుట్టింటినుండి వెళ్ళే పడుచల్లా మందంగా నడుస్తోంది పడవ.

నాగదికి ప్రక్కగానే ఇరువురు స్త్రీలూ, వ్యాధి పీడితురాలైన ఒకపడుచూ, ఒకపురుషుడూ కూర్చు న్నారు; పాపం! ఆపడుచు, విరామంలేకుండా మూలు గుతోంది.

'ఏమండీ! అల్లా మూలుగుతోందేం ఆపిల్ల' అని వారి పక్కనున్నవారొకరు ప్రశ్నించారు.

'ఏంచెప్పమంటారయ్యా,' అని కంటతడిపెట్టుకొం దొకస్త్రీ.

'మాగ్రహచారం' అన్నాడు పురుషుడు.

'ఏం జబ్బండీ బాబూ?'

'జబ్బా? ఈపిల్ల నీవూళ్ళోనే ఇచ్చాం ఒకాళ్ళకి; వాళ్ళు మమ్మల్ని వేపించుకు తినేస్తున్నారు; పెళ్ళయ్యే దాకా కాళ్ళూకడుపులూ పట్టుకుని తీసుకెళ్ళేరు; ఇప్పుడు మామాటంటే వాళ్ళకి విషప్రాయం.

'అంతవరకూ ఎల్లావచ్చింది? మీరు చేసినతప్పేమిటి?'

'అంతా నాదేతప్పు; 'కన్యాపితృత్వం ఖలునామ కష్టం' అన్నారు; ఆడపిల్లను కనడమే తప్పునాయనా.'

'అయ్యో—'

'పెళ్ళికిముందు కట్నంవిషయమేమీ మాట్లాడుకోనే లేదు మేం: ఇవ్వమనికూడా చెప్పేం స్పష్టంగా; ఇప్పుడు కట్నం తెమ్మంటే ఎక్కణ్ణుంచి తేమండీ?'

'బాగానేవుంది; ఇప్పుడు కట్నమివ్వమని బాధించడమేమిటి మిమ్మల్ని?'

'సత్యనారాయణవ్రతం చేసుకుంటూ మంటూ నెల రోజులక్రితం పిల్లను తీసుకెళ్ళేరు; అదంతా వట్టిది సుమండీ; పిల్లదగ్గరున్న నగలన్నీ తీసుకొని అమ్ము కున్నారు. పోనీ నగలకోసం ఎవరేడ్చారు? వాళ్ళ బాగుమాత్రం మాబాగు కాదూ! ఋణపీడితులై వాళ్ళుంటే పిల్ల నగలతో కులకడంమాత్రం ఏం న్యాయం? నగలు పెట్టుకోడానికి ముచ్చటపడుతోందని పెళ్ళిముందు ఏవో కొన్ని నగలు పెట్టాలని నిష్కర్షగా చెప్పినవాణ్ణి—పోనీ అజ్ఞానురాలగు పిల్లకు

నచ్చచెప్పి సంతోషపూర్వకంగా ఇప్పించేటట్టు చేస్తానన్నేనా—నాచెవిని కూడా పడేయకూడదూ అమ్ముకుంటున్నామని? అల్లాచేశారా? వ్రతం మిషమీద తీసుకొచ్చి లాక్కొన్నారు. పిల్లకేం తెలుస్తుంది? అది గోలున ఏడ్చింది; దీనికితోడు, ఇక పుట్టింటికి వెళ్ళడానికి వీలులేదనీ, అమెవాలూకు బంధువులెవరు వచ్చినా మాట్లాడకూడదనీ దాన్ని భయపెట్టేరు; ఏముందీ, ఇక్కడకువచ్చిన మర్నాడే మంచంపట్టింది జ్వరంతో; మాకు మొన్నటిదాకా కబురేనా చెయ్యలేదు సుమండీ. చావడానికి సిద్ధంగావుందని సలుగురూ చివాట్లేస్తే మొన్న ఉత్తరంరాశారు మాకు; నిజంగా వ్రతం ఎప్పుడుచేసుకుంటారో అని వర్తమానం కోసం నిరీక్షిస్తూవున్న మేము ఈవర్తమానం వినవలసి వచ్చిం దాఖరికి.'

'పాపం'

'ఏముంది? మనోవ్యాధికి మందేమిటి? మమ్మల్ని చూడ్డంతోటే కొత్త తెప్పరిల్లింది. ఒకరోజు ఉండి పిల్లను తీసుకొస్తున్నాం. ఇదీ సంగతి. అఁ...మరచిపోయా; పిల్ల ఇంకా కాపురానికేనా వెళ్ళలేదు సుమండీ'

'ఏమిదారుణమర్యండీ; అక్కడవాళ్ళకు బుద్ధిచెప్పగలిగిన పెద్దమనిషైనా లేడూ!'

'లేకేం? అందరూ పెద్దమనుష్యులే; వాళ్ళలో వాళ్ళకి ఎన్నితగాదాలున్నా, అన్యగ్రామస్థుడెవడేనా వస్తే, అందరూ ఏకమై వాణ్ణి నోరెత్తనియ్యరు. అదీ వాళ్ళ కట్టడి.' అని పూరుకున్నా డాయన.

౨

నా ఊహాప్రపంచకంలో ప్రచండమారుతం వీచింది; చెట్లు ఫెళఫెళ లాడేయి; కొంపలు కూలినై; భగ్నహృదయుడనై ఓమూల కొదిగాను; ఒకటా, రెండా, మితిమీరిన క్రౌర్యాలు—హత్యలు — బాధలు, ఒకదానికంటె ముందొకటి వచ్చి నాబుర్రలో డీకొన్నాయి; తలపట్లు పట్టేయ్; హోరాహోరీని పోరాడాయ్ దెబ్బలాడి దెబ్బలాడి కుక్కురుమనకుండా పడివున్నాయ్; అంతా క్రొత్తప్రపంచం.

* * *

ఉన్నతాసనాసీనుడై యున్నా డొక భయంకర స్వరూపుడు. అతనిప్రక్కగా విపరీతమైన పొడవు వెడల్పులుగల పుస్తకాల దొంతర్లు పడివున్నాయ్. ప్రక్కగా బారులుతీర్చి, కుక్కతలలవారూ, నక్కమూతులవారూ, కోరపండ్లవారూ, మిడిగుడ్లవారూ, చింపిరిజుట్లవారూ పొడవుకాళ్ళవారూ, పొట్టికాళ్ళవారూ, పొట్టిచేతులవారూ,—ఈవిధంగా విపరీతరూపాలతో, కృపాణకుఠారపాశాద్యుపకరణహస్తులై, చేతులుజోడించి, తలలువంచి, స్వామియాజ్ఞలనే దలదాల్చ కుతూహలురై యున్నట్టుగా నిలబడి యున్నారు కొందరు.

కొంతసేపటికి ఒక ఉన్నతకాయుడు ఠీవిగా నడుస్తూ ప్రవేశించా డాకచ్చేరీలోకి. వెంటనే అక్కడ కూర్చుని ఏదో వ్రాస్తున్న అధికారిలేచి జోహారుచేసి ప్రక్కనున్న పీఠమువద్దకు దారిచూపేడు వినమ్రుడై; నిలబడియున్న వికృతాకారులు రణబొబ్బలతో స్వాగత మిచ్చా రాతనికి; ఆత డాస్వాగతమును తలయూపుతూ గ్రహించి తన పీఠ మలంకరించాడు; వ్రాయసకాడు గంభీరధ్వనితో ఏదో చదువుట మొదలుపెట్టినాడు. ఉన్నతాసనాసీనుడై యున్న ఆయధికారి తలయూపుతూ, అర్ధనిమీలితనేత్రుడై చదివినదంతయు సవిస్తరంగా గ్రహించి ఊఁకొట్టి పుస్తక మటుతెమ్మని సంజ్ఞచేసి, దాన్లోచూస్తూ 'కాలము తీరిపోయిన ఈ కాయస్థులను వెంటనే తీసుకురం'డని ఆజ్ఞాపిస్తూ ఏవో కొన్ని పేర్లు చదివేడు;

సేవకులందరూ ఒక్కసారిగాలేచి జోహారుచేసి తమ దళనాయకుల ననుసరించి వెళ్ళేరు; పిదప నాయకులచేత నియుక్తులై భూలోకాని కొచ్చేరు; జాబితాలవారీగా చూశారు దేహస్థులను—మలమూత్రాల్లో దొగి మంచాల నంటిపెట్టుకున్నవారూ—కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ వళ్ళిగిలించేవారూ—మాటామంతీలేక పడియున్నవారూ,—అన్నాలు తింటూ వున్నవారూ,—స్నానాలు చేసేవారూ—ఇట్లా అనేక అవస్థల్లోవున్నారు లిస్టుదాఖలా మనుష్యులు. సరే. ఎల్లా ఉన్నవారల్లా ఉండగా తమ సాధనసామగ్రుల నుపయోగించి వారిని వికృతజీవులనోవర్చి తిన్నగా

యమ సన్నిధానానికి దారిపట్టించారు.

వాళ్ళల్లా బలవంతంగా లాక్కుపోతూవుంటే 'ఛీ! మీరేవళ్ళురా, మమ్మల్నిల్లాగిలా లాక్కెళ్ళడానికని జబర్దస్తీ చేశారు కొందరు ప్రాణులు.

'హుఁ...హుఁ...హుఁ.' అని వికటంగా నవ్వి 'మమ్మల్ని యమకింకరు లంటారు ఒరేయ్' అన్నాడొక కింకరుడు.

ఇంకోజీవి 'అయ్యో! నాపద్మం! నాపద్మం!' అని వెనక్కి తిరిగి వెక్కి వెక్కి ఏడుస్తూ 'ఒకమాట చెప్పొస్తానయ్యా నా పెళ్ళాంతో; చూడు ఎల్లా ఏడుస్తోందో' అని బ్రతిమాలేడు; 'ఒక్క మాటయ్యా' ...అన్నాడు; తుదకు విసిగి 'నా పద్మమోయ్, నా పద్మమూ' అని భోల్లుమంటూవచ్చాడు.

ఎంత హంగామాచేస్తాడో చూద్దామన్నట్టుగా కింకరుడు కిక్కురుమనకుండావుండి కొంతసేపు, 'పాపం! నీ తల్లి ఎంతఏడుస్తోందో......' అన్నాడు.

'పాపం! ఎంతజాలయ్యా నీకూ? ప...ద్మ...మో,...ప.....'

'మీతండ్రి కూడా గోలెత్తిపోతాడు గాబోలు పాపం!'

'అయ్యో! నా ప...ద్మ...మో......నా...'

'ఛఁ...నీవెందుకు తలుస్తావ్ వాళ్ళకి? పదపద వాళ్ళని ముప్పూటిప్పలూ పెట్టినందుకే ఇల్లా... నిన్ను పెంచి పెద్దవాణ్ణిచేసినందుక్కాదూ వాళ్ళనల్లా బాధపెట్టేవ్...'

* * *

ఇంకోజీవి 'ఒదులు; వన్నోదు'లని విదిలించుకొంటూ 'వైద్యునికి డబ్బియ్యొద్దని చెప్పొస్తా, నా కొడుకుతో' అంటూ గావుకేకవేశాడు.

'అయ్యో! నామేడ, నామేడ; నా పొలా లన్నో ధాన్యం తోలుకెడుతున్నారు మా వాళ్ళు! ఎన్నిబస్తాలైందో మా తూర్పుపొలం, లెక్కెట్టి రాసియవ్వా బాబూ!' అని ఒకజీవి గడ్డం పట్టుకుంటే 'విచారించకురా శెట్టివాడా; నీకు ధాన్యని కేంలోటు? కావలసినన్ని పంపిస్తాం నీ కొడుక్కి' అన్నాడొకకింకరుడు మందస్మితంతో.

'ఒదుల్తావా, ఒదలవా' అని అరుస్తూ భూలోకం కేసిచూస్తూ—ఎవరినుద్దేశించి ఎందుకన్నాడో కాని 'నిన్ను పీక్కుతింటా; నిన్నుపీక్కుతింటా; చచ్చిపోయావని సంతోషిస్తున్నావా? నీకొడుకుని చంపుతా; నీకోడల్ని చంపుతా; నిన్ను తిననిస్తాననుకున్నావా! ఆను నీసంగతి; నీసంగతి;...నీ...' అని ఆయాసపడుతూ అరిచే డింకోజీవి.

'ఛీ...ఛీ...అట్టేవాగకు, నడక మ'ని అదిమాయించాడు కింకరుడు.

'బాబూ! రక్షించరూ, రక్షించరూ! కావలిస్తే మీకు నాలుగుబస్తాల ధాన్యం కొలుస్తాను విడిచిపెట్టరూ!' అని బ్రతిమాలే డొకజీవి హీనస్వరంతో.

'ఈ మధ్యనే, ఆస్తి ఏమీ లేకపోయినా ఉందని చెప్పి నమ్మించి, ఒహా వివాహసంబంధం కైటుచేశాను మధ్యవర్తిగా ఉండి, మగపెళ్ళివారి తరఫున నాకు పాతికో పరకో ముట్టవలసుంది. వెళ్ళనీయవూ' అన్నాడొకడు.

'నీవు చేసిన దారుణప్పను లనేకంవున్నాయ్. దజన్ల కొద్దీ ఒరిగెలసంభావన లిప్పిస్తాం నీకు. నడవోయ్' అన్నాడు కింకరుడు.

ఒకడు, 'అయ్యా! మందంమీద పొడుంకాయ మరిచిపోయానండీ. వెళ్ళి తెచ్చుకోనిస్తురూ' అని బ్రతిమాలేడు.

'మేమూ పొడుంచేశేవాళ్ళమే. కావలసినంత పొడుం నీకు దొరుకుతుంది నడవోయ్' అన్నాడు కింకరుడు.

'నాకు పట్నంపొడుం అలవాటండీ. అక్కడది దొరుకుతుందా?'

'అంతకంటే మంచిదే దొరుకుతుంది.'

'పోనీయండి బాబూ—తులం ఎల్లాగో?'

'తులాల లెక్కేమిటి? టోకున ఇప్పిస్తాంగా?'

'మరి డబ్బేమీ తెచ్చుకోలేదండీ.'

'పైసా ఖర్చు లేదంటీ నీగా. పొడుంచేసేవాళ్ళం మేమున్నాం. నువ్వల్లా కూర్చోడమే ఊరికే.'

'చిత్తం. చిత్తం'

* * *

కొందరుజీవులు ఇక్కడ ఉండనకుండా మొహాలు వ్రేలాడవేసుకొని, ఏడుస్తూ వాళ్ళ వెంబడినే వెళ్ళేరు.

3

యమధర్మరాజు కాబోలు నిండు కొలువు తీర్చి కూర్చున్నాడు. ఆయనకు దగ్గరగానున్న వొకడు—చిత్రగుప్తుడనుకుంటా—పాపపుణ్యాల రిజిష్టరు తీసి చూస్తూ, కింకరులు తీసుకువచ్చిన జీవుల గోత్రనామాలు తెలుసుకొని తహవేలు చేసుకున్నాడు. జీవులనందర్నీ వరుసగా నిలబెట్టేరు. ఒక్కొక్క జీవినీ యమధర్మరాజు పిలిచి సమగ్రజీవితచరిత్ర చదివేసి వారువారు చేసిన పనులనుగూర్చి విచారిస్తూ శిక్షలు విధించాడు.

* * *

'ఏమోయ్! నీవు నీభార్యను చాలా బాధలు పెట్టేవు. ఆమె నిండుగర్భిణియై ఉండగా, వంకాయ కూర వండమంటే, శరీరాస్వస్థతచే వండలేకపోయినని, క్షమించమని ప్రార్థించినా, నిర్దయుడవై, దబ్బనం ఎర్రగాకాల్చి వాతలుపెట్టేవు. ఆహారమేమీ ఇవ్వకుండా కొన్నిరోజులు గదిలోపెట్టి తాళంవేశావు? కనికరంలేకుండా గంటలకొద్దీ నిలబెట్టేవుకదూ! ఎంత అమానుషప్పని చేశావ్? నీవు నానావిధ భక్ష్యాలతో కుత్తుకబంటిగా మెక్కి ఆమెను తినవద్దని శాసించావు నీ మామమీదా, బావమరదులమీదా ఉండే కోపం పెళ్ళాంమీద చూపించి, కొంతకాలం ఇంట్లోకి రానీకుండా పసులశాలలోకి గెంటేవు ఒకమాటు నూతులో దింపాలని ప్రయత్నించావుకదూ? ఒకమాటు...'

'రామ! రామా! నేనేమీ ఎరగనండీ: నాకూ నా పినతండ్రి కొడుక్కీ విరోధం లెండి: వాడు వెనకే వచ్చాడిక్కడికి. నే నంటే కిట్టకపోవడంచేత ఏవో చాడీలు కల్పించి చెప్పి వుంటాడు మీతో.' 'ఛీఛీ నోరుమ్మూయ్. చాడీలూగీడీలూ ఇక్కడలేవు. నీవుచేసిన దారుణాలు ఇంకా అనేకం వున్నాయ్. ఛో...ఛో...' అని ఒక కింకరుణ్ణిపిలిచి 'ఇతనికి, ఎర్రగాకాల్చిన గునపాల్తో ఒంటినిండా వాతలుపెట్టి, తేళ్ళకొట్లో పారేయం'డన్నాడు.

* * *

తర్వాత ఇంకోజీవిని పిల్చి, 'నీవూ నీకోడలికీ పడక, లేనిపోనినింద లామెమీద మోపి, కొడుకుతోనూ భర్తతోనూ చాడీలు చెప్పి, భార్యాభర్తలకు ఎడబంధాలు కలగజేశావు. పంక్తిభేదాలు చూపేవు. ఆకారణంగా హింసలు పెట్టేవ్. కోడలికి జబ్బుచేసినపుడు, చచ్చిపోతే శనివొదుల్తుందని భావించి, పైకిమాత్రం ఆమెమీద ప్రేమవొలికేటట్టు తియ్యనికబుర్లు చెపుతూ, బుసబుస దీర్ఘాలుతీస్తూ, వైద్యునికి లోపాయికారీగా త్వరగా చనిపోయేటట్టుచేస్తే నూటపదహార్లు బహుమాన మిస్తానని కబురంపేవు......'

'అయ్యయ్యో, ఒట్టిదండీ. తల చెడ్డమనిషి, మా మేనత్తకూతురు, నా ఈడుదేవుంది మావూళ్ళో. అది పుట్టించినవే ఇవన్నీ. మీరు నమ్మతగినవి కావు.' 'ఆఁ... ఇక చాలించు.' అని ఒకకింకరుణ్ణిపిలిచి 'సలసలకాగే ఆ నూనెతొట్లో పడేయం'డన్నాడు.

'అయ్యో, మీరుచెప్పినవన్నీ యదార్థాలే. ఇంకెప్పుడూ చేయనల్లా, ఇదిగో లెంపలువేసుకుంటున్నా' అని ఫెళ్ళుఫెళ్ళున లెంపలువాయించుకొని ఏడ్చింది.

* * *

ఇంకొకడొచ్చి ధర్మరాజుగారి వద్ద నిలబడ్డాడు. 'నీవు నీ భార్యచెప్పిన మాటలువిని తల్లిని గొడ్డలితో నరికేవు. తండ్రి తిండిలేక మలమలమాడిపోతూంటే, చూస్తూ వూరుకుంటూ వేలకువేలు నీవు సంపాదిస్తూ ఇంద్రభోగమనుభవించావు.'

'నిజమే బాబూ! తర్వాత తర్వాత మా తల్లిదండ్రులు కాలంచేసింతర్వాత, వాళ్ళనల్లా బాధించినందుకు పరితాపపడ్డాను. క్షమించండి'

'సరేవెళ్ళు. పరితాపపడినా తప్పదు—తీసుకెళ్ళి గుమ్మడికాయ బద్దలుతీసినట్టు తీయండి ఇతన్నని కింకరున కాజ్ఞాపించాడు.

* * *

నువ్వా? నీవూ నీ భర్తా, కులాసాగా ఉండవచ్చునని అత్తకు అన్నంలో విషంపెట్టిచంపేవు. మామగారికి తిండిపెట్టక, ముప్పుతిప్పలూ పెట్టేవు. ఏం మాట్లాడవేం?'

* * *

సరే ఇల్లాంటివి చాలా ఉన్నాయి నీ పనులు.' సరే. తీసుకెళ్ళండా ఈమెను అంపాల్తోకోసి పారేయండి.

* * •

'వావీ వరుసా లేకుండా, నిష్కళంక చరిత్రలని గ్రహించకుండా, అనేకమంది స్త్రీల నవమానపరిచావు నీవు. అనేక కుటుంబాలను అప్రతిష్ఠకు పాలుచేశావు. నీకు స్వాధీనముకాని స్త్రీల ననేకబాధలు పెట్టేవు.'

'ఆఁ...ఔను. ఐతే?'

'ఐతే ఏముంది? వెళ్ళి కౌగలించుకో కాలి ఎర్ర బారిన ఆ స్తంభాన్ని. చాలా చల్లగావుంటుంది. నీవు వెనుకెప్పుడూ అంత చల్లదనాన్నీ అంతహాయినీ అనుభవించి ఉండవు.'

చూస్తారేం? తీసుకెళ్ళండిరా.

'ఆఁ...తీసుకెడతావ్. తీసుకెడతావ్!'

'అట్టేవాగకు. నడువు. నడువు'

* • •

'పతివ్రతా శిరోమణియగు నీ భార్యను నీ ఉంపుడుకత్తె మాటలువిని విపరీతంగా బాధించావు. ఆమె నీకు విధేయురాలై ఉండడానికే ఎప్పుడూ ప్రయత్నిస్తూవుండేదనీ, నీకోసం ఆమె ప్రాణాలుకూడా అర్పించడానికి వెనుదీయని సాధ్వియని గ్రహించలేకపోయావు. విషయలోలుడవై విర్రవీగితిరిగేవు ఆమెనుకొట్టేవ్. మలమలమాడ్చేవు'

'కొంతకాలంమాత్రం అల్లాచేసినమాట సత్యమే బాబూ. ధనమంతా ఖర్చయిపోయింతర్వాత నా దగ్గర నుంచి అనునిషా వెళ్ళిపోయింది. నేనూ అప్పటినుంచీ నా బుద్ధి మార్చుకుని జాగ్రత్తగానూ ప్రవర్తించా. నా భార్యనే బాధలూ పెట్టి యెరగను తర్వాత.'

'ఔనులే. అందుకనే శిక్ష తగ్గుతుంది.'

ఒరేయ్? తీసుకెళ్ళి ఆ బ్రహ్మజెముడు డొంకలలో పారేయండి పీడ్ని.

'గుచ్చుకుంటాయి...ముళ్లు, ముళ్లు ..బా...బో'

'అచ్ఛే, చాలాసుఖంగావుంటుంది. వెళ్లు వెళ్లు'

• * •

ఇన్ని చూసింతర్వాత నిర్భయంగా, ఏశిక్షకైనా తీరా నన్ను చూశారంటే నన్నేంచేస్తారో అని భీతికలిగింది. ఓమూల భీతి వెనక్కిలాగుతున్నా అక్కడజరిగే ఆ పనులు చూడాలనే ఆసక్తి ముందుకులాగింది. అలాగే చూస్తూవున్నా. పెద్ద అధికార్ల కళ్లబడకుండా మూలమూలలకొదిగి చూశా. ఎవరికళ్ళు నామీద పడతాయో అని అతిజాగరూకుణ్ణయి వున్నా.

యమధర్మరాజొక జీవినిపిల్చి

'నీవు నీతలచెడిన సోదరి ఆస్తంతా కాజేశావు. ఏదో నిర్వాకంచేస్తావని ఆమెను నమ్మించావు. భూములు కొంటానన్నావ్. మేడకడతానన్నావ్. ఇదేమీ చేయలేదు సరిగదా ఆమెను నీ ఇంట్లోనుండి వెడలగొట్టేవు. ఆమెను మాయచేసి దఖలుపరచుకొన్న ఆస్తి నువ్వూ నీ భార్యాబిడ్డలూ అనుభవిస్తూ, ఆమెను ముష్టి యెత్తుకొనే స్థితిలోకి తెచ్చావు. ఆమె ఓరోజున మీ యింటికొచ్చి 'అన్నయ్యా, నాల్గురోజులనుంచీ తిండి.........'

ఆనేమాటలు వింటూంటే 'ఎవడురా వాడు వరుసల్లో నిలబడక అటూఇటూ తిరుగుతున్నాడ'ని మరోజీవిని పట్టుకుని లాక్కురావడానికి నావేపుకు పరుగెత్తుకు వచ్చాడు ఒకకింకరుడు. నేను పరిగెత్తేను నామీదకేం విరుచుకపడతారో అని. అదేంచిత్రమో నేను పరుగెత్తుతూన్నదారినే వచ్చాడాజీవీ. కొంతదూరం నేను ముందూ, నావెనకాల కొంతదూరంలో ఆజీవీ, ఆవెనకాల కింకరుడూ పరుగెత్తేం. ఇల్లా చాలాదూరం పరుగెత్తినా ఒకరికొకరు అందడం తటస్థించలేదు. ఎంత దూరమని ఇలా పరుగెత్తడం? ఆయాసం. ముచ్చెమటలూపోశాయి. ఎల్లాగా పట్టుపడడం తప్పదని నిరాశచేసుకొని 'బాబోయ్' అని అరిచి కిందపడ్డాను ఒగరుస్తూ. తర్వాత ఆజీవెక్కడికి పరుగెత్తుకుపోయేడో, ఆకింకరుడేంచేశాడో నాకేం తెలుస్తుంది?

నా కేకలువిని పడవసరంగుమాత్రం పరుగెత్తుకవచ్చి 'ఏమిటండీ పంతులుగారూ?' అని ఖంగారుగా కేకలేస్తూ నా గదిలోకొచ్చి పడ్డాడు.

—వఝ్ఝ రామశాస్త్రి.



# జీర్ణదేహి చిరునవ్వు

ఆ చింకి గోచీగుడ్డ, చింపిరిజుత్తు, ఆకలిచే అడుచుకుపోయిన కడుపు, ముఖాన్న తాండవిస్తూన్న దీనలక్షణాలు—దేహం కొరుక్కుతినేస్తూన్న కుష్ఠురోగం ఎవరికి జాలిగొల్పవు? కాని అలా అనకోడం వట్టి పొరపాటు. నిజంగా ఆపేదజీవిని చూచి అందరూ జాలిపొందేఉంటే ఒక్కొక్క రోదమ్మిడీ పారేసీవారే!........

'బాబూ, తమరు కిల్లీవేసుకున్న పాటిలేదు, నే నడుక్కూనీ దల్లా ఒక్క దమ్మిడీ! రెండు రోజులాయి తిండిలేదు, ఆకలి దహించుకు పోతున్నాది స్వామీ! పండుగపూటా పుణ్యంకట్టుకో నాయినా!' అంటూ, ఎంత కఠిన హృదయుడికేనా సరే హృదయం కరిగేటట్టు ఏడుస్తున్నాడారోగి, ఓ కాఫీ క్లబ్బు ముందర రోడ్డుమీద. అతని దేహం నిండా చెమ్మట కారుతూంది, ఎండలో అతని దేహం మాడుతూంది; త్రోవబోయే మోటార్లు, బళ్ళు వల్ల చెలరేగిన రోడ్డుధూళి అతని జబ్బుదేహముపైకి రేగి అతని హృదయానికి భరింపరాని బాధ కలుగజేస్తున్నాది.

క్లబ్బునుండి బైటకు వస్తూన్న ప్రతి సుఖజీవీ తప్పుచేసిన వాడిలా పెడముఖంతో అతన్ని తప్పించుక పోతున్నాడే కాని అతని మొర ఆలకించలేదు. ఇక వృథాప్రయాస అనుకున్నాడతడు—! అతడు బాగా అలసట చెందేడు, కాల్తూన్న రోడ్డుమీదే మేను వాల్చేడు; చేతులతోనీ కళ్ళతోనీ మాత్రం తన దీనత్వాన్ని ప్రతివారికీ తెలుపుతున్నాడు. 'నీ లాంటి వాళ్ళెందరున్నారో? ఎంతని దమ్మిడీలు తేవడం!' అంటూ, సుంతేనా జాలిలేకుండా ఆదుఃఖజీవి ప్రార్థన త్రోసివుచ్చి వచ్చేడో ఆసామీ. ఈ శిలాహృదయు డెందరు ముష్టివాండ్ర కిలా జవాబుచెప్పి తప్పించుకున్నాడో; లేదా ఎన్నో దమ్మిడీలు దానంచేసి, చేసి దానకర్ణుడతో సమున్డై, యింక దానం చెయ్యడం అనవసరమని అతని ప్రార్థన నిరాకరించేడో; తెలీదు.

*  *  *

పూర్తిగా నిస్పృహ చెందిగు ఆక్లబ్బు దగ్గర్నుంచి పాకురుతూ కదిలేడా దురదృష్టజీవి!........

అక్కడ ప్రజలంతా గుంపులు గుంపులుగా కూడి ఉన్నారు. భిక్షుకు డచ్చటకు పోయేడు. 'బాబూ, మీారు కాల్చుకోడానికి కొనే సామాను ఖరీదులో సహస్రాంశం ఉండదు; ఒక్క దమ్మిడీ యీాకటికి దరిద్రుడుకి దానంచేసి పుణ్యంకట్టుకోండి స్వామీ!' అంటూ మామూలు పాటారంభించేడతడు. రూపాయిలకి రూపాయిలు కాకరపువ్వొత్తులకు టపాకాయలకు వెచ్చిస్తూన్న యువకుల

పాదాలచెంత వృథాగా విలపిస్తున్నాడతడు !... ...

'బాబూ, పండుగపూటా పుణ్యం కట్టుకోండి నాయినా,' అన్నాడు, కాని అక్కడ ఎవ్వరికీ ఆ దీనుడి విలాపం వినిపించ లేదు.

*  *  *

అతడలా పుండులా ఉన్న దేహంతో ఎలాగో పాకురుతూ పోతున్నాడు. ప్రతి గుమ్మంముందర ఆగి, 'అమ్మా, పట్టెడన్నం పెట్టమ్మా, పండుగపూటా కడుపు మాడుతూంది !....పిడికెడు మెతుగులు వేసి పుణ్యం కట్టుకో తల్లీ!' అని ప్రార్థిస్తున్నాడు. 'గంపెడు పిల్లల్తో ఉన్నవాళ్ళం, అహ్వ ! నీకేంపోగరు పుట్టెడు రోగంతో గుమ్మంమీాది కొళు పొస్తున్నావ్ ? రోడ్డుమీాంచి ఏడవ లేవ్—' అంటూ చీపురుకట్ట పట్టుకు అతని మీాదికి యుద్ధానికొచ్చిం దో యిల్లాలు ! అత డో వేడి నిట్టూర్పువిడిచి ప్రక్కకు తొలిగేడు. ఇంతలో 'బాఁ, బాఁ' అని, 'టంగ్,టంగ్' అని, 'టక్, టక్' అని, కార్లు, సైకిళ్లు, జట్కాలు మొదలగువాని చప్పుళ్లు అందులోనే అస్పష్టంగా 'అమ్మో' అనే కేక —! మరేఁవుంది ! అతని జీర్ణ దేహం మీాంచి ఓ మోటారుసైకిలు నడిచింది ! సయికిలుమీాది మనిషిదిగి 'ఏం బుద్ధి లేదూ ? పశువ్వా ? తోవకడ్డంగా ఉండి సైకిలెటుతిప్పితే అటు వస్తావా?' అని తూల కనురు కసిరే డాబిచ్చ గాణ్ణి భిక్షువు నిర్విణ్ణుడ య్యేడు. అతని కింకా కొనప్రాణం మాత్రం ఉంది. అతడు శూన్య దృక్కులతో ఆసైకిలు మనిషిని చూసేడు, రెండు వేడికన్నీటి బిందువులు రాల్చేడు.

'నాయనా, అవును........పొరపాటు, క్షమించు!' అన్నాడు, అతనికంఠం రుద్ధమై పోయింది ; 'కాని నీ మేలు మరువను, నా కష్టాలు తీర్చేవు—'అని ముగించే డతి కష్టం మీాద. ఆబిచ్చగాడు విగత జీవుడయాడు, కాని అతని పెదవులమీాద చిరునవ్వ తాండవిస్తూన్నాది! అతని పెదవులకి ఆదిచిరునవ్వ తుదిచిరునవ్వ రెండూ యిదే !

—వజ్ఝల కృష్ణమూర్తి.

## రామరాజభూషణుఁడు

౧

ఉ॥ దాటవశంబుగాని కవి తానియమోన్నత భిత్తికల్నిరా
ఘాటబవంబు నన్నగసి గంతులువెట్టెడు నీదుశ్లేషవా
గ్ఘాటికిఁ, బెద్దనాది కవి దంతులు తత్తరమంద లేదె ? యా
నాటికి, నేటి, కింకనొఁక నాటికి, నీకెదురేరి ? సత్కవీ !

౨

ఉ॥ కాపు కవిత్వమెవ్వనికి కమ్మదనంబగునంచు నెన్నియో
లోపములెన్ని, నిన్నుసభలో నవమానము సేయు లింగనిఁ
గోపము సేయకింక ననుకొమ్మని, చక్కదనాలకబ్బవుం
గాపులు గాచిపోయితివిగా ? కవితా దివిజద్రుమంబునన్.

—జి. జా షు వ.

# శూర్పణఖ శృంగారం

[ఏకాంక రూపకము.]

[అది దండకారణ్యం. కొండకోనలపై నుండి ఉరకలు గ్రక్కుతూ ప్రవహిస్తోంది సెలయేరు నిరాఘాటంగా, పతితుల్ని పట్టుకోలేరని ఘోషిస్తూ. ఓపక్కని దట్టంగా అల్లుకుపోయి, సూర్యకాంతిని అరికట్టేస్తూ విగ్రవీగుతున్నాయి అడవిచెట్లు. వాటిక్రింద పచ్చిక పరుపులమీద అక్కడక్కడ విలాసాలు నెరపుతున్నాయి లేడిగున్నలు. గండుకోయిల్లు కంఠమెత్తి వసంతుణ్ణి ఆహ్వానిస్తున్నాయి. కొండక్రింద పెద్దరాయి జలపాతం తన్నేం జేస్తుందని, రొమ్మునిచ్చి ఎదిరిస్తోంది. ఇది నాకడ్డమా అని నోరుతెరచుకు కరవబోతోంది సెలయేరు. ఆ రాతి తిన్నెమీద కూచున్నారు సీతారాములు. సీత, తన కాళ్లు నీటిలోపెట్టి ఆడిస్తోంది, రాముని తొడమీద కుడిచెయ్యానుకొని ]

రాముడు:—కాళ్ళలా ఆడించకు. నొప్పెడతయి.

సీత:—చూసారా! నీటిరాపుడికి అడ్డంలా యెంత సన్నగావుందో రాయి. మీద పడి ముంచెత్తేసిలా గోస్తోంది ప్రవాహం.

రా:—ఇందులో నీళ్ళోసుకుంటే యెంతో సుఖంగా వుంటుంది.

సీ:—ఈ ప్రవాహంలోనా? ఎదరగాలికివున్న చెట్టులా అవుతుంది. అదిగాదు. కోకిలగాన శ్రుతితో జతకల్పి యీ సెలయేటి గీతాలు వినాలి. యీ చిగురాకుజొంపాలు చూడాలి. గంతే హరిణ కిశోరాలతో ఆడుకోవాలి.

రా:—ప్రకృతిదేవత నిజస్వరూపాన్ని దర్శించాలంటే యిక్కడే. యీ సౌభాగ్యాలు మన అయోధ్యలో వుండవు. ఇవి పరమాత్మ నిర్మితాలు. అవి మానవ నిర్మితాలు.

సీ:—అయితే యిక్కడ మనుష్యులందరూ?—అంతా ఇంత పొడుగాటి గడ్డాలతోటే కనపడతారా?-

రా:—ఇక్కడ మానవులూ వుంటారు. అడవిమనుష్యులు. ప్రపంచజ్ఞాన శూన్యులు. మనకి కనపడే ఘాతుకవ్యాగాల్లాగే వుంటారు. వారికి ఆకులే వస్త్రాలు. అడవిపూలే దండలు, ఆభరణాలున్నూ. సహజంగా పుట్టినఫలాలే భోజనాలు. తారకాగణశోభితాకాశమే యింటికప్పు.—కాని—జానీ! వారిదే వుత్తమజన్మ. ప్రకృతిమాతచే లాలింపబడే వారిజన్మ ధన్యమైంది.—ఏమరుపాటుగా చూస్తున్నావేం?

సీ:—ఆ కొండప్రక్కకేదో నడచినట్లయింది. పొన్నవృక్షం నడుస్తూన్నట్లుంది. త్రాచుపాములు వ్రేలాడుతున్నట్లు యేమిటోకూడా వున్నాయి.

రా:—వాళ్ళే అడవిమనుష్యులు—ప్రకృతి మాత బిడ్డలు. మంచి బలంగావుంటారు. మనోధైర్యానికి, చొరవకి వాళ్ళకే పెట్టిందిపేరు.

సీ:—అమ్మయ్యో అంతలావుగా వుందేమిటి? మొలనిండా ఆకులు. మెడనిండా పూలదండలు. ఎంత జుత్తో. నల్లగా కారుమేఘంలాగుంది. ఇలా వచ్చేలాగుంది.

రా:—భయంలేదు. ఇటురాదు. అలాపోతుంది.

సీ:—కాదు. యీప్రక్కకే వస్తోంది.

[శూర్పణఖవస్తుంది లావుగా పలంగా వుంటుంది. దీర్ఘాలైన కేశాలు మోకాలిదాకా వ్రేలాడుతుంటవి. మెడలో పులిగోళ్ళదండొకటి పొడుగ్గావుంటుంది. కళ్ళు యెర్రగా కాలిన ఇనపగుండుల్లా గుంటాయి.

కోపంచేత వొళ్ళంతా వేడెక్కిపోయి వుంటుంది. చరచరావచ్చి రాతిక్రింద నిలబడుతుంది ]

సీ:—నాకు భయమేస్తోంది. ఆ ఆడరిన్యాగం మన దగ్గిరకే యెందుకొస్తోంది?

రా:—దాని దారినదే పోతుంది. అలా చూడకు—

[శూర్పణఖ తాగినమత్తుచే తూలుతూ వుంటుంది.]

రా:—పో! అలాపో!—ఎందుకొచ్చావే?

సీ:—మన కెందుకు? ఊరుకోండి...అమ్మయ్యో! అలాచూస్తోందేం మనకేసి? అదిగో!నవ్వుతోంది! విషం కక్కేలాగ. త్రాచుపాము పళ్ళల్లా యెంత నిశితంగా వున్నాయో ఆపళ్ళు—

రా:—భయంలేదులే—మనం, దానికంటికి చిత్రంగా కనపడుతున్నాం. మనలాంటి వాళ్ళని యెప్పుడు చూసివుండదుకదూ. అంచేత ఆశ్చర్యంగా ఆలోకిస్తోంది.

శూర్పణఖ:—నా కొడుకుని చంపిందెవరు?

* * *

నాకొడుకు, అల్ల వెదురుడొంకలో తపసించి నిద్రపోతున్నవాణ్ణి చంపేసి, పోయిందెవరు'—నిన్నే—నీకు మాటలురావు.

[రాముడు తలూపుతాడు.]

శూ:—మాటలురావు—నువ్వు కాదేమో పాపం. ఇంత అందమయినవాడివి నువ్వు చంపివుండవు. కాదూ—ఎలా యెక్కావు యీ రాయి? నేనూ యెక్కాలి.

సీత:—ఒద్దు పొమ్మనండి. అలా తిరిగొస్తోంది

[రాముణ్ణి కౌగలించుకుంటూ చకిత ప్రేక్షణాలతో శూర్పణఖని చూస్తూ వుంటుంది.]

శూ(తిరిగివచ్చి రాతిమీదకూర్చుని):—అమ్మయ్య! ఆడవల్లా తిరిగొచ్చా. కాళ్ళు నొప్పులెట్టినయి. మీరెవరు?

రా:—మేము నరులం.

శూ:—అంటే?—

రా:—మనుష్యులం.

శూ:—తెలీదంటేదు—పోనీలే——(తనలో) మాటలో మాధుర్యంవుంది. చూపులో సొంపుంది. మూర్తిలో ఠీవివుంది. ఎంతఅందం? వీరు మనుష్యులా? మనుష్యుల్లో'కూడా యింత అందచందాలుంటాయా?- నలుపు. నలుపులో యెంత నాజూకు? ఎంతమిలమిల! ఎంతజలజల! నలుపుమీద తెలుపు. నల్లని మొగంమీద తెల్లని చక్రాలకన్ను లెంతవెలుగు? ఆ తెల్లని పళ్ళదగ్గిర ఎర్రనిపెదిమ లెంతమెరుగు? ఆ లేతపెదిమలమీద చిరునవ్వు యెవ్వరెరుగు? చక్కని ముక్కు! కోటేసిన ముక్కు! నీకైన కావులు—ఘాటమైన తీపి... మాణిక్యాలమూట...

సీ:—అలా తలూపుతూ, తేరగా చూస్తోందేం... అదేదో వాసనేస్తోంది అదొచ్చాక.

రా:—అడవిమనుష్యులు మద్యంతాగుతారు. అంచేతే, చూడు, జ్యోతుల్లాగ కళ్ళు యెలా యెర్రగా వున్నయో!

శూ:—ఇంతకన్ను. ఇంత కొను, వనెన్ను. యింతే నడుము. ఇంతింతనరాని నీలకాంతి—నవ్వులుగులికే మొగం. పువ్వులమించిన మోవి. మోకాళ్ళదాకా చేతులు—చక్కనిచుక్క—కళ్ళుమూసుకున్నా మూర్తివు. చూస్తే మైకంకమ్ముతోంది. పలుకరిస్తా - మాట్లాడితే మాణిక్యాలురాలుతాయి యేరుకుంటా - ఒకసిందా—ఓ చక్కనిచుక్కా' ఎక్కడిదీ పూల మొక్క!—ఎక్కడిదీ వెలుగులరిక్క?—ఎక్కడిదీ నల్లనికలువ? ఎక్కడిదీ కన్నులచలవ? చెప్పూ! చెప్పూ! ఏదీ? ఆ తెల్లని మల్లెమొగ్గలనుండి, ఆ యెర్రని దొండపండుమీనుండి దొర్లించు వాగమృతం. నీ చిరునవ్వులో తొలుకాడే అమృతమేది? చిలుకు - నీలాలగని! నిలువు దోపిడిచ్చుకుంటాను.-పలుకు

రా:—నువ్వు చెప్పేదేమిటో తెలీడంలేదు.

శూ:—అంతే - నీ పలుకులో మాధుర్యం తాగా- పువ్వుపువ్వునా అప్పుడుపుట్టిన తేనెకంటే రుచిగావుంది

భళీ! శభాష్! యీ వాగమృతము యింతపసందుగా వుంచే—వక్కాణించక! నీవు పుట్టిందెక్కడో - నీవూరేమో! నీ పేరేమో? - ఇన్ని మాటలలో చెప్పు - వింటా...

రా:—నా కథ నీ కెందుకు?

శూ:—మేలు. మేలు. పలికినతప్పా! ఒప్పుల కుప్పా!

రా:—తప్పేల? లాభమేమని అంటిని.

శూ:—లాభమా! చెవులవిందు - చెవులకువిందు - ఏమందువు?

రా:—కాకున్న.

శూ:—కన్నీరున్న-దుఃఖమున్న-

రా:—సరిలే. అదెందుకు కల్పించాలి యీ స్వల్ప విషయంలో. నేను అయోధ్యరాజు కొడుకును. నన్ను రాముడంటారు. యీమె నాభార్య జానకి.

[ఇంతలో లక్ష్మణుడు వస్తాడు. ఎర్రగా బొద్దుగా వుంటాడు. మూపునవిల్లు, భుజం మీద పుల్లలమోపు. నెత్తిమీద పండ్ల మూట—చేతిలో పరశువు వుంటాయి. మొహంలో శౌర్యసౌందర్యం వెలుగుతూ వుంటుంది ]

లక్ష్మణుడు (సరుకులన్నీదింపి ఓ ప్రక్క పెట్టి నిలుచుంటాడు):—అన్నా! యీ జంతువుతో ఆడుకుంటున్నారా!

రా:—తమ్ముడా! చూచావ్...ఇతను నాతమ్ముడు. లక్ష్మణుడు. మమ్మల్నిముగ్గుర్ని యిక్కడ, చిత్రాలు చూసి, మునుల్ని దర్శించి, వాళ్ళకు వుండే కష్టాలు తొలగించిరమ్మని పంపాడు మాతండ్రి.

శూ:—అయ్యో యీ లేతనారాలు అడివిపాలా! యీ మృదుశరీరం ముండ్లపాలా! మీ నాయనకి బుద్ధి లేదు. మతిలేదు. పోనీలే...

ల:—యీదండకం కట్టిపెట్టు-పో-అడవుల్లోకి.

శూ:—ఎర్రనయ్యా! నాచిత్తం ఒత్తిడి చేస్తావెందుకు? నీ అన్నతో నేనేదో చెప్పుకుంటూంటే... నీకేం!

రా:—తమ్ముడా వుండు......కాంతా! కథకానీ.

సీ:—దీనితో మనకెందుకు? పొమ్మందురూ!

శూ:—పొమ్మంటురూ?...ఏం?...నల్లనయ్యా! నువ్వెంతో మంచివాడివి. నీ తమ్ముడు. ఆపిల్లా మంచి వాళ్ళుకారు. పొమ్మను వాళ్ళనిమారంగా—అప్పను—గాని—నా కథ చెప్పనా?-

ల:—ఏంకథ?...

శూ:—ఎంత కోపమో ... చూసావా?... నీ తమ్ముడు.

రా:—తమ్ముడా!...యీ కలాపం గానీ... ముచ్చటగా వుంది. ఏదీ నీ కథ చెప్పు!

శూ (సగర్వంగా):—ప్రపంచకాన్ని మండింప చాలేమావు...తలక్రిందు చేయగలిగే తావు...'ఆహా' అని గుటకవేయింపజాలే రూపు...కలిగి...రాక్షస భూప్రభువైన రావణాసురుని ముద్దుల చెల్లెలిని. దేవతలు తెల్లపోవ-దేవనాధుడుడిల్లపోవ-పెళ్ళన కైలాసంవిరచి, వల్లకాటిపతితో-వాని పరివారంతో, తలకెత్తాడు.

ల:—చాలు-నోరుముయ్యి-పో-అవతలికి.

శూ:—చూచావా! వాని ధూర్తత్వం - నాగుండెలెట్లా కొట్టుకుంటున్నాయో, గుండెలపై చెయ్యేసి చూడు...... (దగ్గరగ వస్తుంది.)

రా:—భయంలేదులే - సారంగాయుండే చెప్పు.

శూ:—నేను-నేను-చెప్పడునా?- మరి-కోప్పడవు కదా...

ల:—ఏనుగులాంటి అన్నున్నాడుగా నీకు—ఇంక భయమేం.

శూ:—మరి-మరి-చూడు - ఆచెట్లు ప్రక్క వృక్ష దంపతులు - ఆచెట్టుమీద గువ్వ గోరింకలు - మరి - నువ్వూ-నేనూ-అలా......

[లక్ష్మణుడు కోపంతో పళ్ళుకొరుకుతూ వుంటాడు.]

రా (రహస్యంగా వారిస్తూ):—కామినీ! నీపలుకులు కడువిచిత్రంగావున్నాయి. చతుర్దశ భువనాలు గగ్గోలుపరిపించే దశకంఠు సోదరివన్నావు. నీవు ... ...కాషాయగుడ్డలు కట్టుకొని తిరిగే మాతో......

శూ:—అయ్యో! నారాజా! నేమాత్రం యెక్కడి దాన్ని? యీ అరణ్యాలలో ఆకులపై శయనిస్తా. కాయకూరలు తింటూ - చిగురాకుకోయిలపాల గానం విని ఆనందిస్తా. తీయని సెలయేటినీరు త్రాగుతా - నీవూ అంతే గా - బాగుంటుంది దాంపత్యం ... మరొక్క మాట -

ల:—ఒకటీ లేదు - రెండూ లేదు - నోరుమూసుకో- ఫో-ఫో-

శూ:—యీ గ్రహమేమిటి వల్లనయ్యా! పొమ్మను పీడ్లి.

[సీత రామునిచాటునుండి తొంగిచూస్తూ వింటూంటుంది.]

రా:—కామినీ! మరిచిన్నో—? ఇది నాభార్య - సీత -

శూ:—అకాలమెరుపుతీగ - సంపూర్ణ చంద్రమండలం......నారాజా! - వీళ్లు రాహుకేతువులు. నా మాటవిను-మనదారికడ్డు.

రా:—అడ్డులేని సలహా చెప్పనా?

సీ (వారింపుచు):—నాథా! పొమ్మందుకూ! దాన్ని. ఎందుకీ కాలక్షేపం-

శూ:—ఏదీ! అడ్డులేని సలహా! చెప్పచెప్ప - పువ్వులలో అప్పుడు పుట్టినతేని, నీబొజ్జనిండా పోస్తా-

రా:—అదుగో! అటుచూడు-వాడు నాతమ్ముడు. బంగారుకలాపులా గుంటాడు. ప్రస్తుతం భార్యని యింటిదగ్గిర విడిచొచ్చాడు-వాణ్ణి...

[లక్ష్మణుడు నవ్వుకుంటాడు.]

శూ:—అవును నిన్న-వద్దు-సవతిపోరు. తొప్పడు తున్నాడని వాణ్ణి చూడలేదు కాని, యెంతరూపం? ఎంతవొయ్యారం? ఎంత మాధుర్యం? ఆ చక్రాల కళ్ళలలో శృంగారరసం జాలువారుతోంది - హాయి! హాయి!-ఆ, మెలితిరిగిన, బాహువులలో నలిగిపోతే నే ఆనందం - అవును - ఎర్రనయ్యా! నువ్వేబాగున్నావు. నిన్ను ముందు పిలవలేదనా కోపం? - నువ్వ తొప్పడు తున్నారని భయపడ్డాను చూడ్డానికి నాకు వచ్చావు. ఇక లే-గాలిలో తేలిపోదాం! చెట్ల తేచిగుళ్ళమీద నాట్యమాడదాం! మేఘాలమేడలో- మెరుపు దీపాలలో...

ల:—వెర్రిదానా! సంగతి గుర్తించలేవేం? నీ అనురాగం తెలిసికోడానికి, మాఅన్న అంటే, యింతట్లోకే తేలిపొయ్యావేం? నాతో నీకేంసుఖం? నేను వీరికి సేవ చెయ్యాలి. నేను సేవకుణ్ణి-నువ్వు సేవకురాల వవుతావు.

శూ:—ఔను. ఎర్రనయ్య చెప్పినమాట నిజమే. నేను దాసిగావుండలేను బాబు. సవతిపోరేనా భరిస్తా. అదిమాత్రమెందుకుంటుంది? నారెక్కలమీదెక్కించుకొని, మేఘమేఘానికిపోయి, ఆనంద కాసారాలలో యీదులాడుతూవుండం మరి! నిన్నూ నామల్లెపూలతో నిలువెల్లా అలంకరించి, పూగున్నలాగ, గాలిలో తేలిపోతూవుంటే,- చుక్కలకాంతిలో చక్కలిగింత పెట్టుకుంటూ, మల్లితీగెలా పెనేసుకుంటూ, పోతూంటే - వీళ్ళు మనతో రాగలరా? వస్తారా! ఏమంటావు...

ల:—శృంగారరసం వెల్లివిరిసిపోతోంది. వర్ణించు చాలాబాగున్నాది.

శూ:—హాస్యాలా, నామాటలు! నాశక్తి నీకేం తెలుసు. అంతరిక్షంలోకి అంతలో యెగిరేశక్తి నాకుంది పువ్వుపువ్వునా ప్రవేశించడానికి అనుకూలమైనరూపం ధరించడానికి నేర్పు నాకుంది. కన్నులలో నిప్పులు సృష్టించగలను. గాటలలోంచి, పిడుగులు కురిపిస్తా- ఇంతలో యిక్కడ మాయమై; అంతలో లంకలో తేల్తా. నాకు అసాధ్యాలు సాధ్యాలు. చూడు నా శరీరం అంతా పూలమయం. యీపూవులలో యిమిడి పొమ్మంటే యింతలో యిముడుతా.

ల:—నోరుముయ్యి. మధుప్రలాపాలు నిరాఘాట మాతున్నాయి. (లేచి గెంటుతాడు)

[శూర్పణఖ చకితయై నిలుచుంటుంది సీత చూచి రామునిచాటునుండి ముసిముసి నవ్వులు నవ్వుతుంది]

శూ (ఉడుకుమోతుతనంతో):—ఆడది ఆడదాన్ని చూచి నవ్వుతోంది. ఆడదాని కష్టసుఖాలెరుగవు నువ్వు? నీ భర్తతో యేకాంతం కోరుతుంటేం నీ మనస్సు? నీ కరాలు నీభర్త భుజాల్ని పెనేసుకుం

టాపేం అప్రతిష్ఠగా?...నీకళ్ళు నిప్పులై, నీధర్మ చూపులతో కలిసిపడతాయేం?...నవ్వుతున్నావా?-- నవ్వదుగాని,...నీధర్మ, నా శౌటుయోగ్యలలో ప్రాగుతూండడం చూచినప్పుడు, ఒలకపోద్దువుగాని యీ నవ్వు... (వికృతంగా నటిస్తుంది)

సీ:—నేనేమన్నాను. ఊరికే నవ్వొచ్చింది. నవ్వకున్నా. అదీ తప్పా?

రా:—నీకెందుకు? నువ్వూరుకో! ..అదిసాగినకైపు అప్రలాపాలికి అర్థం ఉండదు.

సీ:—నాకు భయమేస్తోంది. పంపెయ్యండి దాన్ని-

శూ:—ఏం? భయమేస్తోందా? ఎంత సంగనాచివే! భయంలేని స్థలానికి పంపేస్తా నస్తావా?...భయమేస్తోందీ? నన్ను పంపెయ్యాలీ. చూడు...నీ మొగుణ్ణి మూపుమీద యెక్కించుకొని, ఆకాశమార్గాల పుష్పవిమానంలో సంచారంచేస్తాను. నువ్వేంచేయగలవో చూస్తాను.

రా:—కామినీ. స్త్రీ సహజమైన సిగ్గువిడిచి, పలుకుతున్నావు కొంత సవరించుకో...

శూ:—సిగ్గా. ఎందుకుసిగ్గు? ఇంతమందిలో నీ భార్య నిన్ను కౌగలించుకొంటూంటేం రెండరొమ్ము తోటి సిగ్గులేకుండా! నువ్వు 'భయంలేదులే' అని ఒళ్ళోకితీసుకొని, చెక్కిళ్ళు రాస్తున్నావేం సిగ్గులేక? యివన్నీ చూస్తు...నువ్వు చేస్తు ..పైగా... 'స్త్రీ సహజమైనసిగ్గని' నాకు నీతులు చెబుతున్నావా?...... రా... (తిప్పుకుంటూ దగ్గిరగా నడుస్తుంది.)

ల:—ఆ...గు...తాపోపహారణం పాదప్రహారణాలతో గాని సాధ్యమయ్యేలాలేదు, కదు. ఆడదానవని యింతసేపూరుకుంటే...కొంటి పనులు హెచ్చుతున్నాయి. పద... దిగురాయి...

శూ:—దిగురాయి...నీ తాతసొత్తా - అబ్బసొత్తా? చూడు నల్లనయ్యా యీ కాట్లకుక్కల్ని నామీదకి ఉసికొల్పి - నవ్వుకుంటున్నావా! నాసవతి నన్ను చూచి పళ్ళికిలించనా?...ఆ రొమ్ముకోతి దూషించనా?... అబ్బా - నన్నెందుకింత బాధపెడతావు?

రా:—నువ్వు మాట్లాడ్డానికి సరియైనదానవి కావు. మా తమ్ముడు దుడుకువాడు. కోపంవస్తే ఆపుకోలేడు. ఎందుకు బాధపడతావు - పో -

శూ:—ఏం? బెదిరిస్తున్నావు? కోపంవస్తే ముక్కు-చెవులూ కోస్తాడేమిటి?

ల:—దానికి కోనిలేనక్కరలేదు. చేతిలోపని.

[సీత ముసిముసినవ్వులు నవ్వుతుంది]

శూ:—సిగ్గుందా నీకు? అలా పళ్లికిలిస్తావేం!

[మీదిమీదికిపోయి, కొంగుపట్టుకొని, క్రిందికి వురుకుతుంది. సీత రాయిమీద పడుతుంది. రాముడుపట్టుకొని కోపంతో]

రా:—రింటరీ. నువ్వు శిక్షార్హురాలవు. నీకు తగిన శాస్తికావాలి. ఆడదానికింత ఆగడమా?

ల:—అన్నా. సెలవా ..

రా:—ఎంత తుచ్ఛురాలయినా ఆడదాన్ని చెయ్యిచేసికోరాదు. తొందరపడకు...ఏమి కొంగువదలవే?-

[శూర్పణఖ వదలదు]

ల:—అనవసరముగ తన్నులుతినకు,

శూ:—అంతచేవుందా? ఆడదాన్ని తన్నే శక్తి వుంటే - ఆడది మీదపడితే, బిగించుకు కూర్చోగలవ్రా - పో -

[లక్ష్మణుడు చరచరా, రాతిచిగురుకు వెళ్తాడు. శూర్పణఖ యింకా లాగుతుంటుంది]

ల:—విడుస్తావా? విడవ్వా! మొగంపగిలీలా తన్ను తాను లేకపోతే -

శూ:—ఇంకా చిగురికిరా. కాళ్ళొట్టుకులాగితే క్రింద పడతావు - ఏదీ. మగతనం? రా. తిన్నుడువుగాని.

[లక్ష్మణుడు తటాలున సమీపిస్తాడు]

రా:—ఆడది - చెయ్యిచేసికోరాదు - ఆనతి.

[శూర్పణఖ లక్ష్మణుని రెండంకాలు పట్టుకుంటుంది. కుడికాలుతో మొహంమీద తన్నుతాడు. ముక్కుచిదికి నెత్తురు కారుతుంది.]

శూ:—తస్నేవురా...తస్నేవురా...

[శూర్పణఖ ముక్కుకట్టుకొని, రాతిపైకెక్కి కలియబడుతుంది. లక్ష్మణుడు రెండు చెవులూ పట్టుకొని మెలితిప్పుతాడు. మీదికి రాబోతూంటే, చేతులు బిగించి, దూరంగానే వుంచుతాడు. గింజుకుంటుంది]

శూ:—ఒదులు...చెవ్వలు...ఒదులు..

ల:—వదులైతే ఊగిస్తా - పింజారీ - మేఘాల మేడలో - మెరుపుదీపాలలో నాట్యమాడుతోందా మనస్సు - ఇదిగో. గింజుకులాడుతూంటే - చెవులు తెగి చేతికివస్తాయి.

[శూర్పణఖ అకస్మాత్తుగా తన్నుతుంది లక్ష్మణుడు చెవులుపట్టి లేవనెత్తి, గిరగిర తిప్పుతాడు. రెండుచెవులు తెగి చేతిలోకొస్తాయి. శూర్పణఖ రాతిపైనుండి, తల క్రిందుగా క్రిందపడిపోతుంది. క్రిందకి దిగబోతాడు లక్ష్మణుడు.]

రా:—తప్పు! తప్పు. ఇంక దాన్నేమీచెయ్యకు. క్రిందకుదిగకు. అదేపోతుంది దాని దార్నది.

సీ:—రాక్షసి! యెంతకైనా తగుతుంది. శంఖినీజాతి- పర్ణశాలలోకి పోదాంపదండి. భయమేస్తోంది. ఇది మళ్ళీ వస్తుందేమో?—

ల:—మళ్ళీవస్తుందీ! రెండుకోజాల్లాకే తెక్కదూ! మళ్ళీ కళ్ళపడితే కీకోసేస్తాను. అయింది శూర్పణఖ శృంగారం. పదండిపోదాం.

(ముగ్గురూ లేచి నవ్వుకుంటూ వెళ్ళిపోతారు)

—వాడ్రేవు చలపతిరావు.

# యౌవనోద్బోధము

౧

పదియు నెనిమిది యేడులు ప్రాలుమాలి
బాల్య రాక్షసీ వదనగహ్వరమునందు
మృత్తికారాశి వోలె శయించి నాము
దేశమును. ప్రేమ, స్వేచ్ఛయు, దెలియకుండ

౨

అస్మదంధ జీవిత విహాయసమునందు
యౌవనోష్ణాంశు: డానంద హాసగరిమ
జ్వలితమయ్యెడ; జడభావభయదతమము
లరిగినవి; లెండు, తరుణ వయస్కులార!

౩

బాల్యజాడ్య గహ్వరతమః పటలి నుండి
బయటికేతెంచినాము; యౌవనవిలాస
రాగడోలికలో నూగులాడుకొనుచు
పాడుదము రండు స్వాతంత్ర్య భవ్యగీతి!

౪

దాస్యపంక మగ్నంబులై తళుకు గొనని
ప్రణయసుమముఁ, స్వాతంత్ర్యపుష్పమ్ము గూడ
కడుగుదము పూతవీరరక్తామృతమున;
జల్లుదము దేశమాతృకా చరణసీమ.

౫

కలత నొందక విద్యుత్కత్తులను బోలి
పోరుదము రండు స్వాతంత్ర్యభూతి కొఱకు;
దాస్య బంధాళిఁ ద్రెంచి శాత్రవుల దఱుమ
పోవుదము రండు పశ్చిమ భూమివఱకు!

౬

వీరభావార్ద్రి యౌవన బృందమెల్ల
ధన్యమాతృ సంసేవనోత్సవము కొఱకు
బయలుదేరుఁడు స్వేచ్ఛా శుభప్రసూన
దామములతోడ, శత్రు రక్తమ్ముతోడ!

౭

రక్తనాళమ్ములో పొంగి ప్రాకిపోవు
శౌర్యరుధిరమ్ము నాఁకట్టి శాంతిజనని
గొలువఁ బోకుఁడు కాలమ్ము నిలువఁబోదు;
ఉఱుకుదము రండు యౌవన సోదరులము!

౮

ప్రణయ రాజ్యమహోన్నతాక్రాంతిఁ గొనుచు
పరవిపాభీల దంష్ట్ర దీప్తాగ్ని నెల్ల
వీరశోణితాపగ నార్పి విజ్జ వీగి
తిరుగుదము నిత్య మోద మందిరములందు.

౯

అకట! ఒక్కచుక్కని స్వేచ్ఛాసవమ్ము
ద్రావగాలేక దాస్య కారాగృహమున
కర్మభూమి యౌవనశక్తి కడఁకనడఁగి
యుండగలదె ఆశాశల మండకుండ?

౧౦

ప్రబల నూతన యంత్ర సంపత్తినైన
నణగబోదు దుర్వార దివ్యాభయుక్త
శస్త్రబలయుత యౌవనశక్తి అరయఁ
ప్రజ్వలించెడు అగ్నిపర్వతము వోలె!

౧౧

శాంతిదేవి సర్పించి నిశ్చలసమాధి
నుంట వృద్ధజనావళి కొప్పు; గాని
మెఱుపు పగిది దిగంతాలఁ దరళితమగు
యౌవనోద్రేక మేరీతి నాపనగును?

౧౨

ప్రథిత కౌమారశక్తి ఆలయమునందు
కలియు వేళనె యువక వర్గమున కదను
మాతృపూజాప్రఫుల్ల విఖ్యాతి గొనగ,
అతుల పరమాత్మ సామీప్యమందు నిలువ!

౧౩

ఇంత తరుణాగ్ని యెదల జ్వలించుచుండ
లోనవాపోసి ముగ్ధత్వ మూనగలమె?
ప్రాయముడిగిన వెనుక శోభలు నశింప
చేయునది లేదు బ్రతుకెల్ల హేయమగును.

* * *

౧౪

ఉపలములగూడ త్రుళ్ళింత లొలయఁజేసి
పద పదమ్మున ఆవేశభావములుల
ఆంధ్రయువకృత్య వీరకావ్యమ్ము నేఁడు
కడఁక వ్రాయుము యౌవన కవికుమార!

—ఓలేటి సీతారామమూర్తి, బి.ఏ.

# "తప్పించుకు పోయిన కథ"

'నేను బి.యే. ప్యాసయినాను. దీనినిబట్టి ఎమ్మే పరీక్షకు వెళ్ళవలెననీ, అది వీలు గాక పోతే పోనీ బి. యిడి అయినా తప్పక కావలెననీ అనుకుంటూనే ఉన్నాను. చదువుకుండే రోజులలో ఎలా చదువు కున్నా, బి.యే. ప్యాసయింతర్వాత తెలివితక్కువవాణ్ణని ఎవరూ అనుకోరు. ఒకవేళ అనుకున్నా పరోక్షంగా అనవలసిందే. దానికిగూడా వాళ్ళకిప్పుడు వీలులేదు. సమక్షంగా అన్నా, పరోక్షంగా అన్నా నాకు చూచాయగా తెలిసిందంటే, చిన్నచిన్న నే కథలు గూడా వ్రాయడం నేర్చుకున్నా — వాళ్ళకు ఆ సంగతి తెలుసునో తెలియదో — గనుక కథలలో ఏకేశానంటే అందరికోళ్లూ పడతాయి. కాని పరోక్షంగానన్నా వాళ్లు అన్నారని నాకు తెలిసేదెలాగు? ఎవరూ సమాధానం చెప్పలేరు. నాకు తెలుసు. నేను చెప్పనా? ఇప్పుడే చెప్పాను కథకుణ్ణి కవినీ అని. కనుక నేనే చెప్పాలి ఆ ప్రశ్నకు సమాధానం. చెప్పలేరు కదూ! చెప్తాను — చెప్తున్నా తరువాత మీరందరూ నామీద అసూయ పడితే లాభంలేదు. చెప్పేస్తాను - అసలు వాళ్ళు పరోక్షంలో నన్నంటారన్న సంగతికూడా నాకు తెలియనే అక్కర్లేదు! ఎవరైనా పరోక్షంగా అంటున్నారేమో నని ఊహించే కథలువ్రాస్తాను వాళ్ళందరినీ ఏడిపిస్తా. అంతే. ఇహ ఎవళ్ళకన్నా ఆ ఊహ కలిగినా అంతటి తోనే నిర్మూలంకావాలె.

మరోసంగతి. నేను కొంచెం అందగాడిననీ, దానికి తోడు కవిభావాల్లో మెరుగుచేత నా అందాన్ని ఇను మడింపచేస్తాననీ కొంతమందికి అసూయ ఉంటే ఉండ వచ్చు. అంతమాత్రాన నాకు వచ్చే నష్టమేముంది గనుక? నే నందగాడినని నాకే తెలుసు, నాభార్యా' నా సహ ధర్మచారిణి ఒప్పుకోదుగానీ. ఆవిడ ఒప్పుకోకపో యినా ఫరవాలేదు. ఆవిడ నన్ను వదిలివెళ్ళడానికి వీలు లేకుండా ధర్మాధర్మ శాస్త్రాలన్నీ నాపక్షంగా ఉంటూం డగా ఆవిడకు నా అందంసంగతి తెలిస్తేనేమి? తెలియక పోతే నేమి? ఇంతకూ ఆవిక నే నందగాణ్ణి కాదనడా నికి కారణం తెలుసునా? ఒకటిరెండున్నాయి. అందులో ముఖ్యమైంది అభిప్రాయభేదం. నా అందాన్నిగురించింది కాబట్టి నాకు తీవ్రంగా కోపంవచ్చింది. కాని విధిలేక రాజీకి ఒప్పుకోకతప్పిందిగాదు. రాజీ ఏమనంటే మా ఇద్దరికీవచ్చిన తగాదా పూర్తిగా అభిప్రాయభేదంవల్ల ఏర్పడింది గనుక ఎవరి అభిప్రాయం వారి కుండ వచ్చునని.

రెండోకారణం చెప్పనా? పెద్దచిక్కు ఎక్కడ వచ్చిందంటే ఆవిడ చాలా చదువుకున్నదని అందరి అభి ప్రాయం. ఇంగ్లీషు కాను. కాబట్టే అది చదువు కాదని నా అభిప్రాయం. చదువుకున్నదానినని ఆవిడ అభి ప్రాయంగూడానూ ఆ అభిప్రాయం ఎక్కడా వ్యక్తం గాకపోయినా? ఆవిడకు ఆ అభిప్రాయం ఉండకపో తుందా అని నా ఉద్దేశ్యం. చెప్పవద్దూ. తిరిగి ఇక్కడ కూడా అభిప్రాయభేదమే. వీటితో సతమత మవుతు న్నాను. ఏంలాభం? ఎన్ని అభిప్రాయభేదాలు కలిగినా, ఇందులో ఒకసారైనా నా అభిప్రాయం నెగ్గించు కుంటే పోనీ తెలివితేటలున్నందుకు ఫలితంకలిగిందిగదా అని సంతోషింతును. ఈలాగా జీనియసులు ప్రపంచక ములో పేరూ ప్రతిష్టా లేకుండా పడిపోయే వాళ్ళెంత మంది?

నాభార్య చదువుకున్నది. (పోనీ ఆవిడయొక్క గాని, ఇతరులయొక్క గాని అభిప్రాయంలోనే కానివ్వండి) కావడంవల్ల నా బ్రతుకు దుర్భరమైనంత సంతాపాలపాలు అవుతున్నదంటే నమ్మండి! ఏంచెయ్యను? ఏమి చెయ్య డానికి వీలుకన్పడలేదు. ఏమన్నా అంటినా 'మీకింకా ఏమి తెలియదండీ. అన్నిటికీ పసిపిల్లల్లాగు' అంటుంది కూడాను. 'ఏమిటిరా ఎన్నిఅన్నా ఈలా పడిఉంటు న్నాను. నా తెలివంతా ఏమయిపోయిందా అని ఆలో చిస్తూ ఉంటాను.

ఒకసంగతి చెప్పడం మరచిపోయినాను. నా తెలివి

ఇంకా కొంచెం జ్ఞాపకశక్తి కూడా ఉంటేనా? ప్రపంచాన్ని ఆడించేవాణ్ణి ఉర్రూతలూగించేవాణ్ణి జగన్నాటక సూత్రధారినయ్యేవాణ్ణంటే నమ్మండి. ఏమిచేసేదీ నేను చెప్పితే ఏమిలాభం? చేసి చూపింతును అక్కాస్త జ్ఞాపకశక్తిలేదు గాని. అది లేకపోవడంవల్లనే మా ఆవిడ ఎన్నోసార్లు 'ఎంత మతిమరుపండీ. ఇంత జ్ఞాపకంలేకపోతే ఎల్లాగా?' అని మెల్లెమెల్లెగా చివాట్లుపెట్టింది. ఇంతకూ చెప్పవచ్చింది ఏమిటంటే నాకు మా ఆవిడమీద ఉన్నకసి ఏలా తీర్చుకున్నానో తెలిసిందా! మా ఆవిడ అందగత్తె అనీ. తెలివికలదనీ చెప్పేమాటలు నేను నమ్మను ఏమాత్రం కూడా. మావాళ్ళంతా అలాఅంటారనే నేను వ్యతిరేకాభిప్రాయం ఇస్తున్నాను నా మనస్సులో ఏ అభిప్రాయం ఉంటేనేమి మా ఆవిడ అందకత్తెకాదని చెప్పడానికి మరో కారణం ఏమిటంటే ఆవిడ గ్రహించవద్దూ నన్నడంచేత నేనంటున్నానని ఆవిడను. ఆవిడమటుకేం చెయ్యగలదూ! నా అభిప్రాయం నాదే ఆవిడ అభిప్రాయం ఆవిడదే.

ఈమధ్య ఒకసంగతి జరిగింది. అప్పుడూ నా స్వతంత్రత నా అధికారం ఆమెకు బాగా వ్యక్తమయిన వనుకుంటాను. ఆవిడ తెలివిగలదాన్నని ఇహ ఈ జన్మలో అనుకోదనుకుంటాను. అలాంటిదెబ్బ అది. ఆ రోజున ఆమెకు బాగా జ్వరంవచ్చింది. అదివరకు నాలుగు రోజులనించే వస్తున్నా, ఆరోజు మరీని. లేవనే లేదు. సాయంత్రం షికారువెళ్ళేటప్పుడే చెప్పుచూసి వెళ్ళాను. పెండలాడే వద్దామని నా అభిప్రాయం. ఒక్కర్తేనని. పిల్లలు గోలచేసి ఏడిపిస్తారనీ నాకుమాత్రం తెలియదూ? వద్దామనే అనుకున్నాను. అయితే చిన్నప్పటినుండీ నాకు ఒకచిన్న అభ్యాసం ఉన్నది. మంచి అభ్యాసం అని నాకూ, దురభ్యాసం అని ఆమెకూ, ఆమెకే కాదు మావాళ్ళ కందరికీ అభిప్రాయం. నలుగురితో కలిసి వెళ్ళేటప్పుడు నిర్మొహమాటంగా 'నాకు పనిఉందండి నే నిలావెళ్ళుతాను' అనిగాని 'నేనీ రోజున మీతో షికారురానండి. ఇంటిలో కొంచెం జబ్బుగాఉన్నద'ని కాని అనలేను. కంపెనీ కోసమయితేనేమి బాతాఖానీ కోసమయితేనేమి వాళ్ళేమైనా అనుకోనిపోతారేమోనని అయితేనేమి వాళ్లెలావెళితే అలా వెళ్లుతాను.

అందాకా ఎందుకు ఒకసారి నలుగురం స్నేహితులం వెళ్ళుతుండగా ఎవరో డిస్ట్రిక్టు ఆఫీసరుట ఒకాయన కనబడ్డాడు. మాలో ఒకాయన అయ్యన్న బాగా ఎరుగు. ఆయన తనతో ఉన్న మా స్నేహితులిద్దర్నీ ఎరుకపరచి నన్ను ఎరుకపరచడం మానేశాడు. ఆయన వెళ్ళుతూ అందర్నీ. కాఫీకి ఆహ్వానించాడు. అందర్నీ అంటే ఆయనకు ఎరుకపరచబడినవాళ్ళను మాత్రమేనని వేరేచెప్పాలెనా? నాకు కష్టమనిపించింది. రేపు ఎలాగు వీళ్ళు ముగ్గురూ వెళ్ళుతూ నన్నుగూడా పిలుస్తారు ఏమైనా సరే వెళ్ళకూడదనుకున్నాను. దానికి పెద్దప్లానే వేశాను. మరునటిఉదయం వాళ్ళు వచ్చేసరికి వెళ్ళడానికి వీల్లేని పనిలో ఉందామని నిర్ణయించుకున్నాను. తీరా తెల్లవారేసరికి వాళ్ళు రానేవచ్చారు. నేనుచుట్టుకు ఊరుకున్నానా? వాళ్ళెప్పుడువచ్చేది నాకు తెలుసునాయెను. నేను తలంటి నీళ్ళుపోసుకునే ప్రయత్నంలో ఉన్నాను. వాళ్ళు నే తలంటిపోసుకున్నదాకా కూర్చుంటే ఏం చెయ్యను? చివరకు పోకతప్పిందిగాదు. అందం ఎందులో ఉందంటే ఆ ఆఫీసరుగారిన్నది. ఆయన నేం కూర్చుని మాట్లాడడం ఆరంభించగానే 'ఈ స్నేహితులెవరండీ? నే నెరుగను' అన్నాడు. రాగానే అడిగితే బాగుండదని అందాకా బిగబట్టాడు గాబోలు. నిజంగా, నమ్మితే నమ్మండి, నమ్మకపోతే మానేయండి అప్పటి నా మొహంచూస్తే నాఅవస్థ గ్రహించవచ్చు. ఏంలాభం? నా అభ్యాసం అలాంటిది. ఇప్పటికయినా నా అభ్యాసం చెడ్డదని నేను నమ్మను. మర్యాదాకోసం చేస్తాను. ఇతరులచే మర్యాదవల్ల చిన్నచిన్న బాధాలు సంభవించినా నా ఆశయం మంచిదయినప్పుడు నాకేమి లెక్క.

ఇంతకూ చెప్పవచ్చింది మరిచాను. ఆరోజునకూడా ఈలాగే స్నేహితులతోగలసి షికారువెళ్ళితే ఇంటికి రావడం ఆలస్యమయింది. నేనింటికివచ్చేసరికి మా ఆవిడ వంటయింట్లో పడుకుంది అన్నంమాత్రం వండింది ఏలావండిందో? మధ్యాహ్నం వచ్చ్చేసుకుని అన్నం తినవలసి వచ్చింది. అందుకుగూడ ఏమనలేదు సుమండీ నేను. పిల్లలు అఖిలంగా గోలచేస్తున్నారు. అందు

లోనూ మాపిల్లవాడు మహాగోల చేస్తాడు. అది గోల గోలగాదు.

అయితే నా కాగోల అంటే ఇష్టమే। చెప్పవద్దూ. ఇష్టంగాక ఏమవుతుందీ? నేనేం చెప్పినా వాడు వినడు. నేనంటే వాడికి సుతరామూ భయంలేదు; కోపపడడం నాకు తెలియందే? తెలియకపోవడమే కాదు, కోపపడడం చాలాతప్పని నాఅభిప్రాయం. పిల్లల మనస్సులలో వినిర్మలభావా లుత్పన్నమయి వాళ్ళు నిర్మలానందాన్ని పొందేరోజులవి. ఆరోజుల్లో వాళ్ళు కవులను మించుతారు. కథకులను మించుతారు. వాళ్ళు మనస్సులలో ఊళ్ళేల్తారు. ఏరోప్లేనులు నడిపిస్తారు. ఎన్నో చేస్తారు. అలాంటి రోజులలో వాళ్ళను అదుపులో ఉంచడమేమిటి? అభిప్రాయ భేదాలతో సతమత మవుతున్నా నన్నానుగదూ. మా ఆవిడకు నాకు తిరిగి ఇక్కడ అభిప్రాయభేదం తారసిల్లింది. ఎంత స్వేచ్ఛ అన్నా వాళ్ళ యిష్టంవచ్చినట్టు చేస్తూ, పెద్దల భయభక్తులు లేకపోతే చెడిపోతారని ఆవిడ ఆలోచన. ఆసంగతికి తరువాత వస్తాను.

ఆరాత్రి వాళ్ళలా గోలచేస్తుంటే నాకుగూడా విసుకు జేసినమాట నిజమే. అయితే నామాట వినరుగా వాళ్ళు. ఊరుకున్నాను. మాఆవిడ - మాట్లాడడానికి ఓపిక లేదు. మూలుగుతూ ఉన్నది - అన్నదీ 'మీరుఇటు-బూనాన్న అటు చంపండిరా నన్ను. చలిజ్వరంవచ్చి వచ్చిపోతుంటే ఇంత ప్రొద్దుపోయి వచ్చినట్లే మీరు గూడా ఈలా చంపుతున్నారేమి?' అని. నాకు నిజంగా చాల కోపంవచ్చింది. ఇంకోడయితే, జ్వరం వచ్చిందని ఆలోచనలేకుండా, భార్య చదువుకున్నదని, తెలివిగలదని పేరుగలదని అయినా విచారణలేకుండా చెర్నా కోల తీసుకుని బాదేవాడు. జాలిపేగులవాణ్ణి కాబట్టీ, పరువు ప్రతిష్ఠలకోసం ప్రాకులాడే వాణ్ణి కాబట్టీ కోపం చాలావరకు ఆపుకున్నాను. కాని ఏమి అనకుండా ఊరుకోలేక పోయినా. 'ఏడిచారు! తమరంటూ వెళ్ళేటప్పుడు పెందలాడి రమ్మని చెబుతుమిస్తే రాక పోయినానా. పోని అంత కష్టంగా ఉంటే మడిగట్టు కోకుండా ఊరుకున్నట్లయితే నేను వచ్చి వండుకుతినే వాణ్ణిగా' అన్నాను. నేనెందుకు రావాలి నా కామాత్రం స్వేచ్ఛలేదా అని ఆలోచనవచ్చింకేమో ఆకోపం పట్ట లేక పోయినాను. కోపంవల్ల అన్నంగూడ లోపలికి పోయిందిగాదు. ఛప్పున అన్నంముందరనించి లేచి వెళ్ళాను. అదిగూడా ఒకందుకు మంచిదేనని ఆలోచించాను. ఆవిడ అలా తెలివితక్కువగా మాట్లాడినందుకు నాకువచ్చిన మితిలేని కోపం ఆవిడకు తెలుస్తుంది గదా.

మావాణ్ణి చూస్తే మా ఆవిడకు మహాకోపం. ఆవిడకూ వాడికీ అజన్మశత్రుత్వము ఏలాఏర్పడ్డదా అని. ఎప్పుడూ వాణ్ణి సాధింపులే. నాదగ్గర ఉంటాడుగనుక ఏమిచెయ్యడుగాని నేను లేకుంటే తన్నేస్తుంది. నాకింకో అనుమానంకూడాను. ఆమె బహుశా 'నాయనకు తగిన కొడుకువేరా' అని గూడా అని ఉంటుంది. లేకపోతే వాడు అలా గోలచేయడు చెయ్యంగానే చావబాదుతుంది.

వాడంటే ప్రేమలేదని ఆమెకు నా అభిప్రాయం. అదే ప్రేమని ఆమె అభిప్రాయం. అసలు తగాదే అదిగా. ప్రేమే ఉంటే ఎప్పుడూ, ప్రొద్దస్తమానమూ వాణ్ణి తన్నుతూఉంటుందా. అపుడు వాడు కాస్తగోల చేసే ఉండవచ్చును. గోల చెయ్యనివాళ్లెవళ్ళు ప్రపంచకంలో. ఆమాటకువస్తే నే చేసినంతగోల మావాడు చెయ్యనేచెయ్యడు. అయితే వాడికీ నాకూ భేదమేమిటంటే వాడికి దెబ్బలు నావల్ల తగలవు వాడి తల్లివల్ల దప్ప. మానాయన అమ్మ ఇద్దరూ చెండుకుతినేవాళ్లు నన్ను. అందుచేతనే ఇప్పుడిలా ఉన్నాను. నన్ను స్వేచ్ఛగా ఉండనిచ్చినట్లయితే ఇహ నాప్రథసంగతి చెప్పారు.

మావాడు వాళ్ళమ్మను 'దొంగముండ' అనిగూడా అన్నాడని మా ఆవిడ నెపం. ఆసంగతి నాకీరోజున తెలిసింది. ఆమెనుఅన్నది ఇకొక్కసారేగా. నన్ను లెక్కలేనన్నిసార్లు 'దొంగ...కొడక' అని తిట్టాడే. నేను ఊరుకోలే. వాడి ఉత్సాహం చూసైనా ఊరుకో వచ్చుగా. అసలు తెలివితేటలుంటె అనుకోవచ్చు. సనే మిరా ఆవిడ ఊరుకోదు.

కష్టపడి పెంచింది ఆవిడే వినా వాడంటె ఆమెకు ప్రేమలేదని నావాదం. ప్రేమే ఉంటె మా అమ్మాయి

(రెండో కానుపు) గోలచేస్తే ఊరుకోవడంలే. దానికి ఆమె సమాధాన మేమిటంటె 'అది రెండేళ్ళది అదింకా గోలచెయ్యడంలేదు. గోల, యింత గోల చేసి భయ భక్తులు లేకుండాఉంటె దానికిమటుకు తన్నులు తగ లవా.' అని. నా దృఢనమ్మకం మాత్రం మా అమ్మాయి కూడా గోలచేస్తూనే ఉంటుందనీ, కూతురుమీదఉండే ప్రేమవల్ల ఆమె దాన్నేమీఅనదనీ.

ఆరోజున ఏంజరిగిందంటె బజారులో పిల్లవాళ్ళతో మావాడు ఆడుకుంటున్నాడు. ఆటలలో అనేకమైన దెబ్బలూ అవీ తగులుతూఉంటవి. ఆటలోదెబ్బ అరటి పండు. వాటిని తెలివిగల వాళ్ళెవళ్ళూ లెక్కచెయ్యరు. అయితే అందరు పిల్లవెధవలకూ ఆమాత్రం ఓర్పు ఉంటుందీ. అంచేతనే మనదేశం ఈ స్థితిలోఉన్నది. మా పిల్లవాడు గోలచేసేవాడేనని ఇదివరకే అనేక మాటులు ఒప్పుకున్నాను కాని ఇంత తెలివితక్కువ దేశంలో ఉంటె సహించి ఊరుకోవడ మేలా నాబోటి తెలివిగలవాళ్ళు.

మావాడూ, ప్రక్కయింటిపిల్లలూ కలిసి ఆడుకుం టున్నారు. ప్రక్కయింటివారి పిల్లడు రాముడు పట్టి అభాజనుడు. చేతగాని చెవ్వోధవంతు. వాణ్ని అందరూ బుద్ధిమంతుడు అంటూంటె నాకు ఒళ్ళుమండుతుంది. బుద్ధి అంటె చేతగానితనమా. వాడు ఒకరిజోలికి పోడుట. ఇంట్లో గోలచేయడట, ఇంకా ఏమిటో, ఏమిటో వాణ్ణిగురించి ఆ వీధివీధల్లా ఒకటే స్తుతి. అందరూ అలా వాణ్ని భూషిస్తున్నారని నాకు అసూయ కాదుసుమండీ. అసలు అలాంటి వ్యక్తులంటే నాకు కిట్టదు.

ఏతవత ఆరోజున ఆ అయిదారుగురు పిల్లలూ ఆడు కుంటున్నారట. అందులో మావాడు, వాళ్ళరాముడు మరి నలుగురు ఉన్నారట. మావాడిసంగతి మనవిచేశా నుగా! వాడు రాముణ్ని ఏదోఅన్నాట్ట. తిరిగివాడు— బుద్ధిమంతుడైనవాడు—వాడుకూడా ఏదో అన్నా డుట. మావాడు సాధారణంగా మాటపడడు. నేనం టేనే పడకపోతే మరొకరు - అందులో ఏమీ చేతగాని ఒక చిన్నపిల్లవాడు, మావాడికంటె వాడు రెండేళ్ళు చిన్న—అంటే ఊరుకుంటాడా? అంతటితో మావా డికి మితిలేనికోపంవచ్చి వాణ్ని, ఫెడేలున రొమ్ముల్లో ఒక్కగ్రుద్దు గ్రుద్దాడుట. ఆ అర్భకపువెధవ స్పృహ తప్పి పడిపోయినాడుట.

అసలు జరిగిన సంగతిది. ఈసంగతి కథంతా అయిం తర్వాతగాని నాకు తెలియలేదు. అప్పటికి నేను వచ్చే టప్పటికి మా ఆవిడ ఒక లాడుతీసుకుని వాడు అందితే ఉతుకుదామనే తయారులో ఉన్నది. నన్నుమించిన తెలివిగల మావాడా అందేదీ! వాడు అందలేదు. మా ఆవిడ వాణ్ణి, వాడి పూర్వీకులనూ కలిపి నమటాక్కరా లతో గౌరవిస్తున్నది.

రాముడుఅమ్మ మా యావిడతో మావాడిమీద ఫిర్యాదులు చెపుతూనేఉన్నది. వాడినాన్న వాణ్ణి స్మృతిలోకితెచ్చే పనిమీదఉన్నాడు. మా యావిడ వాళ్ళతో కలసి మావాణ్ని ఆడిపోసుకుంటున్నది. తుంటరి అని, రౌడీ అని, బాగుపడే లక్షణాలులేవనీ ఒక మాటగాదు.

నేను వచ్చేసరికి ఈ పరిస్థితులను చూచేసరికి నాకు ఒళ్ళు అపాదమస్తకమూ మండిపోయింది. కథంతా కనుక్కున్నాను. అనవసరంగా, కారణంలేకుండా మావాడు రాముణ్ని రొమ్ముమీద గ్రుద్దాడనీ, వాడు స్పృహతప్పి పడిపోయినాడనీ చెప్పారు. నేను మాత్రం నమ్మలేను. మావాడిమీద కల్పించడంలో మా ఆవిడ మొదటిది.

నేను మొహం చిట్లించుకొని, కోపంతో అందరూ వింటూండగానే రాముడునాన్నతో 'చివరతప్పు మావాడిదిగానే గనపడుతున్నది. అయినా మీవాడు మావాణ్ని ఏమన్నాడో? అచ్చంగా మావాడిదే తప్పు అనడానికి వీలులేదు. అందులోనూ మావాడు వాడివల్ల తప్పులేంది ఆపని చేసిఉండడు.మావాడిదే తప్పు అనడం అన్యాయం.' అన్నాను. వాళ్ళు 'మీవాడి సంగతంతా తెలిసికూడా అలా అంటారేమండీ! మీవాణ్ని మంచి వాడని మీ రనుకోవాలసిందే.' అని గద్దించారు. 'అవును తెలుసుగనుకనే అలా అంటున్నాను. మావాడు అనవసరంగా ఇంకొకరిజోలికి పోడు.' అన్నాను. వాళ్ళు ఏమీఅనలేక వెళ్ళిపోయినారు.

మా ఆవిడమాత్రం 'మనవాడికే చెప్పని నా అభిప్రాయం సుమండి. వాణ్ణి వెనకవేసుకునివచ్చి వాణ్ణి మరీ పాడుచేస్తున్నారు. వాళ్ళరాముడు చాలా మంచివాడు. వీడే వాణ్ణి అనవసరంగా కొట్టిఉంటాడు.' అన్నది. అంతటితో నాకు చెడ్డకోపంవచ్చి 'ఓసి తెలివితక్కువ పెద్దమ్మా! మొగుడు ముండా అంటే ముష్టికి వచ్చినవాళ్ళంతా ముండా అన్నారుట. ఆ మాత్రం తెలియదు తెలివిగ్గలదాన్ని, తెలివిగలదాన్నని నీలుగుతావు నీ పిల్లవాణ్ణి బయటపడేసుకుంటావేం అసలు కలహానికి కారణం కనుక్కోకుండా?' అన్నాను.

తరువాత మా ఆవిడ వాణ్ణి, కొట్టకుండాఉండే వరుసమీద వాణ్ణి దగ్గరకుతీసుకుని అడిగితే వాడే చెప్పాడు తానే ముందు రాముణ్ణి వేళాకోళానికి ఏదో అన్నాననీ, తిరిగి రాముడు ఏదోఅంటే తనకు కోపంవచ్చి వాణ్ణి కొట్టాననీ. విషయం వినగానే మా ఆవిడ తానేజయించినట్లు 'చూశారా. వీడే వెధవ వాడిప్రాణం తీసేవాడయినాడు.' అన్నది. నేనూ ఊరుకోలేను. 'అందులో ఏమీతప్పులేదు. ఆటలోదెబ్బ అరటిపండు అంటారు. దెబ్బతగిలితేమట్టుకు అంత రగడచేస్తారా? నీ పిల్లవాణ్ణి నీవే చెడువాడంటే ఊళ్ళోవాళ్ళు గౌరవిస్తారా? ఇదేనా చదువుకున్నాను చదువుకున్నానంటావు తెలియకపోతే చేర్చుకో, వాడి అధికారవాంఛ, వాడి మాటపడనితనమూ, ఆటలలో మేటితనము చూసి గర్వపడడానికి బదులు వాణ్ణి అనరానిమాట లంటున్నావు? ఇహఊరుకో' అనేసరికి ఆవిడ మారు మాట్లాడలేక ఇంట్లోకి వెళ్ళింది.

ప్రశ్నోజకత్వం గ్రహించలేని ఇంత తెలివితక్కువతనం ఉంటే ఏలా నాలాటి వాళ్ళు సహించడం చెప్పండి.

ఒకదాంట్లోనించి ఇంకోదాంట్లోకి జారి. ఎక్కడికో పోతాను మాటల సందడిన. అసలు...........'

అని ఇంకా ఏమోవ్రాయ సంకల్పించినట్లున్నది. ఈ కథకశిరోమణి.

ఇది స్వంతనోడో, కల్పితమో మనకు తెలియడానికి ఆధారాలు పూర్తిగాలేవు. అప్రకారం అసంపూర్తిగా వ్రాయబడిన కొన్ని కాగితాలు నాకు బందరులో ఉండగా ఒకనాడు బొంబాయిదగ్గర దొరికినయి. దారంగుచ్చిమడతగా పడిఉన్న కాగితాలనుతీసి మొదటి పంక్తులు చదువ్వదుతుగదా ఏదో కథలాతోచింది.

కథ అనగానే అతిశ్రద్ధగా చదవడం ఓ అలవాటు నాకు. అది చాలా చెడ్డఅలవాటని ఈమధ్య నాకు బాగానాటింది. లెక్కలేనన్ని పత్రికలు బయలుదేరడం, వాటిలో కథలన్నీ ఒకటైనా మంచిదిదొరుకుతుందేమోనని చదవడం, చదివి నిస్పృహచెందడం, మామూలయింది. కైళ్వసాహిత్యమేవచ్చి భావను పాడుచేస్తున్నదంటె, ఈ కైళ్వపత్రికలూ, వాటిలో వ్యాసాలూ దేశాన్ని, భావనూ సమూలంగా నాశనంచేస్తున్నవి. హిందీవచ్చి ఆంధ్రాన్ని నాశనం చేస్తున్నదని వాదనలేవదీసి తాము గాథరాపడి, ప్రపంచకాన్ని గాథరాపెట్టడానికి అహర్నిశాలు శ్రమపడుతున్న పెద్దలు, భావకు కలిగే ఈ మహాపదను గుర్తించి చికిత్సచేయకూడదమూ కాలం వ్యర్థపరచడంకంటె.

దొరికిన ఆ కాగితాలు అలాగే చదివాను. పెద్దకథాలక్షణాలు లేకపోయిన బాగానేఉన్నట్లు తోచింది. హాస్యరసం పోషించడానికి ప్రయత్నం కనపడుతున్నది; ఆ ప్రయత్నం సంపూర్ణంగా ఫలించకపోయినా. అసంపూర్తిగా వ్రాసిఉన్న ఈ చిత్తు కాగితాలు బొంబాయిదగ్గరకు ఎట్లావచ్చినవో, పోగొట్టుకున్న కథకశిరోమణి ఎవరో పూర్తిగా తెలియలేదు. ఎవరైనా పారేసుకున్నామని వెతుక్కుంటూ వస్తారేమో ఇవ్వవచ్చునని చాలాసేపు పనిలేకపోయినా ఇటూఅటూ తిరిగాను. ఎవరూ వీనికోసం వెతుకుతున్నట్టె కనపడలేదు. దస్తూరినిబట్టి అయినా కనుక్కుందామంటె ఆ దస్తూరిని పోలిన దస్తూరిగల నా స్నేహితులెవరూ కనపడలేదు. కథకులు మనకు తెలియనివాళ్ళు ఎందరులేరు గనుక, ఆ పారేసుకున్న ఆయనే దీనిని ఏదోవిధంగా వ్రాసి ప్రచురించుకుంటాడని ఊరుకున్నాను ఈ అయిదారేండ్లనుంచీని. అదీ జరగలేదు. ఆ తెలియని కథకుని యొచ్చగల విధ్యుక్తధర్మాన్ని ఈ విధంగా నెరవేర్చుకొను,

పాఠకమహాశయ విధేయుడు

—మొదలి వేంకటసుబ్రహ్మణ్య శర్మ.

# ఇంద్రధనుస్సు

౧

నీటు గలచోట మబ్బుల తోటలోన
కోరి కూరిమి చుక్కల పేరటాండ్రు
సరవి తమయింటి యతిథి కాషాఢలక్ష్మి
కందముగ దీర్చి కట్టి రుయ్యాల చేరు.

౨

కన్నుల్ గుట్టెడి యిట్టి రంగు లెచటం గాలించి తైకొంటి? నీ
కన్నన్ పోలిక లేని తూలికకు దీక్షా మున్ను! యీ చిత్రమో
యన్నా! మిన్నును వ్రేల వేసితివి కద్దా! మబ్బు పిల్లల్ - మరే
మన్నం బైనిక నేమి! - మాపుదురు మాయన్ రాదె పోయింతకున్!

౩

ఈ విల్లెక్కడి దోయి, యెక్కడితి తండ్రీ? నేరమింజేసి యే
వేవో కాని పనుల్ పొనర్చిరదె పోనీ! బిడ్డలం దింత దు
ర్భావంబే? తలవున్నదే విలయు మాపాదింప! చాలాప్రలు; క్రో
ధావేశ మ్మ్ముపసంహరింపు మిక, క్షంతవ్యమ్ము సంతానమున్!

౪

మలగొని కొండ నట్టనడుమం బడి పోయిన యీవెలుంగు త్రో
వల శ్రమయెంచకే నడచి వచ్చిన నీ యిలు సేర్చునంచు కో
ర్కులు పురిగొన్న నీ మొద లెఱుంగని మార్గము నాశ్రయించి యే
వలన తుదిం గడింపగల స్వామి! వచింపుము దోయిలించెదన్!

౫

మిన్నేటి తీరభూమిని రంగులచీర నారవైచినది యే యమరకాంత
గగనేందిరకు మచ్చికను పూవులదండ ముడిచిన దే చుక్క ముత్తయిదువ
మబ్బు దుప్పటికి క్రొంబట్టు వన్నెలయంచు వేడ్కకుట్టినది యే వేల్పుపడుచు
స్వర్గవాటికకు పచ్చలసోగ సిచ్చెన నలువుగానిలిపె నే నాగకన్య

తీరిచిరి కెంజివుళ్ళ బల్ తోరణమ్ము
నెలమి స్వాగత సత్కారములను నడుప
వేలువులు త్రోవ; భువినుండి వెడలివచ్చు
యే కవికొ వీరునకొ ధరణీశ్వరునకొ!

—బొడ్డు బాపిరాజు.



# మాయ రోగం

టి. శ్రీనివాసరావు ఎం. బి. బి. ఎస్ డిగ్రీ సంపాదించి రెండుసంవత్సరాలైనా వెళ్ళకపూర్వమే వైద్య వృత్తిని మనసార నిరసించటం మొదలుపెట్టాడు. మనిషి కీడందితే భగవంతుడు మేలెంచటం కొంచెం విరుద్ధంగా తోచిం దతనికి. అతనికి సంపాదన తప్పనిసరి కాదు. పదిహేను వీసాలు సరదాగా కొన్నిసంవత్సరాలు మెడికల్ విద్యార్థి జీవితం గడపవచ్చును కదా అని డాక్టరుచదువు చదివాడు. కోర్సు ప్రారంభించగానే తెలిసొచ్చింది యూనివర్సిటీవాళ్ళు తనచేత వెట్టిచాకిరి చేయించ దలిచారని. శ్రీనివాసరావు మొండెత్తు వేసి ఇంటిదగ్గిర పుస్తకం ముట్టుకున్నపాపాన పోకుండా జరిపాడు. సంవత్సరాంతాన పాసయి నాడు. కోర్సంతా ఆవిధంగానే గడిచింది. తప్పేవా శ్రేంచేసి తప్పుతారో అతనికి అర్థంకాలేదు.

ప్రాక్టీసు కూడా ఎవరూ తనదగ్గిరికి రాకుండా, పది పదిహేనేళ్ళనించీ తన తోటిడాక్టర్లు ప్రాక్టీసు లేకుండా అవస్థపడుతుంటే తన కెక్కణ్ణించి వస్తుంది కనక, అనుకుని చెక్కుగొట్టి నాలుగు నెలలు కాలేదు, అప్పుడే అతని క్లయింట్ల లిస్టు నూరు దాటింది, అతని వర్కింగవర్స్ రోజుకు పన్నెండుగంటలైనై, అతని సంపాదన నెలకు నూటయాభైలో పడ్డది! వైధవ్యజీవిత మనుభవిస్తున్నాడు శ్రీనివాసరావు. అతనికి డబ్బునుచూస్తే [illegible]వ్యామోహమనీ, పేరుప్రతిష్టలు చేదనీ కాదు, అంత బద్ధకస్తుడు పుట్టబోడు, పెరగబోడు.

శ్రీనివాసరావు నిట్టూర్పువిడిచి లేచాడు. చేతినున్న గడియారం చూశాడు. ఆరూ పది! సినిమాకైనా పోవచ్చు. ఏంలాభం? లేచింది మొదలు రోగులు, రోగులు, రోగులు! విసుగూ విరామం లేకుండా— రోగులు! అందరికన్నా క్షమించటానికి వీల్లేందివర్ణం చే- రోగుల్ని! ఛత్!

'కాంపౌండర్!'

'చిత్తాం!'

'నేనలా పార్కువైపు వెడుతున్నాను! ఏడయే దాకా ఉండి నువ్వుకూడా వెళ్ళిపో!'

మళ్ళీ శర్మగారు ఇంజక్షన్ కోసరం వస్తారేమో?'

'ఆయన విషయం చిత్రంగా ఉందోయ్, మరీనూ! ఇప్పటికే రెండనవసరంగా పుచ్చుకున్నాడు. గట్టిగా చెబితే ఈ డాక్టరు ఉత్తివట నాగమ్మఅని ఊరంతా చాటి పారేస్తాడని భయం! ఆఁ మరేం, మళ్ళీ పాయింట్ త్రీ ఇవ్వు— మెల్లిగా చెప్పిచూసి వినకపోతే!'

కాంపౌండరు అట్లాగేనని తలఊపుతూ నవ్వాడు.

'ఆయనకు ఇంజక్షన్ల మంది గుణమిస్తున్నాయటండి!' అన్నాడతను.

'సరే! ... నే నలా పోయివస్తాను!'

'చిత్తాం!'

డాక్టరు శ్రీనివాసరావు వెళ్ళె ప్రయత్నంలో ఉండగా ఒకకుర్రవాడు అనుమానిస్తూ లోపలికి ప్రవేశించి అతనికి నమస్కారంచేశాడు.

'ఎవరికోసరం?'

'డాక్టరుగారు లేరండి?'

'నేనే డాక్టర్ని.'

'మీతో ఒకమాటమాట్లాడి పోదామని వచ్చానండి.'

'ఇప్పుడుకాదు. ఇప్పుడు నాకు చాలా జరూరుపని ఉంది. రేపొద్దున ఏడు దాటాక రా!'

'అప్పుడు నాకు వీలుపడదండి. రేపురమ్మంటే వస్తానుకాని మళ్ళీ ఈవేళకే వస్తాను.'

శ్రీనివాసరావు ఆ కుర్రవాడి అహంకారానికి మండిపడ్డాడు. 'మరి నాకీవేళప్పుడెన్నడూ తీరదూ!' అన్నాడు.

'కానివ్వండి. మరోడాక్టరు దగ్గిరికి పోతాను.' ఆ కుర్రవాడు దీనంగా వెనక్కు తిరిగాడు. శ్రీనివాసరావుకు జాలేసింది. ఆకుర్రవాడి వీపు అతని హృదయాన్ని చిత్రంగా ద్రవించింది. ఇంతసేపున్నవాడింకో అయిదు నిమిషాలుంటే ముంచుకుపోయిందేమిటి? గడపదాకా వెళ్లిన కుర్రవాణ్ణి వెనక్కు పిలిచాడు డాక్టరు.

'ఏమిటి నువ్వు చెప్పదలిచింది?' అన్నాడతను కుర్చీలో కూర్చుని.

'నేను చెప్పదలిచింది త్వరలో కాదేమోనండి!' అన్నాడు కుర్రవాడు అనుమానిస్తూ.

'ఇప్పటికి క్లుప్తంగా ముగించు. తరవాత రేపు వింటాను. సరేనా?'

'చిత్తం అలాగే కానివ్వండి. ఇంతకూ నాకు కావలిసిందేమంటే — నేను గతమంతా మరిచిపొయ్యేటట్టు చెయ్యగలరా?'

ఆ కుర్రవాడు తనతో పరాసికాలాడుతున్నాడని అనుమానంతగిలి డాక్టరు ఊఁకొట్టలేదు.

'పగలంత ఇబ్బందిలేదండి. రాత్రి నిద్రపట్టదు. గడిచిన విషయాలన్నీ కళ్ళలో మెదులుతూంటై. దానికేదైనా మందు —'

ఒకముక్కు—ముక్కి డాక్టరు కుర్చీలోనించి లేస్తూ 'కాంపౌండర్! ఇతనికో స్లీపింగ్ మిక్శ్చర్ ఇచ్చి పంపేయ్!' అన్నాడు.

'మీ బ్రోమైడ్స్‌తో పొయ్యేరోగం కాదండి ఇది' అన్నాడు కుర్రవాడు.

శ్రీనివాసరావు నిర్ఘాంతపోయినాడు. అంత కుర్రాడికి — పదేళ్ళయినా ఉంటయ్యో ఉండవో? — బ్రోమైడ్స్‌ను గురించి తెలుసుననేకాదు అతని ఆశ్చర్యం; అంతకన్న ఆశ్చర్యకరంగా ఉంది ఆకుర్రవాడి గొంతు. ఆకుర్రవాడి గొంతులోనించి అంత గంభీరమైన నాదం ఎట్లావచ్చింది?

'క్షమించండి. మీకు నే నార్డరివ్వడానికి రాలేదు. కాని నారోగం సరిగా కనుక్కుంటే మీరు మందివ్వగలుగుతారని నా ఆశ. మీరు డాక్టర్లు. నేను మీకు చెప్పేదేమిటి? సగంచెప్పి సగం చెప్పక పోవటం నాకే హాని. అదీకాక నేను టూకీగా నా అవస్థ చెప్పాలని ప్రయత్నించేస్తే నామాటలు నమ్మరు. మాటవరసకు నేను గతం మరిచేటందుకు మందిమ్మన్నాననుకోండి. ఇంత చిన్నవాడికి గతమేమిటా అని మీరు నవ్వరా? నేను పుట్టిపెరిగిన ఈపది సంవత్సరాల్లో మరవదగినది ఏమంతలేదు కానీండి, అంతకు పూర్వం నడిచిందే? దాన్ని భరించలేను. అది నన్ను విడవకుండా ఉంది! నా గుండెమీద పెద్ద రాయల్లే ఉంది. ఆ రాయి ఎత్తేసిన పుణ్యాత్ముడికెంతపుణ్యమున్నా ఉందండి!'

శ్రీనివాసరావు ఒక్కక్షణం నీళ్ళలో ఊపిరాడక తన్నుకున్న వాడల్లే మధనపడ్డాడు. చివరకి తను బిగ్గరిగా 'ఆగు! నువ్వు చెప్పేది ఒక్కముక్క నాకర్థం కావటంలేదు. నీపేరేది?' అని అరిచాడు కాంపౌండరు అదిరిపడేట్టు.

'నా పేరు సత్యం!'

'అలా ఒకో ప్రశ్నకే మెల్లిగా సమాధానంచెప్పు! నీ వయస్సెంత?'

'పదేళ్లు.'

'ఊఁ! ఈమధ్య నీ కేమైనా పెద్దజబ్బుచేసిందా?'

'లేదండి.'

'మీ వంశంలో ఎవరికైనా — ఎవరికైనా — కొంచెం మతి చాంచల్యం — అలాటిదేమైనా ఉందా?'

'అబ్బే! లేదండి.'

'నీకు తరుచు కలలు వస్తూండటం — మేలుకునుండే కలలు కంటం కద్దా?'

'నాకు మతిచెడ్డదనే ఉద్దేశంతో మీరిలా ప్రశ్నిస్తే నే చెప్పదలిచిందెలా చెప్పడం?'

సరిగా ఈసమయానికి కాంపౌండరు లైటు తెచ్చి బల్లమీద పెట్టాడు. శ్రీనివాసరావు తన కెదురుగా నిలబడ్డ ఆకుర్రవాడి మొహం వంక చూశాడు. అతనిదృష్టి

సరాసరి సత్యం కళ్ళమీదికి పోయింది. అతని శరీరం కంపించటం మొదలుపెట్టింది అవేం కళ్ళు? వాటిని చూస్తే తనశరీరం ఎందుకంత కంపిస్తుంది? కుర్రవాణ్ణి చూసి తనకెందుకంత ముచ్చెమటలు పొయ్యటం?

సత్యంకూడా డాక్టరువంక ఆశ్చర్యపడుతూ చూడటం మొదలుపెట్టాడు.

'నేను మిమ్మల్ని క్రిందటిసారి చూసినప్పుడు మీ మొహం ఇంకోతీరుగా ఉంది! మీకు నన్ను వెనకెప్పుడైనా చూచిన జ్ఞాపకం ఉందాండి?'

'లేదు! లేదు! నిన్ను నేనెరగను. నువ్విక్కణ్ణించి వెళ్ళిపో! పో!' అని అరిచాడు శ్రీనివాసరావు.

కాంపౌండరు ఆదుర్దాగా ప్రవేశించాడు. కాని ఆ ఇద్దరిలో ఒకరుకూడా అతనివైపు తలతిప్పలేదు. అడివిలో అకస్మాత్తుగా ఎదురైన రెండు సమాన బలంగల క్రూరజంతువుల్లె ఒకరిమీదినించి ఒకరు చూపు తప్పించలేకుండా ఉన్నారు. ఇద్దరికీ మతిపోయిం దనుకున్నాడు కాంపౌండరు.

శ్రీనివాసరావుకూ సత్యానికీ ఒక్క భేదంమాత్రం ఉంది. శ్రీనివాసరావు సహజంగా మాట్లాడే స్థితిలో లేడు. అరిస్తే అరవటం లేకపోతే నోరు తెరవలేకపోవటం! సత్యం మన ప్రపంచకంలో లేకపోయినా మాట్లాడగలిగి ఉన్నాడు. ఆ గొంతుమాత్రం పెద్దగా లేకపోయినా అమానుషంగాఉంది. కాంపౌండరు చూస్తుండగానే అతను డాక్టరువైపు వేలుచూపిస్తూ 'నువ్వెరో జ్ఞాన దానికోసం మామూలుప్రకారం మూర్ఖప్రాయమైన పదిగడియలకు ఇల్లు బయలుదేరావు రాజుగారి ఉప్పు తింటున్న నేను—దాన్నిచూస్తే నీ కన్న లక్షరెట్లు మోహంగల నేను—నీవెంబడే వచ్చాను. దానింట్లోకి నువ్వు పోతుండగా నేను అసమర్థుడల్లే ఏమీ చెయ్యలేకపోయినాను. నువ్వు లోపలికిపోయి తలుపు వేసుకోగానే నేను కోనేట్లో దిగి మీ కిటికీదగ్గిరికి ఈదుకుంటూవచ్చి అంతా చూశాను. నా రక్తం ఉడికిపోయింది. నాకు ఏనుగకున్నంత బలంవచ్చింది. గట్టెక్కి తిరిగివచ్చి ఒక్కతాపుకు తలుపు పగలతన్ని లోపల ప్రవేశించి దాని చేతుల్లోఉన్న నిన్ను రాజాజ్ఞ అంటూ కాపుతో పొడిచాను. అది రాజాజ్ఞ కాదు! అబద్ధం ఆడాను—'

అకస్మాత్తుగా శ్రీనివాసరావు పెద్ద పెడబొబ్బపెట్టి 'దురాత్ముడా! పాపఫలం అనుభవించు!' అంటూ తన వెనకాల కుర్చీతీసి గట్టిగా సత్యంనెత్తిన కొట్టాడు. ఉత్తరక్షణం అతనికి స్మృహ తప్పిపోయింది.

ఆ దెబ్బకు కుర్చీకోడువిరిగింది. కుర్రవాడు చెక్కుచెదరలేదు కాని అతనిలో మార్పు గమనించానంటాడు కాంపౌండరు. మాట్లాడుతున్నంతసేపూ మత్తెక్కినవాళ్ళై ఏళ్ళవాడల్లే కనపడ్డ సత్యం అకస్మాత్తుగా కుర్రవాడయినట్టయింది. అతను చప్పున చిన్నపిల్లవాడి కీచుగొంతుతో 'అరెరే! అదేమిటండీ! డాక్టరుగారలా పడిపోయారు!' అని అరిచాడు.

డాక్టరుకు గంటసేపటికి తెలివి వచ్చింది. అతని ధోరణిచూస్తే కుర్రవాడు తనతో ఏమీ చెప్పలేదంటాడు. తనకు పని జాస్తయి ఆరోగ్యం చెడి చైత్యం చేసి మూర్ఛవచ్చిందంటాడు. ఆ కుర్రవాణ్ణికూడా కదిలించి చూశాను. కాని అతనికి కిందటిజన్మ తాలూకు సంగతులేవీ జ్ఞాపకంఉన్నట్టు కనిపించదు. ఆరోజున అక్కడికెందుకొచ్చాడంటే నిద్రపట్టటానికి మందుకోసరం వచ్చానని ఒప్పుకున్నాడు. డాక్టరు కుర్చీ తనమీద వెయ్యలేదంటాడు డాక్టరు పిచ్చివాడల్లే ప్రవర్తించటంకూడా గమనించానంటాడు. కాని అది చైత్యపుతెర యొక్క ఫలితమని డాక్టరే అంగీకరించాడు. ఆ పిల్లవాను ఆశ్చర్యపడటంకూడా తనకు జ్ఞాపకం ఉన్నదంటాడు డాక్టరు. కాని తను డాక్టర్నుచూసి ఆశ్చర్యపడ్డట్టు కుర్రవాడే అంగీకరిస్తున్నాడు. కుర్చీకాలి సాక్ష్యంకూడా ఎందుకూ పనికిరాదు, డాక్టరు కుర్చీ ఎత్తి దూరంగా పారేసినమాట డాక్టరూ కుర్రాడూ కూడా ఒప్పుకుంటున్నారు కనక. ఇద్దరిలో ఒక్కరైనా దాపరికంకోసరం ప్రయత్నిస్తున్నవాళ్ళల్లే లేరు.

ఎటొచ్చీ కాంపౌండరు సాక్ష్యం ఒక్కటేఉంది. అది ఎంతవరకు నమ్మతగ్గదో మీరే నిశ్చయించుకుంటారు గాక!

—కొడవటిగంటి. కుటుంబరావు.

# ౨. వుత్పత్తి - పరిణామము

మన ప్రాచీనుల కెంతకాలమునుండి లిపి పరిజ్ఞానముండెడిది, వారు పూర్వ మేయే వస్తువులను వ్రాయుటకై యుపయోగించిరి అను విషయములను వెనుకటి యధ్యాయమున చర్చించియుంటిమి. కాని లిపి వాడుకలోనికి వచ్చినప్పటినుండియే గ్రంథాలయములుగూడ బయల్వెడలిన వనుటకు వీలులేదు. చరిత్రకాలమునకు పూర్వపు పరిస్థితు లెట్లుండినను, వేదకాలమున మాత్రము గ్రంథముల యొక్కయు, గ్రంథాలయముల యొక్కయు ఆవశ్యకత లేకుండినది. అప్పటి విజ్ఞానమంతయు మతాత్మకముగను మౌఖికముగనే యుండి పారంపర్యముగ నోటిమాట మూలముననే ప్రచారము చేయబడుచుండెడిది. కాలక్రమమున వర్ణవిభజన మేర్పడి నాటి విద్య యంతయు బ్రాహ్మణుల స్వాధీనములో నుండెను. ఇది మొట్టమొదటి పరిస్థితి. కొంతకాలమునకు పిమ్మట వేదములును, వేదాంగములును చేరి విస్తృతమగు వాఙ్మయ మేర్పడినది. దీని నంతటిని ఏయొక వ్యక్తియు, పురుషాంతరమునుగూడ సంపూర్ణముగ కంఠస్థము చేసికొనుట యసాధ్యమయ్యెను. అందుచే నీ వాఙ్మయమును నశింపకుండునటుల కట్టుదిట్టము చేయుట యవసర మయ్యెను. ఇందులకు దానినంతటిని వ్రాయుటయే ముఖ్యసాధనముగ కన్పించినది. అంతటినుండియు నొక ముఖ్యముగు మార్పు జరిగెను. అంతవరకును, ఇతర జాతీయులకు తెల్పక నాటి విద్యలను తమ జాతియందే భద్రపరచుకొనుచుండిన బ్రాహ్మణులు అవేవిద్య యొక్క స్థయిర్యముకొరకై, దానిని యెల్లరకు నందుబాటులో నుండునట్లు గ్రంథస్థమొనర్పవలసి వచ్చెను. ఇదియే మనదేశమునందలి గ్రంథనిర్మాణమున కారంభము. ఇది ఉత్తరవైదిక యుగమున (Post-Vedic Age) అనగా సుమారు క్రీ. పూ.......సంవత్సర ప్రాంతమున జరిగియుండును. ఈ యుద్యమము క్రమాభివృద్ధి నందెను. ఇట్లు వ్రాయబడిన గ్రంథముల సంఖ్య యభివృద్ధియగుటచే, వానిని పదిలపరుపవలసిన యవసర మేర్పడెను. మొట్టమొదట వ్రాయబడినవి మతగ్రంథములే యగుటచే వీని నుంచుటకై యే దేవతాగృహమో లేక నింటిలోని పవిత్రస్థలమో నిర్దేశింపబడియుండును. ఇట్టిస్థలములే మన దేశమునందలి మొదటి గ్రంథాలయములు. వీనికి సరస్వతీ భాండారములని పేరుండెడిది.

ఈ గ్రంథీకరణ, గ్రంథ సంగ్రహణోద్యమముల కనేక సమయములలో ననేకవిధములగు కారణములు తోడ్పడి ప్రాచీనభారతదేశమున గ్రంథాలయము లభివృద్ధినందినవి. అట్టి కారణములచట సంగ్రహముగ చేర్కొని గ్రంథాలయముల పరిణామమును వర్ణింపవలసియున్నది. భారతదేశ చరిత్రమునందు కుషాన్ చక్రవర్తియగు కనిష్కుని రాజ్యకాలమొక ముఖ్యఘట్టము. అప్పటికే బౌద్ధమతమునం దనేక శాఖోపశాఖలు బయల్వెడలి మతధర్మములనుగూర్చి యెన్నియో యభిప్రాయభేదము లేర్పడినవి. ఈ భిన్నాభిప్రాయముల వ్యాప్తికి గ్రంథములు ముఖ్యసాధనములుగ నుండి యుండినవనుటకు సందియములేదు. మతవిషయకములగు నభిప్రాయభేదములను సమన్వయించి, సర్వసమాదరణీయములగు సిద్ధాంతముల నేర్పరచుటకై కనిష్కుడొక సభను గావించెను. ఈ సమావేశమునకు ఫలితముగ బౌద్ధుల ముఖ్యగ్రంథములన్నియు, సవిమర్శముగ చర్చింపబడి, క్రోడీకరింపబడినవి. ఈ పండితసభలో నిర్ణయింపబడిన పాఠముల ననుసరించి దేశమునం దెల్లెడలను బౌద్ధులు మతగ్రంథముల కన్నిటికిని ప్రతులను వ్రాసికొనియుందురు. ఇందుమూలమున గ్రంథాలయములనందలి గ్రంథముల సంఖ్యయు ప్రబలుట కవకాశమేర్పడెను. ఇదే సమయమున మహాయానమను నూతన సిద్ధాంతము బౌద్ధమతమునం దేర్పడినది. దీనికంగములుగ నిర్మింపబడిన తంత్ర, ఆగమాది శాస్త్రములకు సంబంధించిన గ్రంథములుగూడ దేశమున వ్యాప్తిలోనికి వచ్చినవి. క్రీ.శ. 2-వ శతాబ్దిలోని గ్రంథాలయాభివృద్ధి కిదికూడ నొక కారణమయ్యెను. కనిష్కుని కాలమునకు పిమ్మట పేర్కొనవలసినది. క్రీ. శ. 3-6. శతాబ్దముల నడుమనుండిన గుప్తయుగము. ఈ కాలమున

హిందూమతమున కపూర్వము నద్వితీయము నగు పునరుజ్జీవనము గల్గినది. ఇతిహాస పురాణములును, ధర్మశాస్త్రములును, వైద్యజ్యోతిషాది శాస్త్రములు నీకాలము నందే గ్రంథీకరింపబడినవి. అదిగాక కాళిదాసాది మహాకవు లీయుగమున సంస్కృతభాషకు నూతన వికాసమును గల్గించిరి. ఇట్టికాలమున నిర్మింపబడిన గ్రంథము లన్నియు దేశమున వ్యాపించి, విద్యావైదుష్యముల పూర్ణాభివృద్ధి నందుటకు ఆయా గ్రంథములకు వేనవేలు ప్రతులు వ్రాయబడి యనేకస్థలములలో కేంద్రీకరింపబడుటయే యని స్పష్టమగుచున్నది. ఈ కాలము నందే మనదేశమునం దసంఖ్యాకములగు గ్రంథాలయములు బయల్వెడలి, పూర్వముండినవి యభివృద్ధిరై యుండును. అటుపిమ్మట క్రీ.శ. 7-వ శతాబ్దిలో శ్రీహర్షుని కాలమున కీ గ్రంథాలయోద్యమము సర్వంత్ర వ్యాప్తమై యుత్కృష్టములగు భాండాగారము లెన్నియో వర్ధిల్లుచుండినవని విద్యాపిపాసను దీర్చుకొనుటకై యీ దేశమునకువచ్చి, దీనినంతటిని తిరిగిచూచిన విదేశీయ యాత్రికుల వ్రాతలవలన స్పష్టమగుచున్నది. 8, 9, 10 శతాబ్దములలో దేశముతోబాటుగ నీ యుద్యమముగూడ క్రమాభివృద్ధిని చెందెను. మహమ్మదీయులు హిందూదేశమున ప్రవేశించినప్పటినుండియు పరిస్థితులు మారినవి. ఉత్తరదేశీయులకు తమ ధనప్రాణముల నీ విదేశీయుల బారినుండి రక్షించుకొనుటయే దుస్సాధ్యమయ్యెను. వీలయినంతవరకును వారు తమ ప్రాచీనగ్రంథములనుగూడ కాపాడుకొనుచుండినను, మొత్తముమీద దేవాలయములతోబాటు ప్రాచీన గ్రంథాలయములు గూడ నీకాలమున పరశురామ ప్రీతిగావింపబడినవి! దక్షిణాపథమునకు మాత్రమీ యుపద్రవము 14-వ శతాబ్దమువరకును సంభవింపలేదు. 10-14. శతాబ్దులలో మహమ్మదీయు లుత్తరదేశీయులను హింసించుచు, తమ ప్రభుత్వమును స్థాపించి సాగించుచుండ, దక్షిణమున మహాపరాక్రమ శాలురును; విద్యా పక్షపాతులు నగు రాజులు పరిపాలనమును నెరపుచుండుటచే నిచట గ్రంథాలయోద్యమము జాతీయ జీవితముతోబాటు నిర్విఘ్నముగ సాగుచుండెను. క్రీ. శ. 14-వ శతాబ్ది మొదటిపాదమున నీ భాగముగూడ యవనాక్రాంతమయినను, త్వరలో కొండవీటిరెడ్లును, రాచకొండలో పద్మనాయకులును, విజయనగరమున హరిహరసోదరులును ఆరిపోనున్న హిందూజాతీయ దీపికకు నూతనజీవమును గల్పించిరి. ఇందుమూలమున మరిరెండు శతాబ్దములకాలము హిందూరాజుల పరిపాలనము నడచినది. ఈకాలపు రాజులందరును విద్వత్పోషకులుగను, కొందరు స్వయముగ మహావిద్వాంసులునైయుండుటచే వాఙ్మయమెక్కుడుగ నభివృద్ధినందినది. దీని కంగమగు గ్రంథాలయోద్యమము నీ సమయమున ప్రబలినది. కవిపండితుల సంఖ్యతోబాటు, గ్రంథముల యొక్కయు, దన్మూలమున భాండాగారముల యొక్కయు సంఖ్యయు వృద్ధిచెందినవి.

కేటింతలెసే ప్రాచీనకాలమున మన దేశమునగూడ నెన్నియోవిధములగు గ్రంథాలయము లుండెడివని తెలియుచున్నది. ఇందు విశ్వవిద్యాలయములకు చేరియుండిన భాండాగారము లగ్రగణ్యములు. పిమ్మట చేర్చదగినవి సంగము, ఘటిక మున్నగు నితర విద్యాసంస్థలలోని గ్రంథనిలయములు. మతవిషయకములగు పరిషత్, విహారము, మఠము, దేవాలయము మున్నగు సంస్థలకు చేరియు భాండాగారము లుండెడివి. రాజులుగూడ తమ పూర్వులయొక్కయు, తమయొక్కయు పోషకత్వమున రచింపబడిన గ్రంథములను, సుప్రసిద్ధులగు కవులను పండితులును రచించిన కృతులను, తమ సౌధములలో జాగ్రతపరచుచుండిరి. ఇవిగాక వ్యక్తికములగు గ్రంథసముదాయములు నీ కాలమునం దుండెడివి. ఇవి పారంపర్యముగ కుటుంబములలో నుండినవియో, లేక విద్యాపిపాసగలరే మహనీయుడో స్వయప్రయాసతో కూర్చి సంపాదించినవియో యైయుండును.

గ్రంథములయొక్క లక్షణమును బట్టియు గ్రంథాలయములలో భేదము లుండెడివి. విద్యాపీఠము లన్నిటియందును ప్రాయికముగ సర్వశాస్త్రములకును సంబంధించిన పుస్తకములుగాక, నభిమానవిద్యలకు సంబంధించిన గ్రంథములు పెక్కులుండి యుండెడివి. తక్షశిలా విశ్వవిద్యాలయము ఆయుర్వేదమునకు ప్రసిద్ధికెక్కియుండెను. గాన నచటి భాండాగారమున వైద్య

గ్రంథము లెక్కువగ నుండియుండవలెను. అటులే నాలందాలో హేతువిద్యయు, విక్రమశిలలో తంత్రమును, కాశ్మీరమున వ్యాకరణాలంకారములును అభిమానవిద్యలుగ నుండుటచే నాయాస్థలములు నాయా శాస్త్రసంబంధములగు గ్రంథములు విశేషముగనుండి యుండవలయును. హిందూ దేవళములలోను, బౌద్ధ విహారములందును, జైన ఉపాశ్రయములందు నాయా మతగ్రంథములుండుట సహజము. అదేవిధమున రాజాస్థానములలో కావ్యముల సంఖ్య యెక్కువగ నుండి యుండును. వేదకాలమునుండియు నొక్కొకరుగాని యొక్కొక కుటుంబముగాని కొన్నికొన్ని శాస్త్రములలో ప్రత్యేకకృషి చేయుట యాచారమైయుండెను. ఈ యాచారము పారంపర్యముగ వచ్చుటచే కొన్నికొన్ని విద్యలు కొన్నికొన్ని వంశములలో స్థిరపడినవి. అందు మూలమున నాకంశీయుల గ్రంథములలో చాలభాగము పారంపర్యముగ కృషి చేయబడిన విద్యలకు సంబంధించి నవైయుండుట కవకాశమేర్పడెను.

ప్రాచీన భారతీయగ్రంథాలయములు విద్యావంతులకే యుపయోగపడుచుండెడివి. నేటివలె ప్రజాసామాన్యమున కుపయోగపడు భాండారము లాకాలమున నుండలేదు. ఇందులకు రెండు మూడు కారణముల నూహింపవచ్చును. సామాన్యులకు శాస్త్రీయమగు విద్య యవసరము గాకుండుట. వారి నైతికాధ్యాత్మిక జీవితములను నిర్మించుటకు దేవాలయాదు లుండెడివి. వర్ణవిభజ ననుసరించి ప్రతివ్యక్తికిని పారంపర్యము నావశ్యకము నగువిద్య నిర్ణయింపబడినది. ప్రాథమికవిద్యను నేర్పినపిమ్మట జనులు స్వవర్ణోచితములగు పనులను చేసికొనుచుండిరి. ఉన్నతవిద్య విద్యాపీఠములచే గరుపబడుచుండెడిది. అందువలన వృత్తివిద్యను విసనాడి, కేవలము జ్ఞానార్జనమునే యాదర్శముగ నుంచుకొనిన వారెల్లరు నీవిద్యాపీఠముల కేగుచుండిరి. ఈ విధమున ప్రాచీన గ్రంథాలయము లున్నతవిద్యాభ్యాసము చేయువారికిని జిజ్ఞాసువులకును మాత్రమే యుపయోగించుచుండినవి.

ఈ ప్రకరణమును ముగించుటకు బూర్వము గ్రంథాలయము లెటు లేర్పడుచుండెడివను విషయమునుగూడ చర్చింపవలసియున్నది. ఆకాలమున ముద్రణాసౌకర్యము లేకుండినది. అందుచే గ్రంథములన్నియు లిఖితములేయై యుండెడివి. గ్రంథములకు ముఖ్యముగా మతమునకు సంబంధించినవానికి బ్రతులను వ్రాయుట ప్రతివారికిని ముఖ్యకర్తవ్యముగ నెంచబడుటచే వేలకువేలు ప్రతులు తయారగుచుండెడివి. మరియు శిష్యులు తమ యుపయోగమునకై ప్రతులను వ్రాయుచుండిరి. ఇంతియగాక తాము స్వయముగ వ్రాసికొన వీలులేనివారికి గొంత మూల్యమును గ్రహించి, గ్రంథములకు నకళ్ళను వ్రాసియిచ్చెడివారు నాకాలమునం దుండిరని నాలందా శాసనమొకటి తెలుపుచున్నది. ఆ విశ్వవిద్యాలయములోని స్థవిరాడ్లోకదు మరియొకని యుపయోగమునకై కొంతధనమును గైకొని ప్రజ్ఞాపారమితా సూత్రమునకు ప్రతిని వ్రాసియిచ్చెనని పై శాసనమునుండి తెలియుచున్నది. ప్రాచీన గ్రంథములకేగాక సమకాలికుల కృతులకుగూడ నిటులే నకళ్ళు తయారుచేయబడి దేశమునందలి గ్రంథాలయములలో పదిలపరుపబడుచుండెడివి. ఇటీవల మధ్యఆశియా మున్నగు ప్రాంతముల నార్ష శాఖీయు లొనర్చిన పరిశోధనమునుండి భారతీయ గ్రంథాలయోద్యమ మితరదేశములకు బ్రాకినవిధము తెలియవచ్చుచున్నది. ప్రాచీనకాలమునుండియు భారతీయులు నేటి అఫ్గనిస్థాన్, మధ్య ఆశియా, ఖోటాన్, యార్కండ్, కాష్గర్, టిబెట్, మంగోలియా, చైనా, జపాన్, బర్మా, మలేదేశములకును జావా, బోర్నియో, సుమిత్రా దీవులకును వలసపోయి యచ్చట భారతీయ నాగరికతను, హిందూ రాజ్యములను స్థాపించిరి. ఈ యుద్యమములకు గ్రంథాలయములే ముఖ్యసాధనములుగ నుండినవి. ఎందరో బౌద్ధ భిక్షువు లీదేశములకేగి, మఠములను స్థాపించి యందు తాము గొనిపోయిన గ్రంథములను రాచి, స్థానికులచే వీనికి బ్రతులను వ్రాయించుచుండిరి. మధ్య ఆశియాలో మహోన్నతమగు నిట్టి భాండారమొకటి సర్. ఆరల్ స్టెయిన్ గారిచే గనిపెట్టబడినది. అదేవిధమున హిందూ బౌద్ధ మతగ్రంథములును శాస్త్రములును, జావా మున్నగు ద్వీపములకు వ్యాపించినవి.

—మారేమండ రామారావు ఎం.ఏ,బి.ఇడి.

# పిచ్చికుక్క-కాటు-చికిత్స

హిందూదేశమున ప్రతివత్సరము పెక్కురు పిచ్చి కుక్క కాటువలన మృతినొందుచున్నారు. ప్రభుత్వము వారు మానవులను ఈ ప్రమాదమునుండి రక్షించుటకై ప్రత్యేక చికిత్సాలయముల నేర్పరచి ఉచితముగా చికిత్సయొనర్చు సదుపాయము లేర్పరచుటేగాక బీదలగువారికి ఉచితప్రయాణ సౌకర్యములుకూడ నేర్పరచి సేవచేయుచు చాలమందికి ప్రాణదానము చేయుచున్నారు.

ఇట్టి చికిత్సాశాలలు యిండియాలో చాలయున్నవి. మద్రాసు రాజధానిలో కూడ కూనూరులో ఒకటి వున్నది; అంతేగాక మద్రాసు జనరలు ఆసుపత్రియందు, గుంటూరు విశాఖపట్టణము మున్నగు జిల్లా ఆసుపత్రుల యందుకూడ ఈ చికిత్స యొసంగబడుచున్నది.

ఈ ఘోరవ్యాధినుండి రక్షింపబడుటకు ఆరోగ్య శాఖద్వారాను గ్రామోద్యోగస్థుల ద్వారాను ప్రతి పౌరునికి తెలియవలయునను వుద్దేశ్యముతో ప్రభుత్వము వారు ప్రకటనలు జేయుచున్నారు. కాని పూర్ణముగా ప్రతివారికీ తెలియుటలేదు. ఇది యొక్క ప్రభుత్వ ధర్మమే కాదు. ప్రజలుకూడ తమ ఆత్మసంరక్షణోపాయము తెలుసుకొనుట వారివిధి. ఇట్టి విషయమే ఇచట వివరముగా బోధింపబడుచున్నది.

పిచ్చికుక్కలు వాటి కాటు లక్షణములు చికిత్స మున్నగునవి యీ కాలముననేగాదు వాటివిజ్ఞానము ప్రాచీనకాలమునుండి విదితమైయున్నది. ఇంతేగాక ఇతరజంతువులకును పిచ్చియెక్కుననియు అవి కరచినప్పుడుకూడ యిట్టిబాధలు ప్రమాదములుకూడ కలుగుననియు విశేషవిజ్ఞానమును మన మహర్షి పుంగవులు ప్రసాదించియున్నారు.

సామాన్యముగా పిచ్చి కుక్కలు, పిల్లులు, తోడేళ్లు, నక్క, శివంగి, ఎలుగుబంటు, పులి మున్నగుజంతువులకు కలుగుచుండును. ఈ జంతువులపిచ్చి కాటువలన తరువాత మానవులకు వ్యాపించును ఇందు మనస్సు చెడి పోవును ఏమాత్రము జ్ఞానముండదు.

ఈ వ్యాధి తరుచుగా జంతువులకుగాని మానవులకు గాని కాటువల్లనే కలుగును. కరచినప్పుడు ఆ భాగమున వస్త్రముగాని యితర యేవస్తువైననూ కప్పబడి యున్నచో విషము వస్త్రమునకే అంటుకొనిపోవును గాని రక్తమున చేరదు. కాని ఒకవ్యాధి కలుగును. ఇన్ని జంతువులకు యిట్టిపిచ్చి యెక్కుటయున్నను జనసామాన్యమున దనుపుగాను యెక్కువగాను వుండునవి కుక్కలేగాన వాటివలన యెక్కువగా ప్రమాదము కలుగుచున్నది.

వాటికి పిచ్చియెక్కుట ఒకదానిని ఒకటి కరచుట చేత మాత్రమేగాదు. చచ్చిన సర్పములను, పీనుగలను, యితరజంతువులను తిని క్రొత్తపిచ్చిరోగిన ఈ జంతువులకు పిచ్చియెక్కునను విశ్వాసము ఆంధ్రదేశమున వున్నది.

కుక్కకు పిచ్చి కరువబడినతరువాత మూడు మొదలు అయిదు వారములవరకు ఎక్కవచ్చును. అప్పుడు గాయము బాగుగా మానిపోవును. లేక కొద్దిగా పిచ్చి యుండవచ్చును. అప్పుడు అది రోజంతువునుచూచి నను సహించలేకపోవును. స్థిమితము లేకుండును. ఏ చీకట్లోనో దాగుకొనును, ఆకలియుండదు. ఏది కంటికి కనుపడితే అది చెడ్డపదార్థమైనను తినును, తన మలమునే తినును, ఇట్లు రెండుమూడురోజులుండును, తరువాత శరీరము స్తంభించి చనిపోవును. ఇట్టి స్థితిలో నోట తీగవంటి చొంగయుండును. అది తీసివేయుటకు ప్రయత్నించుచుండును బాగుగా మొరగలేదు. గొంతు బొంగురుపోవును. చివరకు దౌడలు బిగుసుకుపోయి స్తంభించి అయిదారు రోజులలో చనిపోవును.

సామాన్యముగా పిచ్చికుక్కలను స్పష్టముగా గుర్తించుటకష్టము కొంతకాలముగా వ్యాధికలిగి నిర్ణయించుటకు సాధ్యముకావంత శీఘ్రముగ నీమరణము సంభవించినను, దవడలు, వెనకకాళ్ళు, స్తంభించిపోయి

నను ఎక్కువమంది జనులు కరువబడినను, పిచ్చికుక్కయని గుర్తించవచ్చును. ఒకకుక్క అకారణముగా మానవుని కరచిన అది పిచ్చిదనియే నమ్మవలయును. పిచ్చిగా అటుయిటు తిరుగుచు కనుపడిన పదార్థముకాని మనుష్యులనుగాని జంతువులనుగాని కరవ ప్రయత్నించుచుండును. తోక వంకరగానుండక వ్రేలాడుచుండును. గుడ్డిది చెవిటిది అయిపోవును. నిస్సత్తువగానుండును.

నీటి భయము సామాన్యలక్షణము కాదు. ఒక మచ్చిక అయినకుక్క పిచ్చిదైనను యజమానియందు విశ్వాసముతోనే యుండవచ్చును. అట్టికుక్క మిగత జంతువులయందును ఇతర మనుష్యుల యందును పిచ్చిలక్షణములు జాపుచు కరచుచుండును. ఇట్టి పిచ్చిఎక్కిన జంతువు కరచినను నాకినను కూడ మానవునికి కుక్కపిచ్చి ఎక్కును. ఈ విషము పిచ్చిఎక్కిన జంతువు యొక్క లాలాద్రవమందుండును. కరవబడినను నెలల తరబడికూడ వ్యాధికనిపించక పోవచ్చును లేక ఒకప్పుడును కనపడకపోవచ్చును. లక్షణములు పూర్తిగా కనపించిన బ్రతుకుట దుర్లభము.

విషయుక్తమైన కోరలతో కరచుటచేత కాటుగల చోట మొద్దుబారును. గాయమునుండి ఎక్కువగా నల్లనిరక్తము కారును. కాటుబడ్డ తరువాత అరు వారములలోపల వ్యాధి బాగుగావ్యాపించును. ఈలోపల గాయముమాని చెక్కగట్టును. కాని చెక్కదగ్గిర బాధగా నేయుండును. వ్యాధి కొంచెము భయము మనస్థిమితము లేకపోవుట జ్ఞానహీనికలుగుట ఈ లక్షణములతో అరంభమగును. ఇదియంతయు 24 గంటలలో జరుగును. తరువాత పూర్తిగా మనస్థిమితము లేకుండును. నిద్రపట్టదు ఆకలి నశించును. నీళ్ళుచూచి భయపడును. కొంచెము జ్వరముకూడా తగులును. తెరలు తెరలుగావచ్చి నాలుక మెడ బిగుసుకపోవును. గుటక పడదు శ్వాసనిరోధము కలుగును. మ్రింగుటకు ప్రయత్నముచేసినకొలది భాధ యెక్కువగును. నోటిలో తీగవంటిచొంగ కారుచుండును. తీసివేయుటకు సాధ్యము కాకుండును, శ్వాసము తీయునప్పుడు మిక్కుటముగా ధ్వనికలుగును. కుక్క మొరుగుచున్నటులే తోచును. క్రమేణా ఇదియంతయు శమించి రోగి రెండు మొదలు వారమురోజులలో చనిపోవును. అట్టిరోగి కుక్కయొక్కగాని కరచిన యే యితరజంతువుయొక్కగాని ధ్వనిచేయును. అతనికి కరచినజంతువుయొక్క స్వరూపము ఎప్పుడును కనుపడుచుండును. దానిస్వరూపమే నీళ్ళలో కనపడుచుండును. నీటిని చూచినను నీటిపేరుచెప్పినను అకస్మాత్తుగా భయపడును. ఇందుపై లక్షణములలో యేదివున్నను ఆరోగి జీవింపడు. అది అసాధ్యము. ఆరోగ్యవంతుడైనను ఏది కరువకపోయినను నీటినిజూచి భయపడువాడు జీవింపడు.

కరచిన వెంటనే గాయమునకు పైగా ఒకత్రాడుతో గాని గుడ్డతో గాని గట్టిగాగట్టి రక్తప్రవాహము లేకుండ చేయవలెను. ఏమాత్రము గాయమునీదనైనను పిచ్చి జంతువు నాకిననుగూడ గట్టిగ కరచినట్లే తగుజాగ్రత్తగా చికిత్సించవలయును కాటునుండి రక్తము అటులే గాని లేక గాయమును పెద్దదిచేయుటచేగాని బాగుగా స్రవింపజేయవలయును.

తరువాత కాటును బాగుగాకడిగి తుడిచి కార్బాలిక్ ద్రావకము మున్నగు దాహకఔషధములతో గాని కాచిన నేతితో గాని కాల్చవలయును.

ప్రారంభస్థితిలో డాక్టర్ పాశ్చర్ గారి ప్రివెంటీవు యినాక్యులేషన్ చికిత్స ఇవ్వవలయును. ఇట్టిచికిత్స 1880 సంవత్సరమునుండి ఇంతవరకు బాగుగా ఫలవంతమగుచు నేయున్నది. కూనూరు మున్నగు చికిత్సాలయములందు ప్రభుత్వమువారిచే యొసంగబడు చికిత్స యిదియే.

కుక్క మున్నగుజంతువులచే కరువబడినవారు యీ క్రిందివిధుల ననుసరించుట శ్రేయస్కరము.

1. ఎవ్వరైననూ నిష్కారణముగా కుక్కచేత కరువబడినచో వెంటనే చికిత్సకొరకు కూనూరుగాని లేక యే యితర చికిత్సాలయములకుగాని వెళ్ళవలయును.

2. కరచినవెంటనే కుక్కను చంపరాదు పట్టుకొని కట్టివేయవలయును. 10 రోజులు యేవిధమైన విశేషములేక కుక్క సుఖముగా బ్రతికియుండిన మానవులకు యేమియు బాధలేనిచో చికిత్సకొరకు యెక్కడకు

పోనవసరములేదు.

3. ఈ 10 రోజులలో కుక్క వ్యాధిగ్రస్తమై చనిపోయినచో వెంటనే చికిత్సకు పోవలయును. పోవునపుడు కుక్కయొక్క మస్తిష్కమునుగూడ తీసుకొని పోవలయును.

4. గాయముచేసినచోట వాతబడినమానవులు చికిత్స నొందనక్కరలేదు విషమెక్కదు.

5. పిచ్చిజంతువులతో (. మెలిగినను క్రొత్తగా గాయపడనివారు చికిత్స నొందనక్కరలేదు.

6. ఎట్లయినను ఏమాత్రము అనుమానమున్నను పూర్వనిరోధ చికిత్సనొందుట శ్రేయస్కరము. అందువలన నష్టమేమియులేదు.

అయినను రోగము ప్రబలమైనప్పుడు సాధారణ చికిత్సలను లక్షణముల ననుసరించి అవలంబింపవలయును. ఉద్రేకకరమగు గాలి, వెలుతురు, శబ్దము, నీళ్ళు లేకుండజేసి పూర్ణవిశ్రాంతిని కలుగజేయవలయును. రోగికి పోషకమగు ఆహారమును పాలుమున్నగునవి యివ్వవలయును నోటిద్వారా తీసికొనుటకు తగిన పరిస్థితులు ఉండవుగాన గుదద్వారమున ప్రవేశింపజేయవలయును. ఈ సమయమున సమర్థులగు వైద్యులచే చికిత్సను పొందవలయును.

కాటును కాల్చినతరువాత జిల్లేడుపాలతో గాయమునునింపి పుండుచేయవలయును. ఈపుండు తొందరగా మానరాదు. 40 రోజులు వెల్లుల్లిపాయరసము పంచదారపాకులో కలిపి వ్రాయుచుండవలయును లేక వుల్లిగడ్డరసముతో తేనెకలిపి వ్రాయుచుండవలయును.

గాయమునుండి రక్తమును తీసిన తర్వాత ఆవాలు నూరి దానికి వ్రాయవలయును.

తర్వాత ఘృతమును లోనికి పానముచేయించవలయును. జిల్లేడుపాలతో నశ్యముచేయించవలయును. తెల్లగన్నేరు, ఉమ్మెత్తవేళ్ళు కలిపి లోపలికి పానము చేయించవలయును.

ఆంధ్రదేశమున ఘృతముతో కాల్చి రక్తమును స్రవింపజేసిగాని చేయకుండగాని వ్రణమునకు కాకరియాకు రసముపోసి రాగిడబ్బుతేసి కట్టుట చాలకాలము నుండి అనుభవమునయున్నది. ఫలప్రదమైన చికిత్సలలో ఇది ప్రధానమైనది అని ఆంధ్రమహాజను లందరిచేతను విశ్వసింపబడి ఆచరింపబడుచున్నది. ఈ చికిత్సావిధానమును యింకను పరిశీలించి విశ్వకల్యాణమునకు తోడ్పడుట ఆంధ్రవైద్యశేఖరుల విధి.

—డాక్టర్. వి. వి. యస్. ఆరాధ్య,
యల్. ఐ. యమ్.


ఆంధ్రకీర్తిగ్రంథమాల : ౧.

## ఆంధ్రరమణీమణులు

(మొదటి భాగము.)

ఇందు రుద్రమ్మ, గణపమ్మ, నాగమ్మ, మాంచాల, రాగమ్మ, మహాలక్ష్మమ్మ, సీతమ్మ, మల్లమ్మ, రమణమ్మ అను తొమ్మండుగురు తెనుగు తెలివల జీవితములు తేటతెనుగున బాలికలకును, స్త్రీలకును ఉపయుక్తముగ నుండునట్లు వ్రాయబడినవి. స్త్రీవిద్యాభిమానులాదరింపదగిన గ్రంథము. గ్లేసు కాగితములు, క్రౌనుసైజు 96 పుటలు చక్కని అచ్చు.

ప్రతి ఒక్కంటికి 0—9—0 అణాలు.

ఆంధ్రకీర్తిగ్రంథమాల : ౨.

## కేయూరబాహు చరిత్రము

(వచనము.)

ఆంధ్రవాఙ్మయమునకు కీర్తి నిదెచ్చు ప్రాచీన పద్యకావ్యములలో నొకటియు, శిల్పము మెరయ మంచన మహాకవి రచియించినదియునగు 'కేయూరబాహుచరిత్రము'న కీగ్రంథము వచనముసేఁత. వదునవదుమఁ బ్రసక్తానుప్రసక్తిగఁ జొప్పింపఁబడిన నీతిగర్భితములగు కథలలో నిది బాలబాలికలకుఁ బఠనయోగ్యమయియుండును. క్రౌనుసైజు. గ్లేసు కాగితములు. 88 పుటలు. చక్కని అచ్చు ప్రతిఒక్కంటికి 0—9—0 అణాలు.

చిరునామా:—ఆంధ్రభూమి కార్యాలయం
వేపేరి, మదరాను.

# ఊర్వశీపురూరవము

గతపంచిక తరువాయి.

[భావరూపకము.]

పురూరవుఁడు :

నాభూమినే మనుష్యుఁడిట్లు ప్రశంశింపఁ గలఁడు. అతి మనోహరము.

[అచ్చరలు నృత్యము ఆపుదురు]

కొందఱు - అచ్చరలు :

మఱియొక పాట.

మఱికొందఱు :

అదే మఱొకమాఱు.

రంభ :

మీ యాత్సుక్యము సూడఁ దిరిగి స్వర్గమునకుఁ బోనొల్లనివారి వోలెఁ గనఁబడుచున్నారు. ఇఁక పాటవల దాటవలదు. మన మందఱము వచ్చియుంటిమో లేదో చూచుకొని చీఁకటి పడకమున్న యెగిరిపోవలయు. [అని మేనకనుజూచి] ఏమే మేనకా! సృష్టికిఁ బ్రతిసృష్టిసేసిన విశ్వామిత్రుని గరంచి సకలమైన వింతల నెఱుంగు నీకును నింత సవనవోత్సాహ మఁటే ? త్వరపడుము.

పురూరవుఁడు :

మిత్రమా ! వీరిలో నాయూర్వశి యగపడదు.

ప్రియవయస్యుఁడు :

ఆమె యేమో ?

పురూరవుఁడు :

కాదు. ఒక్కనిముసము వీరు వోకుండిన బాగుండును.

రంభ :

తిలోత్తమా ! లే ! కూరుచుంటివా ?

మేనక :

మేమందఱము సిద్ధముగనుంటిమి. జాగెల్ల నీయదియే.

రంభ :

నాదెట్లు ?

మేనక :

మూలమూలలనుండి యజ్ఞపురుషులను, వీరపురుషులను జూచుకొన దవ్వవోయి యిప్పటికిఁగాని రావైతివిగా.

రంభ :

మాటకుమాట తీర్చుకొంటివా ?

మంజుఘోష :

ఈ సంపన్నృతులచే మీరిరువురు మాత్రో రాకపోదురా యేమి ?

రంభ - మేనక :

కలసివచ్చి కలసివెడలని నెచ్చెలు లెవ్వరైన మనలో నుందురా ?

తిలోత్తమ :

ఉండకేమి. ఊర్వశి యింకను రాలేదెందు చనెనో ?

వరూధిని :

తన పురూరవుని నెమకుకొనుచున్నదేమో ?

ఊర్వశి :

చిత్రలేఖా ! నామనంబు వరూధిని కెట్లు తెలిసినదే ?

పురూరవుఁడు :

పురూరవుడన్న నేనేనా ?

ప్రియవయస్యుడు :

వీరిమాటలనుబట్టి చూడ నూర్వశియిందే యుండవలయు.

పురూరవుడు :

వీరిలో లేదు.

ప్రియవయస్యుఁడు :

మిత్రమా ! నీకోర్కె ఫలించుఁగాక.

రంభ :

చిత్రలేఖ కూడ లేనట్లున్నది.

మేనక :

ఇరువు రిటువైపునకే వచ్చినట్లు వచ్చినారు.

రంభ :

ఇట్లువచ్చిన నేమగుదురే? ఊర్వశీ ! ఊర్వశీ ! చిత్రలేఖా ! [అని పిలుచును]

అందఱును :

చిత్రలేఖా ! ఊర్వశీ ! [అని పిలుతురు]

రంభ :

అయ్యయ్యో !

రక్కసుఁ డెవ్వఁడేని మన
రామల నెత్తుక పోయినాఁడో కో ?

పురూరవుడు :

[వెలికివచ్చుచు]

ఇక్కడ నేఁ బురూరవుఁడ
నేలికనై భువిఁబ్రోచుచుండ నా
చక్కనిచుక్క యూర్వశి, ని
శాచరు పాల్పడు టెట్లు ? వ్రేల్మిడిన్
ఉక్కడగింతు వానిఁ; బ్రుటి
లోఁగొనివత్తును మిమ్ముఁగూర్చెదన్.

చిత్రలేఖ :

[వెలికివచ్చుచు]

అక్కృప నీకెయున్న జగ
దేక నుపీరుఁడ ! యేలుకొమ్ము నీ
చక్కని చుక్క యూర్వశి ని
శాచరు పాల్పడకుండ మేల్పడన్.

రంభ :

ఏడీ ? నిశాచరుఁడు ?

చిత్రలేఖ :

అదుగో ! ఆకసమున [అని చంద్రుని జూపును.]

రంభ :

ఏమే నీ చమత్కారతనము.

ఊర్వశి :

[వెలికివచ్చుచు] చందమామ వాడిచిన వెనుక మనమిందు జాగొనరుప్పటుచితము గాదు. మనకు భూమి శాశ్వతముగాదు.

తిలోత్తమ :

ఇట్లనువారలే !

ప్రియవయస్యుఁడు :

[పురూరవునితో] మనకు మాత్రము పురూరవా ? భూమిశాశ్వతమా ? అత్తవారింటికిఁ గ్రొత్తకోడలు వచ్చినప్పుడైన నింత తొందఱపడదే ? స్వర్గమునకు వెళ్లినప్పుడు నీ వెన్నిరాత్రులుండి వచ్చితివి.

పురూరవుఁడు :

ఒక్కరాత్రి మాత్రమే.

ప్రియవయస్యుఁడు :

వీరుకూడ నదియు మంతమాత్రమైన నుండిపోవలదా ?

పురూరవుఁడు :

అట్లుసెప్పి వారి నొప్పింపుము : మిత్రమా !

రంభ :

బ్రాహ్మణోత్తమా ! మీ రాజోత్తము సందర్శనంబు మాకెంతయు సంతోష ప్రదంబయ్యె. కులిల వత్తుముగాక భూమిపై నిప్పు

ఆంధ్ర గా॰ వి॥



కొండకొలనుకు వికసితోత్పల శీర్షిక దశమవార్షికోత్సవ సందర్భమున




విశాఖపట్టణ హార్బరు దృశ్యము

డుండుటకు మాలో నెవ్వరికిని వలనుపడదు : కాదుటరా!

అందఱును :

ఎవ్వరికి వలనుపడును ? ఎవ్వరికిని వలను పడదు. [అని యెగుర]

పురూరవుడు :

ఊర్వశీ! ఊర్వశీ! నీవుకూడ నెగిరిపోవు చుంటివా ? [అని చెఱఁగువ దిగుచు]

ఊర్వశి :

[దిగుచు] చిత్రలేఖా! ఉండవే. ఏమి పాపమో ? తెక్కవిడుట లేదు.

చిత్రలేఖ :

రంభాదు లెగిరిపోవుచున్నారు. రావే! [అనుచు త్వర]

ప్రియవయస్యుఁడు :

ఎవ్వరును నెగిరిపోను. అదుగో! చెట్ల మీద వ్రాలుచున్నారు. నేనాపుదుగాక.

ఊర్వశి :

మనోహరా! నన్నీమాటికి విడువుము. చెలులంద ఱెదురు చూచుచున్నారు.

పురూరవుఁడు :

ఓ చెలి! స్వర్గలోకమున
నున్నవియెల్లను నొక్కయెత్తు, నీ
వాచవి యొక్క యెత్తుగను
భావనసేయుదు నాటనోలె : నె
ట్లో చెయిఁజిక్కితీ విపు, డ
యో! యిదితప్పిన నానదప్పు : సం
కోచమదేమి ? యోచెలువ!
కూరిమి నాపై నీకు లేదొకో ?—
లేదనుము. విడిచిపుత్తును.

ఊర్వశి :

[తనలో] ఎట్లు లేదనఁగలను ? రాక్షసులఁ బరిమార్చి నన్ను రక్షించుకొని వచ్చినప్పు డీతని వక్షస్థలపీఠిని రారాపుగన్న నా యురోజాంచల ప్రణయపులకితాంకురంబు లెట్లు లేవన నేర్తు ?

చిత్రలేఖ :

ఊర్వశీ! రాజన్యునకుఁ బ్రత్యుత్తరం బీయక యున్నకుండు టనుచితంబు.

ఊర్వశి :

చెలీ! మనము పరాధీనుల ముగదా! ఎట్లిచ్చ వచ్చినయెడ నిలువగలము ?

పురూరవుఁడు :

దేవతలు పరాధీనులను మాట వినుటకిదే తొలిసారి.

చిత్రలేఖ :

అష్టే : అనుదిన మింద్రునానతిని
నాడఁగఁ బాడఁగఁ బోవునట్టి మా
మనికి స్వతంత్ర మెట్లగును ?
మానవనాథుఁడ వౌచు భూమి నం
తను భవదీయశాసన వి
ధానము లెల్లగనేలు నీకు నెం
దును బరతంత్ర భావమది
దోపదు భాగ్యముగాదె మాకిటన్.

పురూరవుఁడు :

మీచెలి యింతకు జడియునది నాపరమమిత్రుఁడగు దేవేంద్రుని గూర్చియా ?

చిత్రలేఖ :

నాకట్లే తోఁచుచున్నది

పురూరవుఁడు :

దేవేంద్రుఁ డింతకు మున్న నామనం బెఱింగి నాప్రణయంబు ఫలసిద్ధి వడయ దీవించి యున్నాడు.

లేతకమ్మితూండ్ల లీలనీ బాహువు
నాదుమెడను నేఁబెనంగ వైచు
కొనుచు నిన్నుఁదెచ్చి కోమలియిదెయంచు
నప్పగించునప్పు డరసె నతఁడు
ఉవిద! ప్రణయమొకటె యూహానుబోల్పక
నృత్యమపుడు నేను నిన్నుఁ జూడఁ
జూచె నతఁడు మఱియుఁ జూచినవాఁడుగా
వీడుకోలు గొనెడు వేళ మనను.

ఆతని కతంబున నీ వించుకంతయు భయం

పడ నవసరము లేదు. మఱియు రక్కసులఁ బరిమార్చి మహోపకార మొనర్చిన నా యెడ నతని కాపాటి కృతజ్ఞత యుండదా ?

చిత్రలేఖ:

దేవేంద్రు లాపాటి కృతజ్ఞత యుంచక పోరు. ఊర్వశీ! నీ వుండుము, మేము పోయి వత్తుము.

ఊర్వశి:

అయ్యయ్యో! చెలులారా! మీతో రావలదందురా? మిమ్ము జూడ కొక్కనిముసమైన నిందుండఁగలనా మఱల మీతో విహరించు టెప్పుడు?

చిత్రలేఖ:

ఎంత బేలవే? ఊర్వశీ!

స్వచ్ఛమైన యాకసమున సతతము రవి
చంద్రులీ। మచ్చువెలయుండ మేము మఱల
మఱల రామొకో?। వచ్చి నిన్ను జూడమొ
క్కో? వనిత! యింతసీకు రా। నిచ్చయున్న
వెంటఁగొనమె? యింత వెఱ్ఱియుందునే?॥

అట్లు కంట నీరు పెట్టుకొందురే?

ఊర్వశి:

[కన్నీరు తుడుచుకొనుచు]

చెలియా! యెప్పుడు నీజంగబుపయి నా
శీతాంశు పూర్ణప్రభల్
వెలయన్ నేర్చునె? మబ్బువేయునఁటుముల్
బిట్టార్చు నచ్చంపు టీ
వెలుగెల్లన్ వడిఁగారు నాజెడిసి రా
పీలింత లేకుండు నా
ఖులు పెక్కుల్ గలుగంగవచ్చునెటులో
లోలాక్షీ! యోజింపుమా!

పురూరవుడు:

ఎట్టి భీతి! ఇందుకే స్త్రీల నబలలందురు దయితా!

సురసైన్యంబు జయింపరాని ఖలులన్
ద్రుక్కించి లోకాళి క
బ్బురమౌ నీ యొడలొప్పఁ జెప్పి, మదిలో
మోహంబు సూచించి, క్ర
మ్మఱి నే నిన్నెతలంచు నత్తరిని కొ
మ్మా! నీవు 'నం' యన్నఁ దా
నరనుండే? మునియింటి ముచ్చు మధుమా
సంబింత తప్పించుచో.

ఊర్వశి:

ఏమో? ప్రభువులు నిరంకుశాధికారులు.

పురూరవుడు:

బెత్తెడు మబ్బు మింటనొక
వీథిఁ బట్టఁగ నీను నమ్ము న
న్నిత్తఱి—

ఊర్వశి:

పట్టినా, నిలువ
నిమ్మహా; నాతఁడ మందపాయుదున్.

పురూరవుడు:

పుత్తడిబొమ్మ! యేల పలు
మోహపు మాటలు? అల్లె-అల్లె—

చిత్రలేఖ:

సీ

చిత్తము శాంతినందఁగయి
చేసి గడంచుము ప్రాణనాయకున్—
మేమిఁకఁ బోయివత్తుము.

ఊర్వశి:

రంభాదు లేమనుకొందురో కదా?

చిత్రలేఖ:

ఏమనుకొందురు? తమంతటిదానవైతి వనుకొందురు, [అనిపోవుచుండ మేఁకపిల్ల లామెను వెంటాడు] కూనలారా! నావెంట రాకుడు. మీచెలి వెంటఁ బొండు. సహజ చిహ్నములగు మిమ్ము ఆమె ఏమఱునంతటి విమోహిత కాదు.

[అని వెడలిపోవును. మేఁక పిల్లలను ఊర్వశి చూపదు] [ఆమెను సాగనంపునట్లు ప్రియవయస్యుఁడు నిష్క్రమించు]

పురూరవుఁడు:

సఖీ! చిత్రలేఖ కూడ యరిగినది. ఇఁక

నైన నాతో మనసుదీఱ మాటాడుము.

వండు వెన్నెలపాట బాడుము
పడఁతి నాతో వలపులాడుము
ఇవిగో! మల్లియ లిడుసుమంబులు
చూడు! లలనరో! చూతఫలములు.

ఇట్టివి నాకలోకంబునైన నుండవు.

ఊర్వశి :

ఉండనేరవు నిజముగ నివి యద్భుతములే కాని యీమల్లియ ఫలింప దనుకొందు. ఈ మావి ఫలము ఫలించియుఁ జెట్టున నిలిచి యుండ దనుకొందు.

పురూరవుఁడు :

పూయునవన్నియు ఫలించి, ఫలించిన వన్నియు నిలిచియున్న భూలోకంబునఁ గొదవయేమి? స్వర్గమున నన్నియు నట్లుండునా?

ఊర్వశి :

అట్లుండును గనుకే యడిగితిని.

పూయనితీవ; పూసి ఫల
మున్ గననట్టి సుమంబు; పండి య
ట్లేయెలయింప నిల్వని ఫ
లిన్ గనబో మొకటేని నాకమం
దో యువనీశ!

పురూరవుఁడు :

అయ్యదియె యుత్తమమందె మనోహరాంగి!

ఊర్వశి :

ఏ
మో యిల నొక్కనాఁడు నిక
నున్నది కన్నది లేదు పూర్తిగన్.

పురూరవుఁడు :

అట్లయినరమ్ము! నాభూచక్రమెల్ల నీ సందర్శనంబున నందగించుఁగాక. అడుగో! నీ చెలికత్తియలను వీడుగొల్పి నా ప్రియ మిత్రుఁడు రథముదోలుకొని వచ్చుచున్నాడు మన మెక్కిపోదము.

ప్రియవయస్యుఁడు :

[నేపథ్యమున] పురూరవా! పురూరవా! ఎందు? దారిఁగనకుంటి. త్వరగ నింటికిఁ బోదము. మబ్బు వేసినట్లున్నది.

ఊర్వశి :

మబ్బా? మేఘమా?

పురూరవుఁడు :

మబ్బని పలికినాఁడా? ఏమియు లేదు. పైకిఁజూడుము. మిత్రమా! ఇటు ఇటు!

[ప్రియవయస్యుఁడు రథము దెచ్చు]

చెలీ! రథమెక్కుము. వయస్యా! ఏమి యట్లు కూకయిడితివి.

ప్రియవయస్యుఁడు :

[రథముబోనిచ్చుచు] ఏమియు లేదు.

చెట్లగుంపులోనఁ జెదరిన చీఁకటి
నరసి మబ్బటంచు నడలినాఁడ:

పురూరవుఁడు :

అడలిపోతి నేను పలికిన నీకేక
నడలినదిగ నాప్రియాంకురంబు.

ప్రియవయస్యుఁడు :

రాజోత్తమా! నీ వడలితివన్న మాట యీనాఁడు వింటిని. నీవుకాక మఱెవ్వ రడలిరంటివి?

పురూరవుఁడు :

మిత్రమా! హేళనముమాని హయంబులం ఝళిపింపుము

ప్రియవయస్యుఁడు :

నిశ్చయము. ఆడువాండ్రున్నప్పు డింతె రాత్రిపడ్డవెనుక నడవుల నాలసించుటతగదు.
[అని రథమును బోనిచ్చుచు తనలో పాట]

వేయేండ్లు వింత నీ వెలఁదిని గూడి
వేయిగ నెషయని యామునినుఖము
మహిఁగాంతుఁగాక న న్నలువవుగాక.

[అని నిష్క్రమింతురు.]

[మేఁకపిల్లలు తప్పి చరించు]

ప్రథమాంకము - సంపూర్ణము.

—సశేషము.

—కవికొండల వేంకట్రావు, బి.యల్.

# కీటకములు - మానవుడు

౧

ఈ లోకమును తమవశము చేసుకొనవలయునని పోరునట్టి తెగలలో మానవతెగ యొకటి, కీటక బలగ మొకటి ముఖ్యములు. సంఖ్య యందేమి, అంగనిర్మాణ మునందేమి, కార్యకలాపము నందేమి, కీటకములు మానవుని ఆశ్చర్యమును జెందునట్లు చేయుచున్నవి. అయితే లఘువులగు కీటకములకు,మనో బుద్ధి వికాసముల పాటి లేని మానవునకు పోటీయేమని పలువురకు సందియము కలుగవచ్చు. సహజమే. కాని, మానవలోకమునే పిలువబడు నీ లోకమును కీటకలోకమని పిలువవచ్చునని శాస్త్రజ్ఞులు నమ్ముచున్నారనిన అట్టి సందియములకు తావుండరాదు.

కీటక పదమును మనము సర్వసాధారణముగ వాడుచున్నాము. కీటకమునకు ఆంగ్లపదము (ఇన్ సెక్ట్). శీర్షకాళ్ళుగల జంతువుల వంశమునకు చెందినవే యీ కీటకములు. పక్షులు ద్విజన్ములుగా వ్యవహరింపబడినట్లే కీటకములును మూడునాలుగు జన్మలకు (దశలకు) లోనగుచున్నవి. చరమ దశత్వమునుపొంది, పరిపూర్ణాంగ నిర్మాణముగల ప్రతికీటకమును 6 కాళ్ళను గలిగియుండును. అవలంబనవలన కొన్నిటికాళ్ళు తగ్గిపోవచ్చును; ఇంతవఱకును 'షట్పాది' యను బిరుదమును వహించిన తుమ్మెదకేగాక, ప్రతికీటకమునకు షట్పాది యను పేరియవలసియున్నది. కాని, పరిణామావస్థలో నున్నట్టియు, పై చెప్పినట్లు అవలంబనా విధానమువలన పరిణామమునందినట్టియు కీటకములు షట్పాదులు కాకపోవచ్చును. అంతమాత్రమున వానిని కీటకములు కావని తలంచుట పొరపాటు.

కాలపుటలను తిరుగవైచినచో మనకు కీటక మానవ సంఘముల పుట్టు వెప్పటిదో తెలియగలదు. కీటకములు ప్యాలిజోయిక్ శకము (ఇది భూగర్భశాస్త్రజ్ఞులు నిర్ణయించిన కాలము)లో మూడవపాదములో సృష్టింపబడినట్లు శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. అనగా మానవుడు పుట్టుటకుముందు 3800-4600 లక్షల సంవత్సరములకు పూర్వమన్నమాట. మానవుడు లోకములో అవతరించి పదిలక్షలయేండ్లు కాలము మాత్రమే. దీనినిబట్టి మానవునకంటె గూడ కీటకములకు ప్రపంచానుభవము ఎంత అమితమో ఊహింపనగును.

కీటక తెగకును, మానవునకునుగల విశాలవ్యత్యాసముల నీక్రింది పట్టికవలన తెలియనగును.

కీటకములు:—1. వెన్నెముకలేని జంతువులలో అగ్రస్థానము నందినవి. 2. అనేకరకములు. మానవునకిప్పటికలకు తెలిసినది సుమారు 62500 రకములు; రకమున కొక్కొక్కటికి కోటానకోట్ల కీటకవ్యక్తులు గలవు. 3. పలువిధ పదార్థము లాహారములుగా గలవు. 4. కీటకములు సృష్టి పరిణామములో చరమదశను బొందినవి. అనగా అవి వాని శక్తిసామర్థ్యములలో సంపూర్ణత్వమును బొందినవన్నమాట.

మానవుడు:—1 వెన్నెముకగల జంతువులలో (అనగా జంతు నిశ్రేణి మొత్తములో) అగ్రస్థానమునందియున్నాడు. 2. మానవుడు ఒక్కరకము. మానవుల సంఖ్య 200 కోట్లు. 3. మానవుడు కొంతవఱకు మాంసాశనుడైనను, మొత్తముమీద, వృక్షములపై ఆధారపడవలసిన వాడే. 4. మానవుని తెలివితేటలు, శక్తిసామర్థ్యములు చరమదశకు రాలేదు. అనగా మానవుడు పైగుణములలో యింకను వృద్ధినందు నవకాశము లున్న వన్నమాట.

ఈ విశాలవ్యత్యాసములు తెలిసినపిదప, కీటకములింతటి జేగీయమానమున తమస్థానమును నిలుపుకొనుటకుగల కారణము లెట్టివియో యెరుగుట అవసరము. కీటక ముఖ్యగుణమగు లఘుదేహము వాని జయమునకు మొదటి కారణము. దానితోడు వానికున్న రెక్కలు, మఱింత అనువును కూర్చిపెట్టినవి. అందుచే, కీటకములు భూ జలాకాశముల మూటినిగూడ తమ విహారభూములనుచేసుకొనినవి. నిన్నమొన్నటివఱకు మానవుడు ఆకాశగమన మెఱుగడు, కీటకములకో అది చిన్ననాటి

విద్దే కీటకములకున్న ఆహారభూములు విశాలమైనవి. మానవు డందుకొనలేని ఉపయోగించుకొనలేని అనేక పదార్థములు, వానికి తిండి. కీటక ప్రత్యుత్పాదనశక్తి మానవునకు అందుబాటులో లేదనియే తలంపవలసియున్నది. ఏ మానవుడు నాలుగువేల పిల్లలను బెట్టగలుగును? ఈ పాటికార్యము అనేక కీటకములకు ప్రకృతి ప్రసాదమగు హక్కు. వీనికితోడు, మానవునకు సైతము కొన్ని విషయములలో లేని తెలివితేటలు కీటకములకున్నవి. అవి ప్రకృతి జన్యములు గావచ్చును, పట్టుబడినవి కావచ్చును. చిత్రవిచిత్ర వర్ణములతో శత్రువుల మోసగింపగలనేర్పు, వేరొక కీటకవ్యక్తి ననుసరించి, దాని ఆకారరూపముల నటించి, విరోధులచే జిక్కకుండగను, తమ పొట్టను నింపుకొనుచును, వ్యవహరింపగల నటనాకౌశలము, అనేక కీటకములకు ప్రసాదింపబడినది. మానవులలో, ఏ కొద్దిమందిరో రసపిపాసచే పాత్రల నభినయించుచుండ, కీటక రకములలో నీ పాత్రాభినయన కౌశలము, భుక్తిమార్గమునకు, నిత్యజీవనమునకు తోడు పడుచున్నది. అనుకూల వాతావరణములేని సమయమున ఏ మారుమూలలలో తలదాచుకొని, మరల అనుకూల కాలము వచ్చినపుడు, విజృంభించి, తమ వంశమును లెక్కకెక్కువగ పెంపొందించి, సర్వవ్యాపకములై యుండు శక్తి, కీటకములకు ప్రకృతిజన్యమే. కీటక సామాన్యమునకుండు నాలుగుదశలు, వానికి ఒకవిధమైన రక్షణమార్గములు. ఇట్లు కీటకలోకము లోకములో ఒక పార్టీగా యేర్పడి, మానవునితో పోటీకి నిల్చియుండుటలో అబ్బురమేమి?

మానవునకును, అల్ప జంతువులకును అనాదినుండియు వైరమే. అందు ముఖ్యముగ కీటకముల బారినుండి మానవుడు రక్షించుకొనుటకు పడు శ్రమ యింతంత కాదు. కీటకములు మానవుడు ముఖాముఖి కలియనిదెక్కడ? మానవుని పంటలపై పురుగులు, ధాన్యాగారములలో పురుగులు, దాపుడు వస్తువులలో కీటకములు, బట్టలపై కీటకములు, కలపపై కీటకములు, మానవుని భోజనపదార్థములపై కీటకములు, మానవుని శరీరముపై కీటకములు, అది యిది యనక అనేక పదార్థములను మానవుని నోరుగొట్టి తమనోట వేసుకొనునవి కీటకములు. మానవుని పెంపుడు పశువుల పట్టి బాధించునవి, వానికిని మానవునకును అనేక రోగముల వ్యాపింపజేయునవి, యీ కీటకములు గాక మరియేమి? అయితే కీటకబలగములోనూ, మానవునకు మిత్రులు లేకపోలేదు! అత్యంతోపయోగకరములైన అనేకపదార్థములు మానవుడు కీటకములనుండియే పొందుచున్నాడు. తన శత్రువులపై అనేకకీటకముల బ్రయోగించి, భేదతంత్రము నుపయోగించుకొని, తన్నుతాను రక్షించుకో గలుగుచున్నాడు. కావున మానవునకును, కీటకములకును అత్యంత సన్నిహితసంబంధమే ఉన్నది!

మానవునకు సంబంధించినంత వరకు కీటకముల వర్గీకరణ మిట్లు చేయనగును.

కీటకములు.

| అనుకూలములు. | తటస్థములు. | ప్రతికూలములు. |
|---|---|---|
| ౧. పంటపీడలు | | ౧. కలుపుపీడలు. |
| ౨. నిల్వపరకు పీడలు | | ౨. శత్రువుల శత్రువులు |
| ౩. ఇంటి పీడలు | | ౩. ఆదాయకరములు |
| ౪. పశు పీడలు | | |
| ౫. రోగ వ్యాపకములు | | |
| ౬. మిత్రుల శత్రులు. | | |

మానవుడిట్లు కీటక ఆహారవిహారాదుల పరికించి, తనకు అనుకూలమైన వానినుండి ప్రతికూలమగు వానిని వేరుపరచి, ప్రతికూలుర రక్షించుచు వాని సహాయ్యమును తాను పొందుచు, శత్రువులనొకకంట గనిపెట్టి యుండి వాని దుంపనాశనమునకై పన్నాగముల పన్నుచు, తటస్థులతో జోక్యము గలిగించుకొని తన కాలమును వ్యర్థపుచ్చుకొనకుండ జూచుకొనుచున్నాడు. అందుచే కీటకములపై దాడి, మానవునకు ముఖ్యమైనది. కీటక విషయముల సమగ్రజ్ఞానము గలిగించుకొని, దానిని మానవ శ్రేయోభివృద్ధికై వినియోగించుటకై, పలువురు నియోగింపబడియున్నారు. వీరెట్లు తమ కార్యముల నెఱవేర్చి మానవ పురోభివృద్ధికి కారణులగుచున్నారో ముందు చూడనగును.

—జా గు గో పా ల రా వు.

# ఆవేదన

తండ్రీ! నా సర్వస్వం తమకు అర్పించాను. నా చంద్రికమాత్రము నన్నే ఆశ్రయించి నాతోడునీడై ఉంటేచాలునని సంతసించాను. అది నా దేహ లోహమునకు పరుసవేది. ఈ లోకంతో—దాని సాయంతో జీవితంలో పరువు మురువులు చేరవలెనని సంకల్పించుకున్నాను. ఏ చిన్నమబ్బు అడ్డు తగిలినా శరీరం పులకించి హృదయం పీడబారి ద్రవించేది.

తన కాంతి శైత్యంలో నేను తలదిమ్మెత్తి పడిపోయినపుడు మురిసిపడి పారవశ్యాన్ని పొందేవాణ్ణి. ఉద్రిక్తుడనై పోయేవాడిని. నాగర్వ పర్వత సమారోహణం చూచి పరమపిత హసించే వాడేమో, కాలము—చాల జరుగలేదు. మబ్బులు క్రమ్మే సూచనలు కన్పించినయి—అప్పుడు

కృపానిధీ! నా సర్వస్వం తమరు స్వీకరించి నా చంద్రికను మాత్రము ప్రసాదించమన్నాను. నా జీవాల్ని పెకలించుకుపోయినా నా చంద్రికను మాత్రము వదిలిపెట్టమన్నాను. అది ఏమో కాని, ఈ పాడు విశ్వంలో అనవగతమైన ప్రవృత్తి, నా సుఖసంపత్పారవశ్యాల్నీ, అన్యాదృశమైన అనుభూతినీ కన్నార గాంచి సహింపలేకపోయింది.

ఏ కరుణారహిత కర్కశ చిత్తమో! ఏ క్రూరపాశహస్తమో! ఈ నిరంకుశ విధానమునకు పాల్పడినది. పైపయి పర్వి, నవకముల పిపాళించు—కళావితతినా హరింప ప్రయత్నించి, నా చంద్రికను కప్పివైచి, అంధతమసమును వెలార్పినవి.

ఘూర్ణిల్లఁజేసే అలజడితో, హృదయస్థం కావించుకోవాలినని వికావికలయ్యే తీవ్రతతో నాచంద్రికను ఆలింగనం చేసికొన్నా.

వినీల దృక్ప్రిభలు చిందే వలపులను చుంబించాను. ప్రాణాదపి ప్రాణమని మోకరించా, బలాదాకర్షణము పాపమనీ, ప్రార్థించి, దిశావలయమంతా ఆర్ద్రమానట్లు రోదించాను.

కాని—ఆ కఠిన హృదయమున కరుణావిర్భావమే లేదు. అక్లేల? హృదయమే లేదేమో?—కావుననే అప్రత్యుత్తరము—నా నిరాశోపహత దీనపరిదేలితమునకు—

—నాగలింగం వెంకటేశ్వరులు.

[ప్రతిబింబము]నుండి.

# 'అప్పన్న యిల్లు'

౧

మేము ప్రయాణంచేస్తూఉన్న మోటారుబస్సు 'శ్రీరామతీర్థము' చేరేసరికి సూర్యుడు సరీగా నడినెత్తి కొచ్చి ఉన్నాడు. శ్రీరామతీర్థము వెళ్ళి నా యిష్టదైవమగు దాశరథీ సందర్శనం చేసుకోవాలని నాకు చిన్నప్పటినించీ కోరిక.

వైశాఖమాసపు రోజులు వేడిగాడ్పులు అగ్నికీలలలాగ దుస్సహములై చెలరేగడంచేత దావానల మధ్యమునుండి ప్రయాణం చేస్తున్నట్లుగా బస్సులోని వాళ్ళందరమూ నిలకలేక పోయాం.

బస్సుదిగి నాలుగువేపులా చూశాను. శ్రీరామతీర్థం నాకు కొత్తఊరు. మాతాతీయుడైన ఒక ధనవంతుడు ఆ ఊళ్ళో ఒకసత్రం పెట్టించాడనిమాత్రం నాకు భోగట్టా తెలుసును. అతనికీ మాకూ యేదో దూరపు బంధుత్వంకూడా ఉందని మా అమ్మ చెప్పింది. కనబడ్డవారిని అడుగుతూ తిన్నగా సత్రానికి చేరాను.

పొడుంపీలుస్తూ ఒక ముసిలిబ్రాహ్మణు డక్కడ కూచుని 'ఏవూరయ్యా?' అని నన్నడిగాడు. నాసంగతి విని అతను అల్లాపెళ్ళండి పంతులుగా రున్నారక్కడ' అని గట్టిగా అని 'ఓ అంతాయాత్రికులే పెట్టేవాడుంటేసరి. సాయంకాలందాకా వస్తూనేఉంటారు సొమ్ముదాచబెట్టినట్లు' అంటూ విసుగుతో గొణుగుకున్నాడు.

అతనికి తగిన జవాబుచెప్పాలని నాకు తోచింది కాని సమయంకాదని కోపం అణుచుకుని లోపల కెళ్ళాను. విశాలమైనగదిలో పడక కుర్చీమీద పంతులుగారు' కునికిపాట్లు పడుతూ కూచున్నాడు. నా అడుగుల చప్పుడువిని కళ్ళుతెరిచి ఆయన నన్ను ఎగాదిగా చూసి. 'రండి కూచోండి' అని వేరొకకుర్చీ చూపించాడు. 'మాది గోదావరిజిల్లా అండి. శ్రీరామచంద్రుని దర్శనంచేసుకుని వెళ్ళాలని అభిప్రాయం. గ్రామంనాకు కొత్తగనక యిల్లావచ్చాను' అని చెప్పాను నేను.

నేను ఇల్లా అనుకుంటూ ఉండగానే మొదట అరుగుమీద కూచుని నామీద విసుక్కున్న బ్రాహ్మణుడు లోపలికొచ్చి 'వంట అయిపోయింది లేవచ్చు' అని ఏదో గోడకో స్తంభానికో చెప్పినట్లుగా చెప్పి వెళ్ళిపోయాడు.

వెంటనే పంతులుగారు కళ్ళజోడు పండిపోయిన కనుబొమలకి పైగా నుదుటిమీద పెట్టుకుని నావేపు చూస్తూ 'స్నానానికిలెండి' అన్నాడు. సత్రంనూతులో నాదృష్టి ఆనినంతవరకూ నీరు కనబడలేదు. పాతాళలోకంలోఉన్న నీటిని చేదుకుని నాలుగు చేదలతో ఎల్లాగో పోసుకుని భోజనంచేశాము. భోజన సమయంలో పంతులుగారు నా భోగట్టా యావత్తూ తెలుసుకున్నాడు.

నేను తన బంధుకోటిలోని వాడిననీ, ఉన్నతకుటుంబానికి చెందినవాడననీ తెలుసుకున్నతరవాత పంతులు నాపైని ఎక్కువ ఆదరణాభిమానములను చూపించడం ప్రారంభించాడు. సత్రం పుట్టినతరవాత మేడమీదనున్న పంతులు గదిలోకివెళ్ళే అదృష్టం అతిథులలో నాకే మొట్టమొదట లభించినట్లు తోస్తుంది. భోజన మవగానే పంతులు నాతో 'రండి. పైకి దయచెయ్యండి. రేపు పొద్దుటగాని మీకు కొండయెక్కడానికి వీలుండదు. అర్చకులు మధ్యాహ్నమువేళ పర్వతంమీదికి రారు. రేపు ఉదయాన్నే స్నానంచేసి దేవతాదర్శనం చేసుకుందురుగాని' అన్నాడు.

పంతులు ఒకటోరకం నియోగపుబిడ్డ. చుట్టుపక్కలకి ధనవంతుడు. మొదట బహు పేదవాడు. సాలుకి పదివేలరూపాయల రాబడికల భూములను స్వశక్తివల్ల సంపాదించాడు. ధనసంపాదనమే ప్రయోజకత్వమంటే పంతులుని పక్కా ప్రయోజకులలో లెక్క పెట్టక తీరదు. సత్రానికి యేటా మూడువేలరూపాయల రాబడి యిచ్చాడు. బంధుజాతమంతటిలోనూ మా జిల్లాలో కూడా అతనిపేరుచెబితే గౌరవమర్యాదలున్నాయి.

మాశాఖలో పెద్దవాళ్ళని చెప్పకలసినప్పుడు తన్నికూడా చెప్పకతప్పదు. అతని పూర్తిపేరు 'విశ్వనాధరావు పంతులు' కాని 'పంతులుగారు' అంటేనే ప్రజలు ఎక్కువగా అతన్ని తెలుసుకుంటారు.

'కాని ఈ ఆస్తి సంపాదించడంలోనూ, ధనార్జన విషయంలోనూ పంతులు ఎటువంటి ఘోరాలనైనా వెనకతియ్యకుండా చేశాడని ప్రజలలో అభిప్రాయ మొకటి పాతుకునిపోయి ఉంది. అతనియెదుట నోరెత్తడానికి మాత్రం ఎవరికీ సాహసంచాలదు. కాని అతని సంగతి వచ్చినప్పుడల్లా ప్రజలలో గుసగుసలూ, ఈసడింపులూ తప్పలేదు. ఏది యేలాగున్నా డబ్బుకలవాడు గనుక మనసులలో అభిప్రాయము లేమైనా సరే నైనా, అతనిని సర్వత్రా గౌరవించడమే జరుగుతూంది.

పంతులుతో నా కంతసుపూర్వం పరిచయంలేకపోయినా పై విషయాలన్నీ నాకు తెలిసియేఉన్నాయి. అందుచేత నేనుకూడా అతనియెడల ఉచితగౌరవం చూపిస్తూ మేడమీదికి వెళ్ళాను. గదిలోఉన్న మంచం మైనికూచుని ఆయన 'అప్పన్నా! ఒరేవ్! ఒకమంచం ఆయనకి కూడా అల్లావెయ్యి. కాసేపు పడుకుంటారు.' అని బంట్రోతుకి ఆజ్ఞాపించాడు.

నాకు ఒకరింట్లో ఒంటిగాఉండడం అలవాటు తక్కువ. మంచంవేయించుకుని పడుకోవాలని నాకు మనస్సులో పూర్తిగాఉంది. కాని పైకి మొగమాటంగా 'మంచం యెందుకులెండి. ఇల్లా పడుకుంటాలెండి' అంటూ కావాలనకుండా అక్కరలేదనకుండా నీళ్ళునమలడం చూసి పంతులు 'అయ్యో! బాబూ! మంచానికి కూడా మొగమాటమేనటయ్యా! బాగానే ఉంది' అన్నాడు.

మేమిద్దరమూ పడుకున్నతరవాత పంతులు మా జిల్లాకి సంబంధించిన విషయాలు చాలా సేపు అడిగి తెలుసుకున్నాడు. ప్రయాణపు బడలికచేత నాకు కళ్ళు మూతలుపడిపోతున్నాయి. కాని మర్యాదగా ఉండదని బలవంతంగా మెలకువకలిగించుకుని ఆయనికి సమాధానం చెప్పేవాణ్ని.

౨

బాగా పొద్దువాలినదాకా వడగాడ్పులు తగ్గలేదు. అందుచేత సాయంత్రంపర్యంతమూ నేను మేడ దిగలేకపోయాను. ఎండతగ్గటంతోటే ఒకసారి గ్రామంఅంతా చూడాలని నాకు బుద్ధిపుట్టింది. నా కోరికవిని పంతులు అప్పన్నని పిలిచి 'ఒరేవ్! వారితో కొంచెం అల్లావెళ్ళు. రామన్నకోనేరూ, సింహద్వారమూ అవీ చూపించి తీసుకురా' అని నాతోకూడా పంపాడు.

నేనూ అప్పన్నాకలిసి గ్రామంలో కొన్నిస్థలాలు చూసి 'రామన్నకోనేరు' గట్టుమీద విశ్రాంతిగా కూచున్నాం. సూర్యాస్తమానమై చాలాసేపయింది. జన సంచారము కోనేటిపరిసరములలో చాలావరకు తగ్గిపోయింది. దేవాలయార్చకులగు వైష్ణవులిద్దరు రామన్న కోనేటిలో స్నానాలుచేసి పరిశుభ్రములగు రాగిపాత్రలతో నీరు ముంచుకుని సమీపాన్నే ఉన్న ఆలయంలోకి వెళ్ళిపోయారు. చంద్ర కాంతిక్రమక్రమంగా ప్రాబల్యమును వహిస్తూంది. గాలి బహుమందంగా వీస్తూంది. చెరువులోని నీటిపైపు తదేకధ్యానంగా చూస్తూ అప్పన్న నిశ్శబ్దంగా కూచున్నాడు.

పైకి పంతులుని ఎంతగౌరవించినా లోలోపల మాత్రం అతడు బహుక్రూరాత్ముడనే అభిప్రాయం ప్రజలలో వ్యాపించిఉంది. నాయెడల అతని ప్రవర్తననిబట్టి అతను బహుపెద్దమనిషిలాగే కనిపించాడు! అభివృద్ధిలోకివచ్చిన వాణ్ని చూస్తే పాడులోకం సహించలేదు! అని నాలో ఆలోచించుకుని 'ఏమోయ్! అప్పన్నా! మీ పంతులుగారు మంచి ధర్మాత్ముడు సుమా!' అన్నాను.

పరధ్యానంగాఉన్న అప్పన్న నా ముఖంకేసి నిదానంగాచూసి 'డబ్బున్నవారు ధర్మం చెయ్యకపోతే నాలాంటి వాడేం చెయ్యగలడుబాబూ' అన్నాడు.

'అల్లా అనకుసుమి. ధనవంతులందరికీ ధర్మబుద్ధి పుడుతుందిటోయ్! సరే. దానికేంగాని పంతులుగారి కుటుంబం యెవరూ యిక్కడలేరు కాబోలు? ఆయన సత్రంలో ఉంటున్నారేం?'

'భార్య చనిపోయిన దగ్గిరనించీ ఆయన ఇక్కడే ఉంటున్నారండి. దగ్గిరయెవరున్నా ఈయన ధాకాకి ఆగలేరుబాబూ! అబ్బో! పంతులుగారు అల్లా ఉన్నా

రనుకుంటున్నారు కాబోలు దేవాంతకుడన్నమాట'

'అప్పన్న చెప్పిన మాటలో ఏదో అర్థం ఉంటుందని నిశ్చయించుకుని నేను కొంచెందగ్గిరగా జరిగి నాలుగువేపులా చూసి 'అప్పన్నా! పెద్దవాడవూ, కాలంగడిపిన వాడవూనూ. లోకంలో పంతులుని బహు కఠినుడనీ, దురాత్ముడనీ చెప్పుకుంటారు. ఇందులో నిజానిజాలు యేమిటో కనుక్కోవాలని కుతూహలంగా ఉంది. నాకు కనిపించినదాన్నిబట్టి ఆయన బహు ఉదారస్వభావుడిలాగు తోచిందికుమా!' అన్నాను.

'అమ్మ బాబో! పంతులుసంగతి మీకేం తెలుసును! అతనిపేరు చెబితే పిట్టలు నీళ్ళుతాగని రోజులున్నాయి బాబూ! మనలో మనమాట ఆయన ఆరిపేసిన కొంపల దీపాలు నేటికీకూడా వెలిగించే దిక్కులేక ఎన్ని పడి ఉన్నాయో లెక్కలేదు. సరి నామాటకేంలెండి. ఆఖరు దశలో వాటికి కాళ్ళుచాచుకుని కూచున్నాను. నా కొంపా గోడీ, ఆలుబిడ్డలనూ ఆయనే మింగేశాడు. ఇంకెప్పుడో నాప్రాణాలుకూడా ఆయనకాళ్లముందరే వొదిలేస్తాను. అక్కడి కాతండ్రిదాహం తీరుతుంది.'

అప్పన్నముఖం యెర్రబారిపోయింది. విచారపూరితములైన నిట్టూర్పు విడిచి నేలకేసి చూస్తూ కూచున్నాడు, 'ఏం? నిన్నూ బాధపెట్టేడటోయ్ ఇతనూ?' అని అడిగాను.

'అయ్యోబాబూ! నా ఆస్తి అంతా యితనిపాలై పోయింది నాయనా! దిక్కుమాలిన ముండాకొడుకుని చేసేశాడు కాదండీ నన్నూ! ఈ నరపిశాచికి యావజ్జీవ సేవకులైన్నా నేనుమాత్రం మిగిలిపోయాను. ఇంక నేను మాత్రం ఉంటానా యేమిటి లెండి. రేపో నేడో నేనూ రాలిపోయేవాడినే.' అని ఆవేశపూరితుడై పలికాడు.

'అయితే పంతులు నీకేమైనా జీతంయిస్తాడా?'

లోతుకళ్ళనుండి జారి నెరిసిన గడ్డంపైని పడిన కన్నీటి బిందువులను తుడుచుకుని అప్పన్న 'నాయనా! తమరు చిన్నవారైనా బహు కనికారపు మనస్సు కల వారిలాగ కనిపిస్తున్నారు. ఈ ముసలిముండాకొడుకు యందు శ్రద్ధపుచ్చుకుని అడుగుతున్నారుగనక యదార్థం మనివిచేస్తాను. డబ్బువిషయం వచ్చినపుడు పంతులంత తల్లీతేను, బిడ్డాతేను సుమండీ. ఎంతతెలిసి ఘోరాలకేనా వెనకతియ్యడు. పుట్టింటినించి తగినడబ్బు తేలేకపోయిందని ఇతను భార్యని నరకబాధపెట్టేవాడు గాదండీ. ఆయిల్లాలు భూదేవిలాగ ఓర్చి ఓర్చి ఇంటి గౌరవ ప్రతిష్ఠలు నిలబెట్టింది. చివరికి భరించలేక అర్ధరాత్రి వేళ నూతులోపడి సుఖించింది. ఆ కళకళలాడే ముఖం, సీతాదేవిలాగ ఆతల్లి యెప్పుడూ నా కళ్ళకి కట్టినట్లే ఉంటుంది. (అప్పన్న అశ్రువులను రెండింటిని రాల్చి చనిపోయిన యజమానురాలికి తర్పణ మొనర్చాడు) మీ రొక్క నెలరోజు లిక్కడున్నారంటే ఆ మహానుభావుడి జీవనాలకిపడి యెందరు యేడుస్తున్నారో తెలుస్తుంది. ఆ సంగతులన్నీ చెబితే భారతమంత గ్రంథమవుతుంది. ఇంత యెందుకూ! నా ఒక్కడిసంగతి చెబితే మీకు నిజం బోధపడిపోతుంది.'

అప్పన్న కొంతసేపు ఊరుకున్నాడు. నిశ్శబ్దముద్రిత మైన అతని హృదయంలో గతవిషాదపుతలపులు ముమ్మరములై పొంగుతున్నట్లు స్పష్టపడుతూంది. పంతులు భార్య నూతులోపడిపోవడం ఆలోచించుకుంటూ, పుట్టింటివారు డబ్బు యివ్వకపోయినందుకు ఆమెను బాధ పెట్టిన పంతులు క్రూరత్వమును అసహ్యించుకుంటూ నేనుకూడా అల్లాగే కూచున్నాను. చివరకొక నిట్టూర్పువిడిచి అతడు మెల్లిగా చెప్పాడు.

'బతికిచెడడంకంటె చావు మేలు. అందులోనూ హీన దశలోనుండి గతించిన సౌఖ్యపురోజులను తలుచుకోవడంకంటె కష్టం వేరేలేదు. నా చిన్ననాటి కలిమిని గురించి వివేకంగా చెప్పుకుంటేమాత్రం ఈ దీనదశలో లాభమేముంది? అల్లాగని మహదైశ్వర్యంలో తేలిపోయామని చెప్పను గాని,కంచంనిండా గంజో కలో పోసుకుని చెయ్యిములాగ్గా తాగడానికిమాత్రం లోటు లేని సంసారమండీ మాది.

'పంతులుగారికి మేము తరతరాలనాటి రైతులంగాని నేటివాళ్ళంగాము. మాతండ్రి తాతలనుంచీ వారి యినాములను దున్నుకుంటూ పండినాసరే యెండినాసరే వారి శిస్తు డబ్బులుమాత్రం పువ్వుల్లోపెట్టి అప్పగించేవాళ్లము.

అందుచేత నేనెరూ విరోధులమాటలువిని పంతులు మమ్మల్ని భూములేకుండా తప్పించాలని మాకాను గాని పొంగనివ్వాయా అండి మరి! ప్రత్యేకులు ప్రత్యే లేని పోవాలి కాని మాటతప్పడం అనేది మా వాళ్లలో తిరిగే ఒక్కరికీకూడా లేదు. మాట తప్పలేక నే కదండీ భార్యా పిల్లలు ఏట్లో కలిసిపోయి నా మొండిశై పంతులు సమ్మంలో చాటికి కురుకోలేకపోయింది! ఈ లేమి దశలో నేను తమతో నిజం మనవిచేపిరా లోకానికి నమ్మతగ్గదిగా ఉండదు. కాని దైవానికి చాటులేదు కదా!'

అప్పుడే ఉదయమందిన త్రయోదశీచంద్రుని నిర్మల కిరణములందు అప్పన్న కన్నీళ్ళు మిలమిల మెరసినవి. చిన్నపిల్లమ ముక్కుముక్కులుగా విరుస్తూ పరధ్యానంగా చంద్రుడికేసి చూస్తూ అతివల్లాగే చెబుతున్నారు. నిజానికి కట్టుబడి నిష్ఠురమను సేవకతుతో కలహిస్తూవున్న మహాయోధునివలె కనబడ్డాడు. అప్పన్న నా దృష్టికి పొట్లపండువలె ముకతలవారిపోయిన అతని ముఖమున ధర్మమార్గానువర్తుల కొంపవలసిన ఠీకమును గర్వమును స్ఫురిస్తున్నాయి.

'పంతులు ప్రాణాలన్ని నా గుప్పెట్లోకొచ్చిన సమయాలు లేకపోలేదు సుమండీ. ఒక్క అబద్ధం చె వాడే సంటే ఆ మనకి నేలకేలు వచ్చంగాకనం నా కీజన్మ బొఖరీ వొదిలిపోవడం జరిగిపోయే ఘట్టాలకొచ్చాయి. ఒక్కమాటతో నేను నిరంతరసౌఖ్యం పొందడానికి తగిన వ్యవహారసందర్భాలు వొచ్చాయి. కాని నా మనస్సు మారుపుంతనిపోడాని కొప్పుకోలేదు.

'పంతులుని లొంగదియ్యడమే తమ ప్రధానాశయముగా చేసుకుంటూవున్న బలమైనపార్టీ ఒకటి యీ చుట్టపట్ల గ్రామాలన్నిటిలోనూ వుంది. ఆ నేకసారులు వాళ్ళు నన్ను ఆశ్రయించి వ్యవహారపు గుట్టుమట్లు చెప్పమని కొన్ని వేలరూపాయలు నా చేతులో పొయ్యబోయారు. కాని అంతరాత్మకిబడికి ఆ లాభాలను త్యజీకరించేశాను.

'ఈ గొడవలోపడి ప్రస్తుతంపంగతి మరిచిపోయాను. మాకూ పంతులుకీ వదేళ్ళకిందటివరకూ అంతా సవ్యంగానే జరిగిందండి. అప్పుడు మూ కారా ఆ విద్యుత్ కంట్రోలుతో జాలం! అదుగో అప్పుడు ప్రారంభమైందండి మా తగువు. అంతకి రెండేళ్ళకిందటినించీ పంటలు పోయి మా కుటుంబం బహు లోటుపడిపోయింది. పరువు ప్రతిష్టలకోసం దేవులాడేముండావాళ్యం వీధిలోపడలేక ఆ రోజుల్లో పస్తులుమాడి ఎన్నివిధాల ఏడిగావా దైవానికి తెలుసును.

'ఆ రెండుమూడేళ్ళకిస్తా పంతులుకి మేము బాకీపడినమాట వాస్తవమే. తరతరాలనించీ వున్న రైతులం కదా అని ఆయన కనికరిస్తాడనుకున్నాం. ఒక్క యేడాది గడువిస్తే వడ్డీతోసహా అప్పు తీర్చేస్తామని మాతండ్రి వెళ్ళి పంతులు కాళ్ళు పట్టుకున్నాడు.

మోహాంమొందుమాత్రం అలాగే అనిచెప్పి మర్నాడే మామీద దావాపడేశాడు. తీవిందిన యౌవనమైనా యేళ్ళలోనూ కోర్టుకుమ్మం తొక్కకుండా బతికాడు మా తండ్రి. తీర్పురైపోయి మా ఆస్తి వేలానికొచ్చేసింది ఈ అవమానాన్ని భరింపలేక మా తాలు వేలంసంగతి తెలియగానే మంచంపట్టిపోయి ప్రాణాలు వొదిలేశాడు. ఒకవంక తండ్రిపోయినదుఃఖమూ రెండోవేపు అవమానమూ కలిసి నన్ను కుంగదీశాయి. మా భూమిని పంతులు తీసేసుకున్నాడు. ధననష్టమూ, ప్రాణనష్టమూ కూడా భరిస్తూ ఇంట్లో పడివుండేవాణ్ని నేను ఆ రోజుల్లో.

కష్టాలెప్పుడూ విడిగారావు చూడండీ! మా ఆస్తిలో చాలాభాగం అమ్మేసినతరవాతకూడా పంతులు బాకీ తీరలేదు మిగిలినసొమ్ముకి నేను అతనికి నోటురాసి యిచ్చాను.

'ఇంతవరకూ ఒక మామూలుగా జరిగేవుండని ఒప్పుకుంటాను. ఏమంటే అక్షరాలా న్యాయాన్ని తూచినట్లయితే పంతులుదే న్యాయం. మేము బాకీవున్నప్పుడు అతను మమ్మల్ని ఎన్నివిధాలనైనా పీడించి వసూలు చెయ్యవచ్చును. చిరకాలంనుంచీవున్న రైతులని క్షోభపెట్టడం ఏమి న్యాయమంటారేమో? అది మానవనిర్మితమైన న్యాయశాస్త్రంలో లేదు. దయా దయాధర్మములమీద ఆధారపడివున్న విషయమది. మన మెవరమూ బలవంతపెట్టడానికి?'

## 3

'రోజులు గడిచిపోయాయి. నాకు ముగ్గురుపిల్లలు. మాట ఖరారు ఒక్కటి తప్ప మిగిలిన ఆస్తిఅంతా పోయింది. మాట ఖరారుగల మనుష్యులమని మాకు భూములెవరిస్తారు యీ రోజుల్లో చెప్పండి? మా చుట్టాలుకూడా మారు మొహంపెట్టేసి వూరుకున్నారు. డబ్బులేనివాడు దెయ్యానికైనా అక్కర్లేదుకదండీ మరి? వ్యవసాయంవిదాయం మానేసి పరువుగలవాళ్ళం కదా అని ఎవ్వాళ్ళు యింట్లో కూర్చోగలము? క్షుద్బాధ ఎంత హైన్యానికైనా ఒడికట్టిస్తుందన్న సంగతి తమరెరగనిదికాదు. పంతులుకి యీవూళ్ళో ఒక అంటుమామిడితోట ఉందిలెండి. అందులో నెలకి రొండ్నిమిదిరూపాయల జీతానికి ప్రవేశించాను. నా భార్యను కూడా యింట్లో పనిపాటలు చేసేటందుకు ప్రవేశించమని పంతులు చెప్పాడు. 'ఇంట్లో పిల్లలని కనిపెట్టుకుని ఉంటుందిరా' అన్నాడు. పొలాల్లో కూలినాలిచేసే అలవాటు మాకు మొదటినుంచీలేదు. అందుచేత ఊరికే కూర్చుంటే లాభమేముందని పంతులుయింట్లో పని మొదలుపెట్టింది నాభార్య.

'ఒక యేడాదిపాటు యీ మోస్తరుగా గడిచిపోయిందండి. ఒకపూట ఉన్నట్టూ, ఒకపూట లేనట్టూ తిండిలేని యీ సంసారం యీడుచుకొచ్చాం మేమిద్దరమూనూ.

'ఒకనాడు నేను తోటలో పనిచూసుకుని అప్పుడే యింటికొచ్చాను. సాయంకాలం యేడుగంటలౌతుంది. చీకట్లు నాలుగుమూలలనుంచీ బాగా కమ్ముకొచ్చాయి. మాఘమాసపురోజులు చలి వొణికించేస్తుంది.

'ప్రతిరోజూ ఆవేళకి యింటికొచ్చేసి వంటచేసుకుని పిల్లలకితినిపించి నాకోసం కనిపెట్టుకుని చూస్తావుండేది నాభార్య. ఆ రోజునమాత్రం చీకటిపడినా యింటికి చేరలేదు. వంటా అది చేసినజాడలేమీ కనబడలేదు కూడాను. ఇంత ఆలస్యానికి కారణమేమిటా అని ఆలోచిస్తూ నేనల్లాగే అరుగుమీద కూలబడ్డాను.

'తోటలో బహుశ్రమపడి పనిచేసినందున అప్పుడు నాప్రాణము బహు నిస్త్రాణపడిపోయింది. గోడకి చేరబడగానే నీరసంచేత నాకళ్ళు మూతలుపడిపోయి నిద్రపట్టేసింది. అల్లా యెంతసేపు పడుకున్నానో యెరగను గాని సుమారు గంటదాటినతరవాత కలుపుగోళ్ళెం తీస్తున్నశబ్దంవల్ల నాకు మెళుకువవచ్చింది. నాభార్య లోపలప్రవేశించడం చూశాను. శరీరంలో నీరసం అధికంగా వున్నందున నేను మళ్ళీ అల్లాగే నిద్రపోయాను. పంతులు యింట్లో అంతవరకూ యేంపనిచేస్తుందో అడగడానికికూడా నాకు ఓపికలేకపోయింది.

'వంట పూర్తిచేసి నన్ను నాభార్య లేపేసరికి రాత్రి పదిగంటలయి ఉండాలి. ఇరుగుపొరుగు యిళ్ళన్నీ మాటుమణిగి నిశ్శబ్దంగా ఉన్నాయి. పిల్లలుముగ్గురూ మంచంమీదా చాపలమీదా వరసావాడిలేకుండా పడుకునివున్నారు. ఇంట్లో ఒక్కదీపంమాత్రమే వెలుగుతూ వుండడంచేత వంటగది ఒక్కటీగాక మిగిలినయిల్లంతా చీకటికోణంలాగుంది,

'భోజనందగ్గిర కూచున్నాను. కాని నాభార్య ప్రవర్తన ఆనాడు నాకు వింతగాకనబడింది. అంతకుముందెన్నడూ నాటివలె ఇంటిని అంతఅశ్రద్ధగా వుండనీయలేదది. సరియైన పక్కలువేసి పిల్లలను జాగ్రతగా పడుకోబెట్టాలిగాని చిందరవందరగా వొదిలెయ్యడానికి దాని మనస్సు ఒప్పుకునేదికాదు. భోజనానికి వెళ్ళేటప్పుడే యీ మార్పునా మనస్సుకి తట్టింది. ఇంటికి ఆలస్యంగా రావడంచేత నాకు తొందరగా భోజనం పెట్టడంకోసం అశ్రద్ధచేసేసింది కాబోలు అనుకున్నాను.

నేను భోంచేసేటప్పుడు యేవో కబుర్లుచెబుతూ నాకు యెదురుగుండాకూర్చుని వొడ్డించడం దాని కలవాటు మొదటినుంచీకూడాను. ఆవేళమాత్రం అది నోరుమెదపనైనాలేదు సుమండీ! ఒళ్ళు ఆలసిపోవడంచేతను, నిద్రమత్తువల్లను నేనుకూడా తొందర తొందరగా నాలుగు మెతుకులు నోటిలో వేసుకోవడమేగాని సంభాషణమీదికి నాదృష్టిని పోనియ్యలేను.

'తిండితినగానే మళ్ళీ వీధి అరుగుమీదకొచ్చి చాపమీద నడుమువాల్చాను. నాకింకా పూర్తిగా నిద్రపట్టకుండానే నా భార్య దగ్గిరకొచ్చి పక్కనే కూర్చుంది. అంతశీఘ్రంగా రావడాన్నిబట్టి అది భోజనం

చెయ్యలేదనే నేను ఊహించాను.

'మాది కొంచెం దగ్గిర సంబంధంలెండి. నాకు మేనకోడలువరస. అందుచేత దానికిన్నీ 'మామయ్యా' అని పిలవడమే అలవాటు. వీధి అంతటా నిశ్శబ్దమే. మందంగా వేస్తూవున్న గాలికి యింటితాటాకులు మాత్రం చిన్న ధ్వనిని చేస్తున్నాయి. మా పెంపుడుకుక్కకూడా ఏచలనమూ లేకుండా పెద్దకుర్రవాడి పీటకి తన శరీరాన్ని ఆనించి ఒక సోదరుడిలాగు పడుకుంది.

'నేను లేచికూడమని 'ఏమే! తిండితినలేదూ? అప్పుడే వొచ్చేశావేం?' అని అడిగాను.

'ఏసమాధానమూ చెప్పకుండా కొంతసేపల్లాగే కూర్చుని మెల్లిగా 'మామయ్యా!' అని మాత్రం పెద్ద నిట్టూర్పు విడిచింది అది. ఆనిట్టూర్పుతోటే ఆ సాయంత్రం ఆలస్యంగా రావడం, యింటిలో అంతా ఖంగారుగా వుండడం అన్నీ ఒక్కసారిగా జ్ఞాపకాని కొచ్చాయి నాకు. దీనికేదో కారణంవుందిరా బాబూ అనుకున్నాను నే నప్పుడు. నా దినముల ధోరణిని బట్టి ఏదో కొత్త విపత్తు నా తలపైని పడిందని హడిలి పోయాను.

'ఏంచెయ్యడానికీ తోచక ఊరికే దానికేసి చూస్తూ కూచున్నాను నేను. కటికచీకటిలో అముఖ లక్షణాలు నాకు స్పష్టంగా కనబడడంలేదు. కాని ఆ హృదయంలో ఒక గాఢమైన ఆవేదన ఉప్పొంగిపోతు న్నట్లు దానివైఖరివల్లనే తెలిసిపోయింది నాకు. ఎన్నడు కాని నాతో అంతదూరంగా కూచుని మాటాడలేదది. అందుచేత బాబూ! తమరు చిన్నవారూ మంచివారూ గనక యథార్థం మనవిచేసుకుంటాను. నేనే దాన్ని దగ్గిరగా కూడదీసుకుని 'ఏమే! ఏంజరిగిందీ? చెప్పవూ!' అని ఎంతో ఆతురతతో అడిగాను. అక్కడ మేమిద్దరమే కదండీ. కొంచెం చనువుగా నాగుండెల కానించుకుని కూచోబెట్టుకున్నాను. నేను ఎంతోసేపు నొక్కినొక్కి అడిగినపిమ్మట అది మెల్లిగా అంది.


'మనబతుకు వట్టి అయిపోయింది మామయ్యా! ఇంక మనం జీవించడ మెల్లాగ?'

'ఎల్లాగ?' అని ఆ అడగడంలోనే ఆమె మనోగత మైన దుఃఖం నాకు కనబడిపోయింది. నాగుండెలు కూడా దడదడ కొట్టుకోవడం ప్రారంభించినవి. ఆ కష్టముయొక్క స్వభావ మెలాంటిదో తెలియక కంగారు పడిపోయాను నేను. అసలు సంగతి యేమిటో చెప్పమని యెంతోసేపు బతిమాలుకున్న తరవాత మళ్ళా 'నే నింక పంతులుగారింటి కెళ్ళను' అనిమాత్రం చెప్పి ఊరుకుంది.

'పంతులుకీ దీనికీ యేదో ఘటిపడిందికాబోలని నేను మహా కొట్టాడిపోయాను. ఏమంటే ఆయనదగ్గిర బతుకుతున్నాం కదండీమరి. అదిగాక ఆయనకి బోలెడు పామ్ముబాకీ వున్నాంకూడాను. మా ఆయువు అంతా ఆయనచేతుల్లో వుంది. ఆయనతో విరోధపడి ఎలా బతకడమా అని నాకు బెంగపట్టుకుంది. జరిగిందంతా చెప్పమని చాలా బతిమాలుకున్నాను మళ్ళీని. అప్పుడది కాస్త ధైర్యంతెచ్చుకుని చెప్పడం ప్రారంభించింది.

[కొదువ.]

—కాఖోరి వెంకటరామారావు.



# విశ్వనాథనాయఁడు

[విజయనగర సామ్రాజ్య చరిత్రమునకు చెందిన ఒక గొప్ప ఆంధ్ర రాజభక్తుని కథ.]

> రోదసి నింపుకున్నది అ
> రుంతుదభీషణమౌ ప్రతిజ్ఞ, ఓ
> హో! దయమాలినావటె, మ
> హోగ్రతపస్సున గన్నతండ్రిపై
> నీదుకటారి విక్రమము
> నేర్పునటించునె! స్వామికార్యసం
> పాదనకై వరించితివి
> బాంధవనాశమునైన వీరుడా!
> —ఊటుకూరు సత్యనారాయణరావు.

అపుడు విజయనగర సామ్రాజ్యనియంత కృష్ణదేవరాయలు. అతనికి మధుర పట్టణములో 'చంద్రశేఖరుఁడు' అను వాఁడును, తంజావూరు పట్టణములో 'వీరశేఖరుఁడు' అనువాఁడును సామంతరాజులుగ నుండిరి. ఒకప్పుడు వీరశేఖరుఁడు బలాత్కారమున చంద్రశేఖరుని జయించి మధుర రాజ్యమును లాగుకొనెను. అందుమీఁద చంద్రశేఖరుఁడు తన ప్రభువైన కృష్ణదేవరాయలవారి సముఖమునకువచ్చి యిట్లు విన్నవించుకొనెను. 'నా దగ్గఱ, వీరశేఖరుని దగ్గఱ, తమరు కప్పము పుచ్చుకొని మమ్ము సామంతరాజులుగా నేలుచున్నారు. ఇప్పుడు నన్ను వీరశేఖరుఁ డోడించి నా రాజ్యము లాగుకొన్నాఁడు. ఏలినవారు చిత్తగించి నా రాజ్యము నా కిప్పించవలెను. నాకు మీరే దిక్కు.'

రాయలవా రీవిన్నపమునువిని 'నాగమనాయఁడు' అను పేరుగల తనసేనానాయకు నొకనిని పిలిపించి యిట్లాజ్ఞాపించెను. 'తంజావూరి వీరశేఖరుఁ డీచంద్రశేఖరుని రాజ్యము బలాత్కారముచేసి కట్టుకొన్నాఁడు. కావున నీవు సేనలను తీసికొనివెళ్ళి దుష్టుఁడైన వీరశేఖరుని తగినరీతిని శిక్షింపుము. చంద్రశేఖరుని రాజ్యము చంద్రశేఖరునకిచ్చి నీవు త్వరగాఁ దిరిగిరమ్ము.'

ఇట్లు రాయలాజ్ఞాపించగా నాగమనాయఁడు సేనలను, చంద్రశేఖరుని వెంటఁబెట్టుకొని తంజావూరు వెళ్ళెను. అచ్చట వీరశేఖరు నోడించి నాగమనాయఁడు రాజ్యము తనవశము చేసికొనెను. పిమ్మట నాతఁడు మధురకు వెళ్లెను. అచ్చట వీరశేఖరుఁడుంచిన సేనలను తత్తిమిచేసి నాయఁడు మధురరాజ్యమును తనవశము చేసికొనెను. అప్పుడు నాగమనాయనికి తంజావూరు, మధుర రాజ్యములను తానే యేలవలెనని దుర్బుద్ధి పుట్టెను. కావున నాతఁడు మధుర రాజ్యమును చంద్రశేఖరున కీయలేదు. రెండు రాజ్యములు తానే పాలింపసాగెను.

అందుమీఁద చంద్రశేఖరుఁడు పోయి యీసంగతి కృష్ణదేవరాయలతోఁ జెప్పెను. అప్పుడు రాయలవారు నాగమనాయనిపేర ఇట్లుత్తరము వ్రాయించిరి. 'చంద్రశేఖరుని రాజ్యమతని కీయక నీవు కట్టుకొన్నావు. ఆ విధమున రాజ్యమేలుటకు నిన్ను మేము పంపించలేదు. కనుక నీవిది చూచుకున్నవెంటనే చంద్రశేఖరుని రాజ్యమతని కిచ్చి తిరిగి రావలెను.'

ఆ యుత్తరమునకు నాగమనాయఁడిట్లు బదులు వ్రాసెను. 'తంజావూరు, మధుర రాజ్యములు రెండును గెలిచి నేనిందలి గ్రామములను బందోబస్తు చేసినాను. అందుకు నాసొంతద్రవ్యము చాల ఖర్చయినది. నేను వ్యయముచేసిన ధనమంతయు రాఁబట్టుకొని వచ్చెదను. అంతవఱకు నేను రాను.'

నాగమనాయఁడు తన ఆజ్ఞనిట్లు మీఱి నడిచినందుకు కృష్ణదేవరాయలవారికిఁ జాల కోపమువచ్చెను. నిండు కొలువునందుండి రాయలు 'మాయాజ్ఞ తప్పి నడిచిన నాగమనాయని నెవరైన పట్టి యిక్కడకుఁ దీసికొని రాఁగలరా?' అని అడిగెను. అందుమీఁద సేనానాయకు లిట్లు చెప్పిరి: 'నాగమనాయఁడు గొప్ప

పిరుఁడు. ఆసంగతి దేవరవారికి సయితము తెలియును. అతనితో యుద్ధముచేసి పట్టి తెచ్చుటకు మేము చాలము. పోవక తప్పదని దేవరవా రుత్తరు విచ్చిన పోయెదము. పోయి యతనిచేతులలో వ్యర్థముగఁ జచ్చిపోయెదముకాని యతనిని పట్టితెచ్చుట మావల్ల కాదు.'

సేనానాయకు లిట్లు చెప్పినమీఁదట నాగమనాయని కుమారుఁడు విశ్వనాథనాయఁడు లేచి రాయల వారి వద్దకువచ్చి 'దేవరవారు నాకుత్తరువిచ్చిన నాగమ నాయని పట్టి తెచ్చెదను.' అని పలికెను. అప్పుడు రాయలువారు నవ్వి 'తండ్రిదగ్గఱకుఁబోయి యతనితోఁ గలసి నీవుకూడ రాజద్రోహముచేయుట కాలోచించు చుంటివా ?' అని అడిగెను. అందుకు విశ్వనాథ నాయఁ డిట్లు బదులుచెప్పెను. 'చాలకాలమునుండి నే నేలినవారి సొమ్ము తినుచున్నాను. బహుదినములనుండి నమ్మి తమకొలువు చేయుచున్నాను. నాకు స్వామి కార్యము ప్రధానముకాని తండ్రి యెక్కువకాదు. నాకు మీరు సర్కారు రాఁబవ్వైన నీయవలదు. రెండు వేల గుఱ్ఱపుదళము, ఆఱువేల కాల్బలము నాకున్నది. ఆసేనను తీసికొనిపోయి తమ యుత్తరువు తప్పినడిచిన నాగమనాయని పట్టి తెచ్చెదను. ఇందుకుఁ దమ యాజ్ఞ కావలెను.' అప్పుడతనిని నమ్మి కృష్ణదేవ రాయలవా రాజ్ఞనిచ్చిరి.

విశ్వనాథనాయఁడు తనసేనను తీసికొని మధురకు వెళ్లెను. పిమ్మట నాతఁడు తండ్రికిట్లు కబురుచేసెను. 'మీరు రాయలవారి యుత్తరువునకుఁ దప్పినడిచినారు. కావున మిమ్ములను పట్టితెమ్మని రాయలువారు నన్ను పంపినారు. ఇప్పుడైనను తమరు చంద్రశేఖరుని రాజ్య మతనికిచ్చి లేచిరండు. రాయలవారితోఁ జెప్పి మీతప్పు మాపు చేయించెదను.'

తనకుమారుఁడైన విశ్వనాథనాయఁ డీవిధమున కబురుచేయఁగా దానికి నాగమనాయఁ డిట్లు బదు లిడెను. 'రాయలవారి కొఱకు నీవు చాల యుద్ధములు చేసినావు. వారికొఱకుఁ జాల రాజ్యములు సంపాదించి నావు. నేనుకూడ రాయలవారి కొఱకుఁ జాలసారులు పోరినాను. ఆవిశ్వాసము రాయలవారికి లేదు. ఉండినచో నీమధుర రాజ్యము నేనేలుట కెందు కడ్డు చెప్పును ? నాకు నీవొక్కఁడవే కొమారుఁడవు. చాల రోజులు తపస్సుచేసి విశ్వనాథస్వామిని కొలిచి నిన్ను పొందినాను. ఆదేవునిపేరే నీకుఁబెట్టుకొని సంతోషముతో నున్నాను. కనుక నాతో యుద్ధముచేయుట నీకుఁ దగదు. నే నీరాజ్యము సంపాదించినది నీకొఱకుఁ గాని వేఱుకాదు. కావున నీవు రాయలకొలువు మాని నాలోఁ జేరుము.'

తండ్రి తెలిపిన ఈసంగతులకు విశ్వనాథనాయఁడు తిరిగి యిట్లు బదులుచెప్పెను. 'నేను స్వామిభక్తుఁడను. మీరు స్వామి కార్యమునకుఁ దప్పి నడచినవారు. కావున మీరు నాకుఁదండ్రికారు. నేను మీకుఁ గొమారుఁడను కాను. రాజద్రోహముచేసి మీరు సంపాదించిన రాజ్యము నాకవసరములేదు. తిన్నగా వచ్చితిరా ప్రభువువారి దగ్గఱకుఁ దీసికొనిపోయి మీతప్పు కాపు చేయించెదను. అట్లుకాక నాతో యుద్ధముచేసితిరా మీరు నన్ను గెలువలేరు. నాది ధర్మపక్షము మీరు రాజద్రోహము చేసినవారు. కావున నన్ను గెలువఁగల బలము భగవంతుఁడు మీకీయఁడు. మిమ్ము తీసికొని వచ్చి తమయెదుట పెట్టవలసినదని రాయలవారు నా కాజ్ఞాపత్ర మిచ్చినారు. అట్లు మిమ్మును పట్టి తీసికొని పోవుటయే నాప్రతిజ్ఞ. స్వామికార్యము నెఱవేర్చుట యొక్కటే నాకు సకల సామ్రాజ్యములు నేలుట. ఈ స్వామికార్యము చేయుటలో నేను తండ్రి, చుట్టమని ఆలోచింపను.'

కొమారుఁడు చెప్పిన మాటలువిని నాగమనాయఁ డిట్లు తలఁచెను. 'కొమారుఁడు కలుగవలెనని నేను చాలదినములు తపస్సుచేసి విశ్వనాథస్వామిని మిక్కిలి ప్రార్థించినాను. అందుకు నామీఁదఁ గత్తియెత్తు కొమారుఁడు కలిగినాఁడు. ఇట్టి కొమారుఁడు బ్రతికి యున్నను, చచ్చినను ఒక్కటే.' ఇట్లు తలఁచి నాగమ నాయఁడు తన తొలాకు సేనను కూర్చుకొని యుద్ధమునకు వచ్చెను. అప్పుడు రాజద్రోహియగు తండ్రికిని, రాజభక్తుఁడగు కుమారునకును ఘోరయుద్ధము జరిగెను.

నాగమనాయఁడు కొమారునికిఁ జాలక రోడి పోయెను. విశ్వనాథనాయఁడు తండ్రిని పట్టుకొనెను. ఏనుగుమీఁద సంబారీవేయించి యందు తండ్రిని కూర్చుండఁబెట్టి తనసేవలతో విశ్వనాథ నాయఁడు విజయనగరమునకుఁ బ్రయాణమాయెను. అతఁడీ వార్త ముందుగానే రాయలకుఁ దెలుపుట కొక యుత్తరము వ్రాసిపంపెను.

ఆ యుత్తరము చూచుకొని కృష్ణదేవరాయలవారు నిండుకొలువు నందుండి యిట్లు చెప్పిరి. 'నాగమనాయని మీఁదికిఁ బోయెదరాయని నే నిచ్చటి సేనానాయకులనడుగగా వారు భయపడి వెళ్ళలేమన్నారు. విశ్వనాథనాయఁడు పోయి కార్యము నెరవేర్చుకొని వచ్చుచున్నాఁడు. అతఁడు స్వామికార్యము కొఱకుఁ దనకు జన్మమిచ్చిన తండ్రిని పట్టితెచ్చుచున్నాఁడు. ఇంతటి రాజభక్తుఁడు జగమునను మఱియెచ్చట నుండఁడు.' రాయలువారు చెప్పినమాటలు విని కొలువులోనున్న వారును 'విశ్వనాథనాయఁడు స్వామిభక్తిలో హనుమంతుని మించినాఁడు' అని పొగడిరి. తా మేలినవారిలో నింతటి బంటుకలిగినందుకు రాయలవారిరుభుజములు పొంగి సంతోషించి సభవారితో నిట్లు చెప్పిరి: 'ఇంత విశ్వాసముతోఁ బనిచేసిన విశ్వనాథనాయనిచేత నింక సేవచేయించుకొనుట దోషము. అతని నేదిరైన సామంతరాజ్యమునకుఁ బట్టముగట్టి గొప్పపదవిలో నుంచవలెను.'

ఆమాటలకు సభవారెల్లు విస్మయముచేసిరి. 'స్వామీ! విశ్వనాథనాయనికి రాజ్యముమీఁద వాంఛలేదు. ఉండినచోఁ దండ్రివద్దకుఁ బోయినప్పు డతనితోఁ గలసి మధుర తంజావూరురాజ్యములకు రాజై యుండును. కాని తమయందు భక్తికలిగి యతఁడు బహువిశ్వాసముతో నింతపనిచేసికొని వచ్చుచున్నాఁడు. స్వామివారి సేవయే కాని యతనికి రాజ్యమక్కఱలేదు. తమరు సర్వజ్ఞులు. తమరికిఁ దెలియనిదేమియున్నది?'

పదిదినములు జరిగినతరువాత విశ్వనాథనాయఁడు తండ్రిని తీసికొనివచ్చి రాయలెదుట నిలబెట్టెను. అప్పుడు రాయలు నాగమనాయనిని చూచి 'నీవు విశ్వాసఘాతకుఁడవు స్వామిద్రోహివి.' అనెను. పిమ్మట విశ్వనాథనాయని దిక్కు మొగమై రాయలిట్లు సెలవిచ్చెను. 'స్వామికార్యము ప్రధానముచేసికొని తండ్రియని విచారింపక యితనిని పట్టితెచ్చినావు. నీ రాజభక్తికిఁ జాల సంతోషమైనది. నీ మొగముచూచి నీతండ్రిచేసిన తప్పు క్షమించినాము. ఇతనిఁ గైదు విడువుము. ఇంటికిఁ దీసికొనిపొమ్ము.'

అప్పుడు విశ్వనాథనాయఁడు తండ్రి నింటికిఁదీసికొని వెళ్ళెను. అక్కడ అతఁడు తండ్రి పాదపద్మములమీఁద బడి 'యిఁక నాకు మీరు తండ్రి; నేను మీకుఁ గుమారుఁడను. ఇంతవఱకు నేను మీ శత్రుఁడను. రాజకార్యముకొఱకు నేను మీమీఁదఁ గత్తియెత్తినాను. నా తప్పులు మన్నింపుడు.' అని యనేకవిధముల వేఁడుకొనెను. నాగమనాయఁడు కుమారుని తప్పులు క్షమించెను.

తరువాత నొకనాఁడు కృష్ణదేవరాయలు విశ్వనాథనాయనిని పిలిచి యిట్లుత్తరువిచ్చెను. 'చంద్రశేఖరుఁడు మధురరాజ్యమును తిన్నగాఁ బాలించలేఁడు. కావున నతనిని తొలఁగించి మధురరాజ్యమునకు నిన్ను రాజుగా నిలిపినాము. నీవు వెంటనే మధురకు వెళ్ళుము.' అందుమీఁద విశ్వనాథనాయఁ డిట్లు మనవిచేసెను: 'ఇచ్చట విజయనగరములో నిలిచి నిత్యమును తమ దర్శనముచేసికొనుచు నుండిన నాకుఁజాలును. తమ దర్శనముకలుగుచున్న నాకు సకలసామ్రాజ్యములు నేలినట్లే. విజయనగరము విడిచి యిప్పుడు నేను మధురకుఁబోయిన తమ దర్శనము దొరకదు. కావున నాకు రాజ్యమువద్దు. మీ దర్శనముచేసికొనుచు నిచ్చటనే యుండిపోదును. ఇందుకుఁ దమరొప్పుకొనవలెను.'

విశ్వనాథనాయఁ డిట్లుచెప్పగా విని రాయలవారీ విధముగాఁ బలికిరి. 'నీతండ్రి నాగమనాయఁడు మధురకువెళ్ళి మామాట లక్ష్యముచేయక మా కెదురుతిరిగినాఁడు. అప్పుడు నీవు తండ్రికంటె స్వామికార్యమే యెక్కువయని అతనిని పట్టితెచ్చి మాయెదుటఁ బెట్టినావు. విశ్వాసముతో మాకింత మేలుచేసిన నిన్ను మేము మఱచిన మామీఁద దేవుఁడు కోపగించును.

కావున నీవుపోయి మధుర రాజ్యమేలుకొనుము. ఇట్లు చేయకపోయినచో నీవు మా యుత్తరువుమీఱిన వాఁడవగుదువు.'

రాయలు చెప్పినదానికి విశ్వనాథనాయఁడు మాఱు పలుకలేకపోయెను. తన యేలిక యుత్తరువుచొప్పున నాయఁడు మధురకువెళ్ళెను. అచ్చట అతఁడు చాలదినములు రాజ్యముచేసెను. అతనిపిమ్మట గొంతకాల మతని సంతతివారచ్చట పరిపాలనము సాగించిరి.

విశ్వనాథనాయని రాజభక్తి యిట్టిదని చెప్పుటకుఁ దరముకానిది. తపస్సుచేసి తననుకని యష్టకష్టములు పడి పెంచి పెద్దవానినిచేసిన తండ్రిపై నాతఁడు స్వామికార్యము పట్టునఁ గత్తియెత్తెను. అయితే యంతమాత్రమున విశ్వనాథనాయనికిఁ దండ్రియెడల భక్తిభావము లేదని యనఁగూడదు. కృష్ణదేవరాయలు తనతండ్రిని క్షమించినతోడనే విశ్వనాథనాయఁ డతనిని ఇంటికిఁ దీసికొనిపోయెను. అచ్చట అతఁడు తండ్రి పాదముల మీఁదబడి తన్నుమన్నింప ననేకవిధముల వేఁడుకొనెను. తండ్రియెడల నింతటి భక్తియున్నను విశ్వనాథనాయఁడు స్వామికార్యము కొఱకతనిపైఁ గత్తియెత్తెను. రాజభక్తు లన్నిఁటికంటెను స్వామికార్యము నెఱవేర్చుటయే యెక్కువగాఁ జూతురు.

ఆమహామూర్తి దివ్యనేత్రాంతశోణ
బహుళ రేఖాళి, పరీభావక్రుద్ధ
మనుజనాయకశత్రునిర్మథన యోగ్య
గాఢనిష్కామభక్తి యోగమ్ము దెలుపు.

ఈనవసాంధ్య మేఘము ర
చించు కడిందివిలాసరేఖలో
పూసిన దాంధ్రకీర్తి మెర
పుంబలె, తావకమైన రాజసే
వా నియతోగ్రజీవితశు
భవ్రతగాథ దిగంతవీధి నే
డేని వినంగనోచుకొన
డేమిది ఆంధ్రకుమారు డక్కటా!

—ఊటుకూరు సత్యనారాయణరావు.

# ప్రకటనలు

అయోమయయుగం, స్వర్ణయుగం ఇత్యాదిగా అన్నట్లే, చరిత్రలో మన నేటి కాలాన్ని ప్రకటనలయుగం అంటే బాగుండును. ఇది రాస్తూ తలెత్తి చూశాను. ఎదటి గోడమీద 'రత్నపురుషలేహ్యం' ప్రకటన కనబడ్డది. కుడివైపున గోడమీద తామర మందు ప్రకటన. ఎడమవైపు ఎలక్ట్రిక్ స్తంభానికి ద్రాక్షాసవ ప్రకటన, బల్ల కట్టి వుంది. నా స్నేహితుఁడు కలకత్తానుంచి వుత్తరంరాశాఁడు దాని తపాలాబిళ్ళమీద హిందూదేశపు ప్రకటనలను పోషింపుడు అని ముద్రించివుంది. ప్రకటనలు చదవడం నాకెంతో సరదా. పత్రికలలో అవి చదువుతోంటే నా ప్రక్కనిఉండే మిత్రులు 'అవెందుకు చూస్తావు అసలు సంగతులు చూడవోయ్' అంటారు. ఫ్రీ శాంపిల్సుకోసం నేను చాలా తపాలాఖర్చు చేశాను.

అయితే, యీ ప్రకటనలు యిప్పుడేనా, పూర్వమూ వున్నాయా అని నా చారిత్రక దృష్టి ప్రశ్నించింది. సరే అని విజ్ఞాన సర్వస్వం తీశాను. అందులో ఇవి పూర్వం నుంచీ, అంటే క్రీస్తువెనుక శతాబ్దులలోకూడా వున్నవని కనబడ్డది.

మన పురాణకాలంలో నారదుఁడు ఈ ప్రకటనలు చేస్తూండేవాడేమో. అతని ద్వారానే రెండురాజ్యాలు యుద్ధం ప్రకటించటం; 'వరుఁడుకావలెను', 'వధువు కావలెను' ప్రకటనలు జరుగుతూ వుండేవేమో. ఇతనుగాక పూర్వం ఇంద్రసభ, వల్ల చాలా వఱకు యీ ప్రకటనలపని అవుతూవుండేది.

గ్రీకులు, రోమనులు, కాలంలో ప్రకటనకి, పాశ్చాత్యదేశాల్లో అంకురాలున్నాయి. ఆ రోజుల్లో బానిసలు పారిపోతోండే వారు.

వాళ్ళకోసం యజమానులు, 'ఇంతపొడుగూ, యింతవెడల్పూ వుంటాడు ముఖంమీద మూడిపుళ్ళు లున్నాయి జుంజురు వెంట్రుకలు' అతనెవరికైనా కనబడితే నాకప్పగించి నావల్ల బహుమానం పొందండని' ప్రకటించేవారు ఆవుదూడ పోతే వెతుక్కునే ఆసాములలాగ.

అప్పుడుకూడా నేటి జట్కాబండీ వాడు 'ధవళేశ్వరం కాళీ, ఇద్దఱుకాళీ,' అన్నట్టు 'నేనిక్కడ ఒక ఘనుణ్ణి కాళీగావున్నాను కావలసినవాళ్లు నన్నుద్యోగంలోపెట్టి వుద్ధరింపబడవచ్చు' అనే ప్రకటనలూ వుండేవి. గ్రీకు రోమను యుగాల్లో కూడా నాటకాలకి ప్రకటనలు వున్నాయి. అయితే 'పేపరు బండీ' ద్వారా కాదు. విశాఖపట్టణంలో లాగ నీళ్ళకరువు ఆరోజుల్లోకూడా వుందేమో. నీళ్ళు కూడా ప్రకటించేవారట అప్పుడు.

నేటి ప్రకటనలకీ నాటి ప్రకటనలకీ యీ భేదం కనబడుతుంది; నేటి ప్రకటనలు చాలావఱకు వ్రాతమూలముగా వుంటాయి. ఏ ప్రకటనైనా ఏదో ఓభాషలో దెయ్యం అంతంత అక్షరాలతో ప్రకటింపబడి వుంటుంది నేడు. నాడు అక్షరాస్యుల సంఖ్య ప్రతీచీ దేశములలో నేటి సంఖ్యకంటె చాల తక్కువ. అందుచేత ఆరోజుల్లో ప్రకటింపదలచిన వస్తువు గుణగణాలు వల్లింపజేసి కుర్రాళ్ళచేత వీధుల్లో కేకలేయించేవారు. ఈపద్ధతి యిప్పుడీ ప్రాంతములలో సిగరట్టు బీడీలకి మాత్రం ప్రకటించడాని కుపయోగపరుస్తున్నారు. 'ఏంబీడీకావాల ?' 'జాడీబీడీ కావాల.' అని కుర్రాళ్లు బీడీలంతంత వాళ్ళచేతనే కేకలేయించుతున్నారు. శాంపిల్సు కూడా పంచిపెట్టేవారు వీధులంట. ఇది గ్రీకుయుగం.

ప్రకటనల హడావుడి మనదేశంలోకంటే పాశ్చాత్య దేశాలలో మధ్యయుగంలో కూడా విశేషంగా వుండేది. కాక్స్టన్ ధర్మమా అని ఇంగ్లండులో అచ్చుయంత్రం వచ్చింది. అందులో మొట్టమొదట ఒక బైబిలు అచ్చువేశాడతను. దానికి ప్రకటన కాగితాలు కూడా ఆవాయిలోనే తయారుచేసి గోడలకంటింపించారు. ఇందులో ఒక ప్రకటనకాగితం నేటికి బ్రిటిష్ మ్యూజియంలో దాచివుంచారు. ఇదో ప్రకటన.

పదిహేడవ శతాబ్దిలో చర్చిగోడమీద కాగితాలంటించడం ప్రారంభించారు. నేడు మనం చూస్తూన్నలాంటి ప్రకటనలే. పళ్ళపొడి, పాముకూసం, పందిరిమంచం, ఒకటేమిటి ప్రతీది ప్రకటించడమే. ఎవడో డాక్టరుపేరు ఒకటి సృష్టించి అతనిచ్చినట్టుగా కొన్ని యోగ్యతా పత్రములు కూడా ప్రకటించేవారు. విజ్ఞాన పునరుజ్జీవము దినాలలో అన్నిటితో ప్రకటనలకళకూడా వృద్ధిపొందింది. అందులో క్రొత్త క్రొత్త వ్రాతలు, బొమ్మలు, పద్ధతులు, బయలుదేరాయి. క్రొత్తక్రొత్త సరుకులు బయలుదేరాయి.

లెక్కలనుబట్టి చూస్తే క్రిందటి శతాబ్దిలో మంగలికత్తికి, బ్లేడులకీ వున్నంత ప్రకటన దేనికీలేదట. ఈ ప్రకటన కవులకు కూడా ఆవేశంపుట్టింపజాలిందగా ఉంది. మంగలికత్తుల ప్రకటనగుఱించి ఒక కవి ఒక కావ్యము (ఖండకావ్యమే ఔగాక!) కూడా వ్రాశాడు.

ఒక కుర్రాడు 'అణాకీ పన్నెండు కత్తులు' అని తిరుగుతూ అమ్ముతున్నాడట. ఒక రైతు చవకగదా అని ఓడజను అవి కొన్నాడట.

అని ఒక్కటీ తెగినపాపాన్ని పోలేదు మర్నాడు ఆకుర్రాణ్ణి కత్తులు తెగలేదేం అని అడిగాడు. 'తెగుతాయని నేచెప్పానా' అని జవాబు. 'మఱింకెందుకివి ?' 'అమ్మ డానికి.'

'.........'

ఇదీకథ. అంత చిత్రంగావుంది ఎడ్వర్ టైజ్‌మెంట్.

ఈ ప్రకటనలకి దేశకాల పాత్రాలు విశేషం వివక్షతలేదు. నలుగురూ చూసే చోటు అయితే సరి అది స్మశానం అయినా అందులో ప్రకటనే. చలికాలంలో ఐస్ క్రీమ్ ప్రకటన. ఇల్లా వుంటాయి.

ప్రకటనలు ఎల్లావీలయితే అల్లా చేస్తారు. దిన పత్రికలూ, వారపత్రికలూ, ... సంవత్సర సంచికలు. వీట్లనిండా ప్రకటనలే కొన్ని పత్రికలు చందాదారులవల్ల కంటె ప్రకటనలవల్ల నడుస్తుంటాయంటే చిత్రం లేదు. పత్రిక కల్లా మూలం అట్టమీద ఎదురుగా ఓప్రకటన. ఏరోమసంహారిణితైలమో, డబ్బుయివ్వగలిగి లేసరి. గోడలమీద ఏమీ అతికించకూడదని స్వంతదారులు క్రొత్తగా వెల్లవేయించగానే వ్రాయిస్తారు. ఆరాత్రే దానిమీద వాచీ సిగరట్ల ప్రకటన కాగితం అంటించేస్తారు. అంతతో ఆరూలు స్వంతదారుగూడా మరిచిపోతాడు. ఆగోడ మళ్లీ సంవత్సరం ఆరోజులలో అంగుళంధరిసరి కాగితాలతో తయారు.

మోటారుకారుల వెనక సినీమా, నాటకాల ప్రకటన. అది తిరిగేవూళ్లంతా యీ విషయం పాకిపోవాలి సరే అని సినీమాకి వెడితే ఇంటర్వల్‌లో నానాప్రకటనలూ (అందులో కొన్ని తల్లక్రిందుగా వుంటేం గాక). క్రొత్తగావచ్చిన రేడియోలలో ఎడ్వర్‌టైజ్‌మెంటుటైం. ఎలక్ట్రిక్ దీపాలూ రంగులతో వెలగడం ఆరడం ఆ చిత్రం ఏమిటా అని చూస్తే తామరమందు ప్రకటనా. మనదేశంలో యింకాలేదుగాని, ఇతరదేశాలలో విమానాలమీద వెళ్లి ఆకాశంలో లక్సుసబ్బు అని మూడేసిమైళ్ల అక్షరాలు రాసి చక్కావస్తారు.

అయితే యీప్రకటన అభిప్రాయం ఏమిటీ ? ఎందుకిలా చేస్తారు అని ప్రశ్న వస్తుంది. ఎడ్వర్‌టైజ్‌మెంట్ అంటే 'నీ కక్కఱలేని వస్తువు నీచే కొనిపించడం' అని ఒక స్నేహితుఁడు నిర్వచించాడు. ఆర్థిక దృష్టితో చూస్తే దీనివుపయోగం చాలా వున్నట్లు తోస్తుంది. అభినవ ప్రపంచంలో ఒక్కడూ ఒక వస్తువు పూర్తిగాచేయలేఁడు. ఒక గుండుసూది వుందనుకోండి. దానిని ఎంత పొడుగుకావాలో అంతంత ముక్కలుగా ఒకడు తీగను నఱుకుతాడు ఇంకొకడు దాని తలవైపు గుండ్రముగాచేసి పడేస్తాడు వేఱొకడు దానికి పదునూ, ఇంకోడు దానికి మెఱుగూ పెడతారు. ప్రస్తుతము వస్తువుత్పత్తి యిలావున్నది. ఒక పెద్ద యంత్రం వుందంటే దానిలో ఇనపసామాను కొదేశం ప్రశస్తం. కఱ్ఱసామాను కింకోదేశం ముఖ్యం. రబ్బరుభాగాలు ఒకదేశంలో మంచివి దొఱుకుతాయి. ఇవన్నీ చేర్పితే గాని యంత్రంగాదు. కాఁబట్టి ఎక్కడ ఏంచేస్తున్నారో ప్రకటించితే మంచిచెడ్డలు తెలిసికొని తెప్పించుకోవచ్చు దీనివల్ల మంచిమంచి వస్తువులు అందులో ఆరితేరిన వాళ్లు చేసినవి దొఱుకుతాయి. వర్తకులకి ఎక్కడ చవకో తెలుస్తే అవి తెప్పించుతారు. అంచేత ప్రతీదేశం ప్రతీసంస్థా మంచి వస్తువు తక్కువ ఖరీదుకి అందించాలని

చూస్తుంది. సరుకు నిలవలు, వడ్డీదండుగలు తక్కువవుతాయి. వ్యాపారం వృద్ధికావడం వల్ల, వస్తువులు ఏకలాటున చేయబడుతాయి. అందువల్ల తయారుకర్చులు తగ్గి ప్రజలకు చవకగా మంచివస్తువు వస్తుంది. చవకయి అందుబాటులో వుండడంవల్ల ప్రజలందఱూ వుపయోగించి సుఖపడడానికి వీలౌంది. తయారుచేసే వాళ్ళకి ప్రజల కెంతవఱకు వస్తువుకావాలో తెలియడంవల్ల వ్యాపారం వృద్ధిచేసుకోగలరు. వస్తువులో గుణం సమానంగా వుంచడంవల్ల ఉపయోగించే వాళ్లకి వ్యాపారంమీద నమ్మకంకలిగి తదభివృద్ధికి తోడుపడుతుంది. ఇందువల్ల ధరలలో ఎచ్చుతగ్గులు విశేషం కనబడవు. ఇవి సాధారణంగా ప్రకటనలవల్ల లాభాలు.

కొన్ని నష్టాలూ, వున్నాయి. ప్రకటనలన్నీ నమ్మడానికి వీలు లేదని యింతకుముందు చూచాం. అబద్ధపు యోగ్యతాపత్రాలూ, అన్యాయమూ వుంటుంది. షేకల్లీసాహేబుగారి దగ్గఱనుంచి యజ్ఞోపవీతాలు మంచివని యోగ్యతాపత్రం తెప్పించి ప్రకటించుతారు. బ్రతిమాలో, సొమ్మిచ్చో కొన్ని వ్రాయించుతారు. ఇలాంటి దగాలు పడకుండా చూసుకోవాలి.

ఎడ్వర్టైజుమెంటుకి, ఎంతో సొమ్ము కర్చుచేస్తారు. అది అంతా ఆవస్తువుకొనే వాళ్లమీద, రుద్దుతారు గదా. తయారుచేసే వాళ్లలో వారికో వారికి పడదు. కాబట్టి కొంతనష్టం. ఈస్పర్థలవలన నష్టాలూ వీరు ప్రజలవల్లనే రాబట్టుతారు.

ఇందులో రంగులవల్ల ప్రజల్ని ఆకర్షించివేస్తారు. ఇతరదేశములలో మంచిమంచి దృశ్యములు ఎడ్వర్టైజుమెంట్ కోసం పాడుచేస్తారు. చారిత్రక విగ్రహాదుల చెంత ఇదే న్యూసెన్సు. ఇల్లా పాడుచేయడం కళాపిపాసువులకి బాధగావుంటుంది. అజంతా చిత్రంమీద 'అజీర్ణపాశుపతం' ప్రకటన అంటించడం కంటె అన్యాయం వేతే వుందా? టాజ్‌మహాలులో ఒకచోట సుగంధ నస్యపు ప్రకటన కనబడితే ఎంత జుగుప్సగా వుంటుందో చూడండి.

ఇంతకీ, ఇది ప్రకటనలయుగం. వోట్లివ్వండని ప్రకటన. పెళ్లాంకావలిస్తే ప్రకటన. మొగుడు కావలిస్తే ప్రకటన. పనుంటే ప్రకటన. పని లేకపోతే ప్రకటన. ఊఁ అంటే ప్రకటన. ఆఁ అంటే ప్రకటన.

—వి. కె. రామచంద్ర.

డాగుడుమూతల పజిల్ సమాధానములు.

1. తెల్లగులాబి, 2. శిరోవేదన, 3. జానకి, 4. చక్రవాకము, 5. ముద్దుపళని, 6. శబరి, 7. సరస్వతి, 8. భారతము, 9. తురగము, 10. ఖద్దరు, 11. సాకేత, 12. సురాపానము.

అన్నిటికిని సరియైన సమాధానములు పంపుటచే బహుమానధనము ఈ క్రింది ఇద్దరకు పంచబడును.

(1) వేమకోటి రామమూర్త్యనాథ శర్మగారు
హిరణ్యగర్భ జ్యోతిషాలయం
పార్వతీపురం - విశాఖపట్టణంజిల్లా.

(2) శ్రీమతి మానూరి లక్ష్మీనరసమ్మగారు
శీతానగరము వైయా - కొవ్వూరు.

బహుమానము పొందినవారు ఆ ధనమును భాగవతాది గ్రంథములను కొని పంపుమనుటగాని సొమ్ము మనియార్డరు చేయుమనుటగాని, ఆంధ్రభూమికి చందాగా జమకట్టమనుటగాని మాకు తెలిపిన వెంటనే ఆ మేరకు వారి ఆజ్ఞలు నిర్వర్తింపబడునని మనవి.

# యాంగస్ వాట్సన్

ప్రతి మానవునకును ఆతని జీవితకాలములో ఏదో ఒకదశలో అతడు అభివృద్ధి నందదగు అవకాశము ఒక్కపారి లభించునని ప్రజల నమ్మకము. మన ప్రస్తుత కథకు నాయకుడగు వాట్సన్‌కు అభివృద్ధినందదగు అవకాశము ఒక్కపారి గాక రెండుపారులు లభించినది. అతడు ముప్పదియేండ్లలోపువాడై యుండగా ఒక ఇంగ్లీషు ఫరమువారి యునైటెడ్ స్టేట్సునందలి శాఖకు అధ్యక్షస్థానము రానుండ దాని నాతడు విడనాడినాడు. ఎందుచేత? తన జన్మదేశమగు ఆంగ్లావనికి రావలెనని. సిరివచ్చుచుండ మోకాలొడ్డి కాడిమేడి కట్టుకొని ఇంగ్లండునకు తిరిగి వచ్చినాడు. అతని భావికాలాభివృద్ధికి అది ప్రథమసోపానమైనది. కాని అప్పటిలో అతని మిత్రులు అతడా ఉద్యోగమును నిరాకరించుటలో ఘోరప్రమాదము గావించెననియే భావించిరి. అయినను అతని అదృష్టము మంచిదైనది. అతని విషయములో అదృష్టమనిన నేమి? అసాధారణమైన మనోనిశ్చయము, దూరదృష్టి, శక్తి, ఉత్సాహము కలిగియుండుట-పెద్దయుండ్రొద్దు విసుగు విరామము ఎఱుంగక పరిశ్రమింప గలిగియుండుట.

అమెరికా వదలినాడు. టైన్ చెంతగల న్యూకాసిల్ నకు తిరిగివచ్చినాడు. అభివృద్ధినందుటకు అవకాశము మరియొకపారి లభ్యమైనది. ఆ అవకాశము నాతడెట్లు ఉపయోగించుకొనెననునదియే మన ప్రస్తుత కథావృత్తాంతము. ఇరువదిరెండేండ్ల లోపున ఆ యువకుడు తన మాతృదేశమున అతివిస్తృతమగు వ్యాపారమునకు యజమాని అయినాడు. తాము స్వప్నలోకమున విహరించుచు కాంక్షించిన దానిని పొందుటకు తమకుగల సర్వస్వమును ఒడ్డి తుదకు జయముగాంచి విఖ్యాతినందిన వణిక్పుంగవుల కోటికి చెందినాడు.

'ఆంధ్రభూమి' మాససంచికలో మన మింతదనుక పదునొకండుగురు వణిక్పుంగవుల జీవితములతో పరిచయము నందియున్నాము. అందందఱును తమతమ బాల్యమందు పేదతనమున అటుపుటించి కష్టములతో కొట్టుమిట్టులాడినవారే. వ్యాపారప్రపంచమున, పారిశ్రామిక లోకమున, రాజ్యాంగమున ఉన్నతస్థానమునందువారు తమ తొలిదినములందు ఇట్టి శోచనీయ పరిస్థితులయందు తగిలియున్న వారలేయగుట తఱచు. ఇట్లనుటచే ధనవంతులబిడ్డలు గొప్ప వ్యాపారసంస్థలకు అధిపతులు కాలేకుండిరని చెప్పుటకాదు. ఒకానొక జాతీయ సంస్థగాని, లోకవిస్తృతినందిన సంస్థగాని ఆదిలో ఒక రిద్దరి ఉపజ్ఞచేతనే ప్రారంభింపబడి యుండుటయు, ఆ వ్యక్తులు సాధారణముగ తమ తొలిదినములలో ఒక్కపారిగ రెండుపెన్నీలు కలిగియుండుట ఎట్టిదో ఎఱుగని పేదవారైనను ధనముకంటె ఎక్కువవిలువగల శక్తిని గలిగియుండి అంతవారగుచుండుటయు తఱచు జరుగుచున్నది.

వణిక్పుంగవుడు స్వప్నలోకమున విహరించువాడే యగును అయినను అతని కడ స్వప్నములనుకూడ సత్యములుగ చేయజాలు శక్తి యున్నది, మనోనిశ్చయము కలదు, సంకల్పసిద్ధి గావించుకొనగలుగు దీక్షయున్నది. అందుచే నాతడు ఎన్ని అడ్డంకులు వచ్చినను వాని నెల్ల అతిక్రమించి జయమందుచున్నాడు. ఇది నిరూపించుటకు ఎన్ని ఉదాహరణములైన ఈయవచ్చును— స్ట్రాత్‌కోనా, కార్నీజి, లుడ్విగ్‌మాన్‌డ్, కాడ్‌బరీ, మాసాన్—మన ప్రస్తుత కథానాయకుడగు యాంగస్ వాట్సన్ కూడ విస్తృతవ్యాపారమునకు జనకుడై ఈ శ్రేణికి చెందుచున్నాడు.

టైన్ చెంతగల రైటన్ అనుతావున యాంగస్ 1874-వ సంవత్సరము జనవరి 15-వ తేదీని జననమందెను. అతని తలిదండ్రులు స్కాట్లాండు దేశస్థులు. మతవిషయమున పూర్వాచారపరులు. మూడుసంవత్సరములు నిండీనిండకుండగనే వాట్సన్ తొలిపారి ఆదివారపు బడికి పోనారంభించెను. పడవ తెడ్డువేయుట, ఈత కొట్టుట, సైకిలుపై షికారుచేయుట మొదలగు క్రీడల

యందు బహుశ్రమగా పాల్గొనుచు అతడు బాల్యమున చురుకైనవాడై యుండెను.

వాట్సన్ చిన్నవాడైయుండగనే అతనితండ్రి పరలోకగతుడయ్యెను. కాగా కుటుంబ భరణమునకు బాలుడగు వాట్సన్ కూడ యథాశక్తిని పాటుపడవలసినవాడయ్యెను. పదునైదేండ్లు నిండని బాల్యప్రాయమున అతడు స్వబుద్ధిచేతనే పాఠశాలను వీడెను. తన జన్మపట్టణముననే నాలుగు విధములగు ఉద్యోగములు ఆ సమయమున ఖాళీగా నాలుగింటికిని అతడు నొకడనే దరఖాస్తు పెట్టెను.

ఒక ఉద్యోగము నేలబొగ్గు ఎగుమతిచేయు ఆఫీసులో. మఱియొక ఉద్యోగము బట్టలకు కాణమున. వేఱొకటి ఉప్పుచేయు వర్తకపుకంపెనీలో. మఱియొకటి ధాన్యప్రవర్తకునికడ. ధాన్యపు వర్తకము అతనికి నచ్చినది. కావున దాని నెన్నుకొన్నాడు. జీతము మాత్రము వారమునకు అయిదుషిల్లింగులే.

గడ్డుఅయిన పని. ఉదయము ఎనిమిదిన్నరకు పని ప్రారంభమగునది. రాత్రి తొమ్మిదిగంటలయిన గాని ముగియునది కాదు. పండ్రెండు నెలలు తిరిగివచ్చినవి. జీతము చాలినది కాదు. హెచ్చు వేతనముగల వేఱొకపని చూడవలసిన అవసర మేర్పడెను. పండ్లు నిలవచేసి డబ్బాలకెక్కించి వర్తకముచేయు నొక కమీషను ఏజెంటుకడ చిఠాఅవర్జాలు వ్రాయుపనికి వారమునకు తొమ్మిదిషిల్లింగుల వేతనముపై అతడు ప్రవేశించినాడు. చిఠా అవర్జాలు వ్రాయుటకు అతనికంతదనుక బుక్కీపింగులో ప్రవేశము లేదు. మఱియు డబ్బాలలో పండ్లు నిలవచేయు వ్యాపారమున అతని కంతదనుక కాసంతేని అనుభవము లేదు. అయినను అతడీ ఉద్యోగమును స్వీకరించుటలో ఎట్టి సందేహముకాని పొందలేదు. 'బుక్కీపింగు బ్రహ్మవిద్య కాదు. సాయంకాలములందు దానిని సులభముగ నేర్చుకొందును. పండ్లడబ్బాల వర్తకము కొఱకరాని కొయ్య కాదు. అచిరకాలముననే అందు విశేషానుభవమును సంపాదింతును' అను కృతనిశ్చయముతో అతడా ఉద్యోగమును స్వీకరించినాడు. పండ్రెండు వత్సరములకాలము అతడా వర్తకమున తగిలియుండి అనంతరకాలమున అతనికి అనంతముగా ఉపయోగించిన విశేష వ్యాపారానుభవమును సంపాదించినాడు.

వారమునకు తొమ్మిదిషిల్లింగులు. సత్వరాభివృద్ధి నందగోరుచున్న బాలునకది యేపాటిది? తనకు కావలసిన ఉప్పుతో తొమ్మిదివస్తువులను అతడా తొమ్మిది షిల్లింగులతోడనే సమకూర్చుకొనవలసియుండెను. కాగా అభివృద్ధి మిక్కిలికష్టముతో కూడినదిగా, పెళ్ళినడకలు నడుచునదిగా నుండెను. తన సుఖము తాను వీడనాడుట కాతనికెట్టి అభ్యంతరమును లేదు. తన భావిసుఖమునుగూర్చికూడ వాతని కంత చింత లేదు. కాని తనతల్లి సుఖమునుగూర్చియే అతడు నిరంతరము అలజడినొందువాడు. ఈ తొమ్మిదిషిల్లింగుల ఉద్యోగమును వదలివేయుచో తనతల్లిపని యేమి? కావున అతడెట్లో ఆ ఉద్యోగముననే కాలముబుచ్చుచు హెచ్చు వేతనముగల ఉద్యోగము సంపాదింప ప్రయత్నములమీద ప్రయత్నములు చేయుచుండెను.

పదునెనిమిదివత్సరములు వచ్చుసరికి అతడు టైన్ చెంతగల న్యూకాసిల్‌లో పండ్లడబ్బాలను దిగుమతి చేయుఫరములో విక్రయదారుడుగా ప్రవేశింపగలిగెను. ఒకనాటి యుదయమున అతడు తన ఖాతాదారులలో నొకనితో సంభాషించుచుండెను. ఖాతాదారు డాతనికి నార్వేదేశపు చేపలు నిలవచేయబడిన చిన్నడబ్బా నొకదానిని చూపెను. సార్డయిన్ కుటుంబమునకు చెందినవగు ఆ చేపలు వెండిరేకులవలె మెఱసిపోవుచుండెను. స్టావెంజరునుండి వచ్చిన ఒక ఓడకాప్తైను ముసలివాడా చేపలడబ్బా తెచ్చినాడు. అలివ్‌నూనెలో నిలవచేసి ఆ చేపలను డబ్బాలకెత్తి వర్తకముచేయుటకు నార్వేదేశమున పరిశోధనలు చేయబడుచుండెను. ఆ పరిశోధనల ఫలితములైన డబ్బాలలో వాట్సన్‌కడకు గొని రాబడిన డబ్బాఒకటి. అవకాశము—అవసరమైన మనిషి. సమావేశమైరి. భావికాలమున వణిక్పుంగవుడై అతి లోకఖ్యాతి నార్జింపనున్న వాట్సన్ మదిలో ఆ స్నేహితుడు యాదృచ్ఛికముగ తెచ్చిచూపి ఆ చిన్న చేపలడబ్బా వర్తకముచేయదగు వస్తువు విషయమున విత్తునాటినది. తన ఫరమువారిని ప్రోత్సహించి

వాట్సన్ చేపలడబ్బాల వర్తకమునకుగూడ మరలింప గలిగినాడు.

ఫలముగా వాట్సన్ ఒకసారి నార్వేదేశమునకు పోవలసివచ్చినది. చేపలడబ్బాల సరఫరాకు సంప్రదింపులు నడిచినవి. యేడాదికి కేయి పెట్టెల డబ్బాలు సరఫరాచేయుటల్లు కంట్రాక్టు నడిచినది. ఈ కంట్రాక్టు నడిచిన సందర్భమున మఱువరాని ఒక చమత్కారము జరిగినది. కంట్రాక్టు నడుపుటకువెళ్ళిన వాట్సన్ పదునెనిమిదేండ్ల యువకుడు. వర్తకునకు వలయు డాబుదర్పములు ఎట్లు ఆ బాలునికడ నినివేశితములగును? ఒక సిల్కు టోపీ కొనినాడు. ఒక ఫ్రాక్ కోటు వివిచినాడు. మూర్తియందు లోపించిన దర్పమును బట్టలతో పూర్తిచేసినాడు. సిల్కు టోపీ, ఫ్రాక్ కోటు అను కొన్న పనిని చేసినవి. కాని అసలు వ్యాపారము సంప్రదింపబడు సమయమున సిల్కు టోపీ క్రిందనున్న ఆ పదునెనిమిదేండ్ల బాలుని తలయే పనిచేసినది. ఆకర్షించుటకు మాత్రము అతనిటోపీ అక్కఱకువచ్చినది. తన అభిప్రాయమునకు చేపలను పట్టువాండ్రను, డబ్బావర్తకులను మరలించుటకు అతని నేర్పరితనము కలసివచ్చినది. ఏ చక్కనిగడియయందు ఈ కంట్రాక్టు ఏర్పాటు అయినదో నాటినుండి నేటివఱకును చేపలపట్టువాండ్రును, ఆ వర్తకులును వాట్సన్ నందు మితిలేని విశ్వాసమును, ఎనలేని ప్రేమను చూపుచున్నారు.

కంట్రాక్టు ఏర్పఱచుకొని వాట్సన్ తిరిగి ఇంగ్లండు వచ్చినాడు. ఇప్పుడుకూడ అతడు తన ఫరములో విక్రయదారుడే. అగుట అతడీ హోదాలో ఆంగ్లావని అంతయు చుట్టినాడు. ప్రతి పెద్దపట్టణమును అతడుసందర్శించినాడు. ఒకసారి దేశము చుట్టివచ్చుసరికి అతని ఆర్డరుపుస్తకము దేశమున చేపలడబ్బాల వర్తకమునకు విశేషావకాశ ముండగలదను అతని గాఢవిశ్వాసమును రూఢముచేసినది.

అతని ఈ తొలి యాత్రానుభవములు చిత్రములైనవి అతడు చెప్పుటలో అవి చిత్రతరములై యుండును లండను మహానగరమున కాతని తొలిరాక. రాత్రి ప్రొద్దుపోయి దిగినాడు. నీఘులనామములైన అతనికి తెలియవు. ఆ జనసముద్రములో తాను ఎరిగియున్న కాతాదారుడు ఒక్కడైనలేడు. ఒంటరితనము. చికాకు అనిపించినది. ఆర్డర్లు కావ్వాసు చేయుటలయందు కాంక్ష తీవ్రతరముగానే ఉన్నది. కాని లక్షల జనాభాగల ఆ పట్టణమున తానేమిపని చేయజాలకుందునేమో నని డిల్లపడినాడు.

లండనులో అతని మొదటిదినపు పని. నాలుగు చిన్న ఆర్డర్లుమాత్రము లభించినవి. అయినను నిరుత్సాహము నకు తావులేకపోయినది. దేశమున వివిధప్రదేశములందు శాఖా కార్యాలయములు ఉండి లండనులో ప్రధాన కార్యస్థానముగల పెక్కు కంపెనీల చిరునామాలాతడు సేకరించినాడు. పైగా కొనుగోలుదారుల పేరులును, వారిని సావకాశమున దర్శింపనగు దినములనుగూర్చిన భోగట్టాయు అతనికి దొరికినది.

స్వల్పవిషయములుకూడ జీవితముగ ఒక్కొక్కప్పుడు వహించునను సత్యమును నిరూపించు ఒక విషయము ఇచ్చట ముచ్చటింపవలసియున్నది. ఒక పెద్ద కొనుగోలుదారు వద్దకు అతడు గంపెడాసతో పోయినాడు. శాంపిల్సు చూపినాడు. కాని కొనుగోలుదారుడు సుముఖుడు కాలేదు. ఆ కొనుగోలుదారుని నామము సాధారణముగ ఉండునదిగాక అరుదైనదై యుండెను. ఆ అరుదైననామము ఉచ్చరించుటతోడనే వాట్సన్‌కు తాను చిన్నతనమున స్కూలులో చదువుకొను దినములందు క్రికెట్ ఆటల సందర్భమున అట్టినామముకల ఒకరి పరిచయము తనకుండుట జ్ఞాపకమువచ్చెను. వాట్సన్ ఆసంగతి కొనుగోలుదారునితో మాటల సందర్భమున చెప్పెను. కొనుగోలుదారునకు పూర్వస్మృతి వచ్చినది. వాట్సన్ చెప్పినవాడు తానే. తన భార్యతరఫున తానా కంపెనీకి ప్రస్తుతము అధ్యక్షుడైయున్నాడు. వెంటనే ఆ కొనుగోలుదారుడు అదరమందస్మితముగావించి క్రికెట్ ఆటనుగురించి ఒకటి రెండు పలుకులువిసిరి తిరిగి తనదృష్టిని వాట్సన్ చూపిన శాంపిల్సుమీదికి బఱపెను. అతని కంపెనీయాజమాన్యమున 160 శాఖలుగలవు. ఒక్కొక్కశాఖకు ఒక్కొక్క పెట్టె సరఫరాచేయుటకు అతడు ఆర్డరు ఇచ్చెను.

అప్పటి వాట్సన్ ఆనందము ఎట్టిదిగానుండెనో మీరే సులభముగా ఊహించుకొనవచ్చును.

ఆ కొనుగోలుదారునకు ఆర్డరు ఇచ్చుటయే కాదు. మఱియొక పెద్దవర్తకునకు పరిచయము చేయుచు సిఫారసు ఉత్తరముకూడ ఇచ్చినాడు. మొదటి కొనుగోలుదారునికంటె ఈ రెండవయాతనిది మఱియు పెద్దవర్తకము. అతని శాఖా కార్యాలయముల సంఖ్యయు విస్తారమే. కాగా ఆనాడు వాట్సన్ ఎనిమిదివందల పెట్టెలకు ఆర్డర్లు సంపాదించినాడు. చిన్నవాడు క్రికెట్ ఆటలసందర్భమున ఉండిన పరిచయము ఎంతటి ఉపకారము గావించినది?

వాట్సన్ వ్యాపారనైపుణ్యమున ఈ డబ్బాల చేపలు బ్రిటిష్‌ప్రజలు విస్తరించి తినసాగిరి. ఇట్లుండ యువకుడగు మన ఈ కథానాయకునకు ఇంకను క్రొత్త వ్యాపార పథములను త్రొక్కవలయునను తీవ్రకాంక్ష పొడమినది. వ్యాపారపద్ధతులు దినదినము మారుచుండుట అతడు కనుగొనినాడు. కాగా క్రొత్త వ్యాపార పద్ధతులను సమగ్రముగ నవలంబించుచు బుటాబుటి నడలతో నభివృద్ధినందుచున్న సబ్బు పరిశ్రామికులు లీవరు కంపెనీవారితో పరిచయము సంపాదించెను. క్రమమున ఆ పరిచయము గాఢతరమయ్యెను. న్యూకాసిల్ పట్టణమును వీడి వాట్సన్ లీవరు సబ్బుకంపెనీలో ప్రవేశించెను.

యాంగస్ వాట్సన్ జీవితమున అతని క్రమాభివృద్ధిని కొలచి తెల్పగచూపించు మైలురాళ్ళు కొన్నిగలవు. లీవరుసబ్బు కంపెనీలోచేరుట అభివృద్ధిలో ఒకపైమెట్టు. చేరిన కొలదిదినములలోనే అతడు హెచ్చు ప్రమోషను పొందగలిగెను. పొందిన ఆ ప్రమోషను అతని జీవితమున కొకమార్గము పాత్తించినది. అతడా దినములలో ఆ సబ్బు కంపెనీకిచేసిన పనినిగూర్చి తెలుపుటకు ముచ్చటగనుండును.

నార్తంబర్లాండులో స్టాంఫర్డుహామ్ అనునది యొక కుగ్రామము. వేసవికాలము అయ్యూరి ప్రయాణము అత్యంతసుకరము. శీతకాలమున మాత్రము ఆ గ్రామము పోవుట దుస్తరము. ఎడతెగనిమంచు, గతశతాబ్ది తుది వత్సరములలో ఒక శీతకాలమున ఆ గ్రామము దట్టమగు మంచుగడ్డ వర్షములో మూసుకొనిపోయెను. ఆనాడు ఆ గ్రామమునకు టపా అయినను పోలేదు. రస్తాలో రాకపోకలన్నియు కట్టువడిపోయెను. ఇట్టి స్థితిలో అయ్యూరి కిరాణా దుకాణములోనికి యువకుడగు ఏజెంటు ఒకడు వచ్చెను. ఆ దుకాణపు యజమాని పొందిన ఆశ్చర్యమునకు మేరలేదు. అవయవములను కొంకరపోవజేయు ఆ మంచులో బయటకువచ్చుటకు భయపడి సాధారణముగ నందఱును ఇండ్లయందే యుండిరి. బయటకు వచ్చువారును, బయటనుండి వచ్చువారును ఆ మంచులో సరియైనదారి కనుగొనలేక అటమటించుచుండిరి. చర్మమును కొఱికివేయు ఆ మంచులో దారితప్పక తన దుకాణమునకు చేరగవచ్చిన ఆ ఏజెంటు సాహసమునకు, ధైర్యమునకు, కార్యదీక్షకు అప్రతిభుడై ఆ వర్తకుడు ఆ ఏజెంటుకడనున్న ప్రతికాంపిలు పరీక్షించి ప్రతివస్తువునకు కొద్దియో గొప్పయో ఆర్డరు ఇచ్చెను.

ఏజెంటు మామూలుధోరణిలో ఈ ఆర్డరును ప్రధాన కార్యాలయమునకు పంపెను. ఆ ఋతువులో స్టాంఫర్డుహామున అంతటి ఆర్డరు కాన్వాసుచేయుట విచిత్రముగుట మేనేజరు ఏజెంట్లందఱును అదర్శముగ నుంచుకొనదగు ఆర్డరని వెల్లడించెను. కంపెనీ స్వామదారుడు విలియమ్ లీవరు ఆ ఆర్డరు కాన్వాసు చేసినప్పటిలో తబిసీళ్ళకోసము వ్రాసెను. చేయునది లేక ఏజెంటు యావత్తు వృత్తాంతమును వివరించి వ్రాసిపంపెను. తన ఏజెంటు కార్యదీక్షకు అత డమితానందమునంది అతనిని తన కంపెనీయొక్క గ్లాస్గో బ్రాంచికి మేనేజరుగా నియమించెను. ఒక్క ఆర్డరుతో మేనేజరైన ఈ అపూర్వపు ఏజెంటు ఎవరు? మన వాట్సన్.

గ్లాస్గోనుండి హాల్ బ్రాంచికి. న్యూయార్కులో లీవరు కంపెనీవారు స్థాపింపదలచిన శాఖ నిర్వహించు భారమంతయు అతనిపై నుంపబడెను. ఒక సోపానము నుండి మఱియొక సోపానమునకు. స్టాంఫర్డుహామ్‌లో నడచిన వృత్తాంతము ఏజెంటుఅగు అతనిని మేనేజరుగా నొనర్చినది. అట్టి వృత్తాంతమే మఱియొకటి ఇప్పటి

అతని ప్రోత్సాహమునకు కారణమైనది. న్యూయార్కు రాష్ట్రమునకు చెందిన కోర్టులాండును సందర్శించి అతడచటి పెద్దవర్తకులనందరిని చూచెను. లీవరు కంపెనీ వారి క్రొత్త సబ్బులకు ఆర్డర్లు కావాలని చేయవలయునను సంకల్పము. కాని పెద్దవర్తకులలో ఒక్కరుకూడ సుముఖులు కాలేదు. అయితే వాట్సన్ నిరుత్సాహ పడలేదు. తానే నేరుగా దుకాణదారులకడకు పోయెను. ఆ సబ్బువిషయమై వారికి నచ్చచెప్పెను. దుకాణదారు లంగీకరించిరి. ఆ కారణమున పెద్దవర్తకులు ఆ సబ్బులకు పెద్దపెద్ద ఆర్డర్లు ఈయక తప్పినదికాదు. కోర్టులాండులోని ఈ ఆర్డర్లు కంపెనీ అధ్యక్షుని దృష్టికి తగిలెను. తోడనే అతడు వాట్సన్‌ను శాన్ ఫ్రాన్సిస్కోయందలి తన కంపెనీశాఖకు అధ్యక్షునిగా నియమించుటకు ఆతురుడయ్యెను. వాట్సన్ అప్పటికి ఇరువది యెనిమిదేండ్ల యువకుడు. చిన్న చిన్నటినుండి దరిద్రమున మ్రగ్గుచుండినవాడు. మంచి జీతముతో ఒక బ్రాంచి ఆఫీసుకు అధ్యక్షస్థానము రానున్నది. ఈ పరిస్థితులలో ఎవరైన దానిని వలదనునా? సాధారణముల కట్లు వలదనుట సిరివచ్చుచుండ మోకాలొడ్డుటయే అనిపించును. కాని యంగ్ వాట్సన్ ఆ అధ్యక్షస్థానము తనకు వలదనినాడు. అధ్యక్షస్థానము వలదనుటయే కాదు. అసలు కంపెనీతో తనకుగల సంబంధమే వదలుకొనినాడు. తిరిగి స్వస్థలమునకు వచ్చినాడు. లీవరు కంపెనీతో వాట్సన్ సంబంధము వదలుకొనుటకుగల కారణములు రెండు: ఒకటి తన స్వస్థలమున సొంతముగ వ్యాపారమును పెట్టదలంచుట, రెండవది నార్వే దేశపు చేపలడబ్బాల వర్తకము అతనితలపున ఇంకను మెదలుచుండుట.

చేజిక్కిన ఫలమును జారవిడిచినాడు. స్నేహితుల కిది చాల కష్టముగానే యున్నది. అతనిని ప్రత్యేకాభిమానముతో చూచుచున్న కంపెనీయజమాని విలియమ్ లీవరుకు కూడ ఇదియెంతయో కష్టమనిపించినది. వాట్సన్ గొప్ప ప్రమాదముగావించినట్లు ఎల్లరును భావించిరి. కాని అతడు తొణకలేదు. ఇతరులకొరకు శ్రమపడవలసిన కాలము పోయినదనియు, తాను సొంతముగ నొక వ్యాపారము నిర్మించుకొనవలసిన అవసరము వచ్చినదనియు, సొంతముగ వ్యాపారమును నిర్మించుటలో తానింతవరకు కూడబెట్టిన సమస్తమును సర్వనాశనమైనను తనకు సమ్మతమేననియు వాతడు తలంచినాడు.

ఈ రోజులలో అతనికి హెన్రీ బి. పెయింటు అను వానితో స్నేహము కుదిరెను. యంగ్ ప్రారంభింప నున్న వ్యాపారమున తనకు భాగము కావలయునని హెన్రీ కోరెను. భాగస్వాములిద్దరును చెరియొక వేయి పౌనులను వ్యాపారమునకు మూలధనముగ పెట్టిరి. ఈ వేయిపౌనులును యంగ్ స్వార్జితమే. ధాన్యపు వర్తకునికడ వారమునకు ఐదుషిల్లింగుల జీతముమీద పనిచేయు రోజులలోకూడ అతడు కూడబెట్ట గలిగినంతయు కూడబెట్టువాడు. ధనము కూడబెట్టు అతని గుణము ఇప్పటున అతనిని స్వతంత్రుని నొనర్చినది. సొంతముగ వ్యాపారము ప్రారంభించుటకు తనకడనున్న సర్వస్వమును పెట్టుబడిగాపెట్టిన యంగ్-సాహసము దారుణముకదా! వ్యాపారము సవ్యముగసాగిన లెస్సయే. కానిచో వాట్సన్ కానికైన మారునా?

ఒకచిన్న ఉగ్రాణము. ఒక షేగది. న్యూకాసిల్ లోని ప్రక్కవీధులలో నొకదానియందు. తాను, తన క్రింద ఒక పెద్దవాడు, ఒక చిన్నవాడు 1903 జనవరిలో ఆ ముగ్గురును తమదికూడ ఒకఘనమే అను అతిశయముతో ఆంగ్లదేశమున ఒకక్రొత్త వ్యాపారమును సృష్టించుటకు ప్రారంభముచేసిరి. చేపలడబ్బాల వర్తకమున తాను లోగడపనిచేసిన ఫరమువారు ఇపుడును ఆ వర్తకమునుకూడ చేయుచుండిరి. అయితే ఆ వర్తకము ప్రోత్సాహకరమగు అభివృద్ధిదశ మాత్రమందలేదు. అట్టి వ్యాపారమున వాట్సన్‌కూడ కాలుపెట్టినాడు. అమెరికా సంయుక్తరాష్ట్రమున ఒక పెద్దకంపెనీ బ్రాంచికి అధ్యక్షస్థానమును వదలి న్యూకాసిల్‌న ఒక షేగది కార్యాలయముగల—ప్రోత్సాహ మెఱుంగకున్న చేపల డబ్బాల వర్తకమున ప్రవేశించుట—ఎవరైన హర్షించునా? కాని 'చేపలడబ్బాలు' వాట్సన్ కీర్తినిగూర్చియే స్వప్నములు గాంచుచుండెను—విలియమ్ లీవరు సబ్బు

లనుగూర్చి, హెన్రీఫోర్డు మోటారులనుగూర్చి ఎట్లు ఉత్సాహవంతులై యుండిరో చేపల డబ్బాలనుగూర్చి అత డట్లు ఉత్సాహవంతుడై యుండెను.

రెండవసారి వాట్సన్ నార్వేదేశమునకు వెడలెను. అచట సంప్రదింపులు జరిగెను. చేపల సరుకును నికార్సు చేయవలసియున్నదనియు, డబ్బాలపైజూ కొంచెము పెద్దది చేయవలసియున్నదనియు నాత డచటివారితో నొక్కి చెప్పెను. క్రొత్త కంపెనీ యజమానులకు వాట్సన్ సాధారణుడు కాడనియు మేధావియు, వ్యాపారదక్షుడును అగు అతని చేతులలో ఈ వ్యాపారము విశేషాభివృద్ధి నందగలదనియు వారికి నమ్మకము కలిగెను. కాగా నాతడు కోరినవెల్ల చేయుట కంగీకరించిరి న్యూకాసిల్‌లో ఒక ఫరమువారు ఇదివరకే ఈ వర్తకమును చేయుచుండిరిగదా! వారికిగూడా ఈ సదుపాయము కలిగింపవలయునని అతడు పట్టుపట్టెను. ఎట్టి ఉదారత!

నికార్సు అయిన సరుకు—విక్రయము నవీనవిధానమున గావింపబడుచున్నది—యజమాని తెలివైనవాడును, పనివాడును. కాగా 1905 నాటికే వ్యాపారము అతి విస్తృతినందెను. ఆ సంవత్సరమునకే వలయు ప్రకటనలకొరకు వేయిపౌనులు వెచ్చింపగలిగెను.

వాట్సన్ ట్రేడ్‌మార్కు కథ చిత్రమైనది. ఆ ఫరమువారు అమ్ము డబ్బాలపై చేపలపట్టువాని చిత్రమొకటి యుండును. ఒకనా డాతడు ఒక ఫొటోగ్రాఫరు షాపులోనికిపోయెను. అచట అతనిదృష్టి చేపలపట్టువాని ఫొటోపైబడెను. కొద్ది పౌనులతో ఆ ఫొటో కాపీరైటు అతడు కొనివైచి నాటినుంచి దానిని తన ట్రేడ్‌మార్కుగా నుపయోగింప నారంభించెను. కొద్ది పౌనులతో సమకూడిన ఆ ట్రేడ్‌మార్కు విలువ నేడు మూడులక్షల పౌనులను మించియుండునని మదింపు చేయబడినది. కొలది కాలమునకు అనంతరము అసలు ఆ ఫొటో ఎవరిదో ఆ మనిషితో వాట్సన్‌కు పరిచయము కలిగెను. అతని నామము డన్‌కన్ యాండర్సన్ అతడు నావికుడుగా, చేపలపట్టువాడును. విగ్రహపుష్టి కలవాడగుట చిత్రకారులును, ఫొటోగ్రాఫరులును అతనిని పలుసంవత్సరములు మోడల్‌గా నుంచుకొనుచు వచ్చిరి. కాని అతని బొమ్మ చేపలడబ్బాపై ట్రేడు మార్కుగా ముద్రింపబడుటకు ప్రారంభమైన తరువాత యాండరసన్‌ను మోడల్‌గా నుంచుకొనుట మానివైచిరి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ట్రేడ్ మార్కులలో నిదియొకటి. దానిచరిత్ర ఇట్లతివిచిత్రమై యున్నది. చనిపోవుదనుక యాండర్సన్‌కు యాంగస్ విశ్రాంతి వేతనమిచ్చువాడు. ఐరోపా మహా సంగ్రామానంతరము యాండర్‌సన్ మరణించెను. అప్పుడు అతని మనుమని రప్పించి యాంగస్ అతనికి తన కంపెనీలో ఉద్యోగ మిచ్చెను.

చేపలలో వివిధములగు రకములలోగూడ నాతడు వర్తకము ప్రారంభించెను. డబ్బామూత తెరచుకొని కంచమున వడ్డించుకొని వెంటనే భుజింపదగు ఆహార పదార్థములు పలురకములవానితో వర్తకము పెంపొందెను. శక్తి, సత్యసంధత అనునవి తప్ప మిగత ఎట్టి ధనము కాని లేనివాడు ప్రారంభించిన వ్యాపార మిప్పుడు ఇరువదిలక్షల పౌనుల మూలధనముగల పెద్ద కంపెనీ యయ్యెను.

1921-లో వాట్సన్‌కు మరియొక కోరిక పుట్టెను. మద్దినుసు తిను బండారములను తయారుచేయు ఫ్యాక్టరిని స్థాపింపవలెనని. అవి డబ్బాలలో, సీసాలలో నింప చేసి విక్రయించుటకు ఏర్పాటు. ఫ్యాక్టరీ నెలకొల్పబడినది. ప్రారంభపు వ్యయములు నూరువేలపౌనులు. పదునెనిమిదేండ్ల క్రితము రెండువేలపౌనుల మూలధనముతో ఆరంభింపబడిన ఫరము వారి దృష్టిలో ఈ మొత్తము ఎంత పెద్దమొత్తమైనా సులభముగనే కనుగొనవచ్చును.

అమ్మకమునకు క్రొత్తక్రొత్త రకములు తయారు చేయబడుచున్నను అసలు వ్యాపారము ప్రారంభించిన సార్డయిన్ చేపలవ్యాపారము మాత్రము విరమింప బడ లేదు. నేటికిగూడ ఆ చేపలడబ్బాలు ప్రపంచమునందలి దుకాణములందు వేలకొలదిగ అమ్మబడుచున్నవి. నార్వే దేశపు చేపలన్నియు నేడు ఈ ఇంగ్లీషుఫరము ద్వారానే ప్రపంచమునకు అమ్మబడుచున్నవి. ముప్పదిఎనిమిదేండ్ల

క్రితము పదునెనిమిదేండ్ల అంగ్లయువకు డొకడు తొలిసారి ఈ చేపల వేయిపెట్టెలకు కాంట్రాక్టుచేసినపుడు ఏడాదికి అచట రెండువేలపెట్టెల చేపలు మాత్రము పట్టుకొనబడుచుండెను. నేడో? ఏడాదికి లక్షలాది పెట్టెల చేపలు పట్టుకొనబడుచున్నవి. కాగా న్యూకాసిల్‌లో వాట్సన్ స్థాపించిన క్రొత్త వర్తకము నార్వే దేశమున పలువురకు వృత్తిని కల్పించినది, ఆహారపదార్థముల వర్తకులకు విక్రయమగు నొక క్రొత్తవస్తువు నిచ్చినది, ప్రజలకు ఒకక్రొత్త తిను బండారము గినది.

నిజముగ మహాశ్చర్యమే! ఇంతకంటె చిన్నపనులు చేసిన దానికే పలువురు విశేషగౌరవములను బడసిరి. వాట్సన్ మాత్రము ఒక్క గౌరవమునుమాత్రమే స్వీకరించెను. నార్వేదేశమున చేపల వర్తకమును లోకవ్యాప్తి నొందించినందులకుగాను ఆ దేశపు రాజు ఆస్కారు పంచమజార్జి అనుమతితో వాట్సన్‌కు 'సెయింటు ఒలాఫ్ యొక్క అర్డరు' అను గౌరవము నొసంగెను. ఆ సమయమున బ్రిటీషు ప్రభుత్వమువారు ఇచ్చిన సర్ బిరుదము నాతడు గౌరవపురస్సరముగ నిరాకరించెను. వాట్సన్‌కు బిరుదు తోకలపై ఆశలేదు. తనక్రింద పనిచేయువారి సుఖమే అతనికీర్తి. అతడు నిర్మించిన బ్రహ్మాండమగు వ్యాపారసంస్థయే అతనికీర్తి కాపుటా!

1908 లో ఈ కంపెనీ మూలధనము రెండువేల పౌనులు. అమ్మిన చేపలపెట్టెల సంఖ్య ఇరువదిరెండు వేలు-ఉద్యోగస్థులు ఇద్దఱు. 1927-లో మూలధనము ఇరువదిలక్షల పౌనులు. అమ్మిన చేపలపెట్టెల సంఖ్య ఏడుకోట్ల ఏబదిలక్షలు. ఉద్యోగస్థులు పదివేలమంది. ఇరువదివాలుగేండ్లలో కలిగిన తారతమ్యమును గమనింపుడు. దీనికి కారణభూతుడు ఎంత గర్వించినను దోషము కాదు. కాని వాట్సన్ ఎంతమాత్రమును గర్వితమతి కాడు.

ఆ వణిక్పుంగవునకు అతని జీవితమువలన తెలిసిన గొప్ప గుణపాఠమేమి? అతడిట్లు చెప్పుచున్నాడు: 'నా అనుభవమంతయు ఒక నిర్ధారణకు తోడుపడుచున్నది. అభివృద్ధికి ముఖ్యావసరములైనవి. సుస్వభావము, సాహసము, పనిచేయు సామర్థ్యము. ఈ మూడు గుణములు జయమునుకూర్చుట నిశ్చయము. జీవిత విధులను తెలిసికొనుట సులభమే వానిని ఆచరణయందు పెట్టుటయే మిగుల కష్టము. పెట్టుటయే పుట్టుటకు సాక్ష్యము. ధనవంతుడగుట ఆత్మసంయమనము యొక్క ఫలమే. జయమనునది యాదృచ్ఛికముగ కలుగునదికాదు. క్రమమైన ప్రయత్నముతో కూడిన శక్తి యొక్క ఫలమే జయము. పొందదగు విషయమును గూర్చి నిశ్చితుడైయుండుట జయశీలికి ప్రధానమైన గుణమై యుండవలయును. ప్రకృతిలో లోపరహితమైన దెద్దియు లేదు. ఒకసుగుణ మెచ్చటనుండునో ఒక లోపముకూడ అచ్చటనే యుండును. అగుట ధనవంతుడై పుట్టినవాడు అను సుగుణమున్నంత మాత్రమున అతడు అభివృద్ధినందునని మీరు తలపవద్దు. ధనవంతుడగుటయే ఒక్కొక్కప్పుడు ఒకని అభివృద్ధికి గొప్ప అడ్డంకియగును. కావున నీ స్వశక్తియందు నీవు పూర్తి నమ్మకముంచుము. భావికాలమున సుఖజీవనము కలుగగలదను విశ్వాసమును విడనాడకుము. కష్టములను ఎదుర్కొని అతిక్రమింపజాలు ధైర్యమును కలిగి యుండుము."

## రాజమహేంద్రనరము

౧

ఎన్నడో భారతీదేవి ఈ మనోజ్ఞ
రాజమందిరమందు నిరంతరమ్ము
నిలిచిపో నెంచినట్లు గన్పించునాకు,
ఈ కళాశాలలను జూచి ఏఁగునపుడు।

౨

ఇది గోదావరి దివ్యనీరములచే నెన్నెన్నొ యేండ్లాదిగాఁ
బదునై పోయిన సుప్రదేశమని కావచ్చుఁ గళానవ్య సం
పదవర్ధిల్లును నన్నపార్య కవితా వ్యాపారమార్గంబులో
నిది యారోజుల రాణ్మహేంద్రమయి యట్లై తేజముంజిమ్మెనుర్వన్ ।

౩

తీరిచిదిద్ది తేనియలు తెల్గు తెలుంగులకెల్లఁ బంచి భా
షారమణీ సమర్చనలఁ సల్పిన భక్తుఁడు నన్నపార్యుఁడే
వ్వారల పూజలంగొనఁడు వానిదెహమ్ము పురాంధ్రవైభవ
శ్రీరుచి కంకురార్పణము చేసినమంగళహస్తమారయన్ ।

౪

ఎవ్వాని రసవీచి నివతళించినగాలి తెలుఁగుల యెదవెట్ట తీర్చివైచె
ఎవ్వాని సుకళామహీయః ప్రరోచులు తెల్గువారికి వెల్గు తెన్నులయ్యె
ఎవ్వని కావ్యసాహిత్యంబులో వాణి తెలుఁగులనిదుర మేల్కొలుపులయ్యె
ఎవ్వని యఖండయశమునా యీ పురాణ
పుణ్యతర దక్షిణాపథ భూములెల్ల
వెలుఁగు రాశులుచేసి వెన్నెలలుకాసె
అతఁడు నన్నయ్య మనకు లేఁడాయె నేఁడు ।

౫

చిరపుణ్య ఫలగుణ శ్రీరాశి సారంగధరు నెత్తురింకిన తావులవిగో
విలయభైరవ జిహ్వికలువోలె నడయాడు తెలుఁగుఁగత్తుల పాడు దిబ్బలవిగో
"అమ్మంగదేవి" హృదంభోజనాథుని కోటచిన్నెలు మొండి గోడలవిగో
శైవమతౌన్నత్య సమయమార్కండేయు మందిరచ్ఛిన్న నిర్మాణమదిగో
ఆంధ్రవైభవ దీపము లారిపోయి
చీఁకటులు మూఁగికొన్న యీ సీమలన్ని
మనసుఁగొరలించి కలఁచి యుమ్మలికముంచి
ఏమహా వేళమో ఉదయింపఁ జేయు ।

౬

ఈ పునీతావనీ ఖండ మిట్టులగుట
కేపురాకృత దుష్కృతి శాపమయ్యె
ఏకుకష్ట నృపోద్ధతి హేతువయ్యె
ఎటుల ఆంధ్రాగ్ని ఆరిపోయినదినాఁడు ।

"అదిగో కర్తవ్య దివ్య పథాంతరమ్ము
హృదయమా! పక్షముల విప్పి ఎగురవేమి?"

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొను పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ యొక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.



## ౧౬. తేనెటీగల పెంచుట

మధుమక్షికా పాలనము నేడు గవర్నమెంటువారి ప్రోత్సాహమును బడయుచున్నను, ఆంధ్రదేశమునందు మాత్రము విరివిగ వ్యాపించినట్లు లేదు. దీని కనేక కారణములున్నవి గాని, వానినిచట (క్రోడీకరించుట) అనవసరమగును. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానమునందు సుమారు ఒకడజను గూండ్లలో కృషి. సాగుచున్నది. ఇక కొద్దిమంది ప్రత్యేకవ్యక్తులవద్ద యీ తేనె గూండ్లు కలవు. రేపల్లె తా॥ గోకారులంకలో వి. మురహరిరావుగారివద్ద నొకటి; తెనాలి తా॥ తురుమెళ్ళలో శ్రీ. వీరయ్యగారివద్ద ఒకటి, ప్రస్తుత సర్కిల్ అసిస్టెంట్ వ్యవసాయ డైరెక్టరుగారైన శ్రీ గిరాజు పంతులుగారు స్వయముగ జరుపుచున్న దొకటి, భద్రాచలము దగ్గరలో దుమ్ముగూడెమందు శ్రీ. నరహరి బి. యస్. సి (ఎడింబరో) గారు కృషిచేయుచున్న దొకటి. నాకుం దెలిసినంతవరకు సాగుచున్న గూండ్లు. ఇంకా పలుతావులలో ఉండవచ్చును విజ్ఞులు తెలుప ప్రార్థితులు.

—జాగు గోపాలరావు.

## ౩౭. కవలబిడ్డలు

సాధారణముగా కవలబిడ్డలు రూపమునందు భేదము కలిగియుండరు. సరికదా ఉద్దేశములలోను, భావములలోను, చురుసదనములలోను ఇద్దరును ఒక్కపోలికగనే యుందురు. ఈమధ్య కృష్ణాపత్రికలో వివిధవిషయములందు కవలబిడ్డలు కష్టసుఖములను ఒక్కసారిగా అనుభవించుచున్నట్లు వ్రాయబడినది. నేను కాలేజీలో చదువునపు డిరువురు కవలబిడ్డలగు విద్యార్థులుండిరి. అందు ఒకనికి ఏ వ్యాధివచ్చిన రెండవవానికి అవ్యాధియే ఒకటిరెండు రోజుల పిమ్మటగాని, లేక మరి కొన్ని దినములకుగాని వచ్చుచుండెడిది. దీనినిబట్టి చూచిన కవలబిడ్డలు కష్టసుఖము లిరువురును ఏక కాలమున అనుభవింతురని తెలియుచున్నది.

—బుర్రా నరసింహమూర్తి.

## ౩౮. డబ్బు ఋణములు భూమి.

నగదు అంతయు భూమిగామారుట దేశమునకు ఒకవిధముగా నష్టమే. నగదు కొఱవడుటచే కొనుగోలు వ్యాపారము తగ్గును. కొనుగోలు వ్యాపారము తగ్గుటతో వస్తువులధరలు మందమైపోవును. మందమైన ధరలు మరల హెచ్చుటయు కష్టమే. నగదు తగ్గుటతో ఋణము దొరకుట దుస్తరము. తెలివి, చురుకుగలవారు లోగడ అప్పుచేసి వ్యాపారమో, పరిశ్రమలు నెలకొల్పుటయో చేసి ధనమార్జించుచు తాము సుఖపడుటయేగాక ఇంకను మరికొందఱకు జీవనాధారము కల్పించినవారగుచుండిరి. అప్పులు పుట్టకుండుటచే ఇప్పుడట్టివానికి అవకాశము లేకుండపోయినది. మఱియు లోగడ అప్పులు పెట్టినవారు ఇపుడు వందలకొలది ఎకరములకు భూస్వాములగుచున్నారు. నాలుగైదు ఎకరములకు స్వామదారులై ఇదివఱకు జాతికి వెన్నెముకగా నుండిన సామాన్యరైతు లెందఱో భూములను పోగొట్టుకొని కూలివాండ్రుగనో, కవులు కొండ్రులు సేద్యము చేయువారుగనో యగుచున్నారు. ఇక వందలకొలది ఎకరములకు భూస్వాములైనవారు ఆ పొలములను తాము స్వంతముగ సాగుచేసుకొనజాలరు. కవులకిత్తురు. కవులుదారులకు సొంత పొలములందుండు ఆపేక్ష కవులు పొలములందుండదు. ఆ పొలములకు మందుపాకెత్తులు చేయుటయందు వారికి ఉత్సాహముండదు. ఇట్లగుట కవులుదారు ఆ పొలమునుండి పండింపగలుగునంతను పండింపజాలకుండును. ఈ కారణమున జాతీయ సంపద క్రమ

ముగా ఈడబోవును. స్వల్పసంఖ్యాకుల చేతిలో ఊరిలోని భూమిఅంతయు ఉండిపోవుటతో ఎన్నియో మధ్యమతరగతి కుటుంబములు నిరాధారములగుచున్నవి. ధవకంతులగును, పేదవారికిని కొత్తమతుకుగానుండే మధ్యమతరగతి ఈవలను సంఘవ్యవస్థను ఒక గొప్ప అండగానుండెను. ఇపుడా మధ్యమతరగతి క్రమముగా నశించిపోవుచున్నది. సామ్యవాదులు ప్రచారము సాగించుటకు అవకాశమేర్పడుచున్నది. ప్రజానాయకులును, ప్రభుత్వమువారును త్వరగ మేల్కొని మధ్యమతరగతికి స్థిరత్వమిచ్చినగాని దేశము వెట్టిదారులలో పడిపోగలదు.

—భావరాజు వీరభద్రయ్య, బి. ఏ.

౪౦. అరిటి సారగు కోత

అరటిచెట్టునకు నీరు ఎక్కువగవలయును. వేళ్ళతో గైకొను నీటిని ఆ చెట్టు తన కాండమున భద్రపఱచుకొనును. మామిడి మొదలగు చెట్లక్రింద రాలిన ఆకులు క్రిందనేలలోని తేమను నిలువుటకు ఎట్లు ఉపయోగించునో అరిటి సారగుకూడ చెట్టు కాండమునందలి నీటికి హెచ్చు ఎండ దెబ్బ తగులకుండ ఒక తెరమాదిరిగ నుండును. అగుట దానిని ఎప్పటికప్పుడు కోసివేయుటకంటె చెట్టు కొట్టివేయువఱకు చెట్టునే యుండనిచ్చుట మంచిది. వ్యవసాయ శాస్త్రజ్ఞులగు శ్రీ గోటేటి జోగిరాజుగారు ఉద్యానవనకృషి అను తమ గ్రంథమున కోసివేయకుండ నుంచుటయే మంచిదని వ్రాసినారని నాకు జ్ఞాపకము.

—కలిదిండి సీతారామరాజు.

# భగవత్ప్రార్థన

లోకకల్యాణ మొనరించు లోకనాథ
నీదుమూర్తిని ధ్యానింతు, నిదుర లేచి
నేడు నే నొనర్చెడికార్య, నికరమెల్ల
నీకె యర్పింతు గైకొను, నెనరుతోడ॥

నిదుర లేచిన తోడనే, నీరజాక్ష
కనులతో మాయలోకంబు గనకమున్న
ముందుగా నీదు పాదారవిందములను
గాంతు నను కష్టములనుండి గాచుకొరకు॥

నేను నిద్రించుటకు ముందు, నీదుదివ్య
పాద పద్మంబులను గొల్తు, భక్తితోడ
వందనముజేసి ధ్యానింతు, పశ్చాత్తాపింతు
నేటి నా నేరములను, మన్నించుకొరకు

నీదు సేవను జేయంగ, లేదటంచు
నెపములెన్నకు నాయందు, నీలకంఠ
సర్వకాలంబులను నిన్ను, సంస్మరింతు
యొక్క వేళని నా కేమి యున్నదింక
మరచితినె యెన్నడైన నా మానసమున॥

ఎట్లుజేసిన మేలో నీ వట్లుజేయు
గలవు, నిన్నేమి వాంఛింప, వలయు దేవ
నేను కోరిన యడియాస, లౌనుగాక
నీకె దెలియును నాకష్ట నిష్ఠురంబు॥

నీకె దెలియును నా మనోనిబ్బరంబు
నీకె దెలియును నామనో నిశ్చయంబు
నీకె దెలియును వను ద్రోచు నేర్పు తెరగు
నీకె దెలియును నే జేయు నేరమేమొ?
నీకె దెలియును నాతండ్రి, నిఖలమెల్ల
నీకు దెలియనిదున్నదే నీలకంఠ
నీ వెరుంగనిదున్నదే నీరజాక్ష
నేను దెల్పంగ వలయునే నీకు దేవ
ఎపుడు నావెంటనుండి న న్నేలవలయు
అన్యథా దిక్కు లేరు నా కవనిలోన
మాటిమాటికి దెల్పగ నేటికయ్య
వినుకుగల్గదె వెతలెల్ల విననీకు॥

యెన్ని లోపములున్న మన్నించుమయ్య
నీ కటాక్షంబు నాపైన నిలుపుమయ్య
అదియె నినుగోరితయ్య, ముఖ్యంబుగాగ
చిన్న నాకోర్కె వ్యర్థంబు జేయకయ్య

—చీమకుర్తి సత్యవతి.

## చిన్న పునర్విమర్శ

ఆంధ్రభూమియొక్క 8-వ సంపుటం 6-వ సంచికలో 'చిన్న చిన్న వ్యాసాలు' అనే వ్యాసం నేను రాశాను. ఆంధ్రభూమియొక్క 8-వ సంపుటం 7-వ సంచికలో 'చిన్న చిన్న వ్యాసాలుగురించి' అని శ్రీ.కే.టి. సీతారామమూర్తిగారు విమర్శించారు. ఈ విమర్శలోని కొన్ని అంశాలకు జవాబు చెప్పవలసివుంది కాబట్టి రాస్తున్నాను. ఈకాలపు పత్రికలలో ప్రకటించబడేటటువంటి చిన్న కథలూ, సాహిత్య చిత్రాలూ (స్కెచెస్) అనేకం నేను చదివాను. ఆ రచనలలో వ్యూహం (ప్లాట్) లోపం చాలాతక్కువ. కొన్ని కొన్ని వ్యూహాలు శాకారంతటివాడుకూడా గుండె బాదుకునేటట్లా వుంటాయి. కాని లోపం సాధారణంగా ఎక్కడ కనబడుతూందంటే, కథారచనలో కాక వ్యాసరచనలో. కథ రసవంతంగా వుండడానికి కొన్ని కొన్ని సొగసులు చెయ్యవలసి వుంటుంది. అటువంటి సొగసులు ఈ రచనలో విడిచిపెయ్యబడుతున్నాయి. కొన్ని రచనలు బొత్తిగా వార్తాపత్రిక రిపోర్టులలాగ వుంటాయి. అంటే రసపుష్టికోసం చెయ్యవలసిన పనులు విడిచిపెయ్యబడుతున్నాయన్న మాట. నాకు తోచినదేమంటే, ఈ లోపానికి ముఖ్యకారణం సంపాదకుల సైజు నిర్ణయమే అని. ఆ సైజు నిర్ణయం చేతే రచయితకథకు కావలసిన రసపుష్టిని నిరసింపచేసి వట్టి వ్యూహమనే అస్థిపంజరాన్ని సంపాదకుని నిర్ణయానికి సరిపోయేటట్లా తయారుచేస్తున్నాడు. ఈ పుష్టిలేని లోపం తీర్చాలంటే వ్యాసాలకు సైజు నిర్ణయం ముందనియ్యకూడదన్నమాట. కొన్నివ్యాసాలు వాటంతటవే చిన్నవిగా అవుతాయి. అటువంటివాటితో మనకేమీ తగాదాలేదు. ఇంక తగాదా ఎక్కడంటే, వాటంతటవిగా పెరగనిస్తే పెద్దవయే వ్యాసాలను కృశింపచెయ్యడం దగ్గిరే. సీతారామమూర్తిగారు మొట్టమొదట తమ విమర్శలో సంపాదకులు అనేకరకాల వ్యాసాలు వెయ్యవలసివుంటుంది ఒక్క కథలే కాకుండా అన్నారు. నేను నా వ్యాసంలో అదే అన్నాను. అందులో మా కిద్దరికీ వివాదం వుండవలసిన అవసరంలేదు. అటు తర్వాత "చిన్నచిన్న పత్రికలు చిన్నచిన్న వ్యాసాలే కోరుతవి. చిన్నచిన్న వ్యాసాలంటే ప్రతిభలేని వ్యాసాలని కాదు—తక్కువ పరిమితిగలభాగాలలో ఎక్కువ ప్రతిభను చూపించే వ్యాసాలు" అని సీతారామమూర్తిగారు అన్నారు. దీనికి నేను చెప్పేదేమిటంటే వ్యాసం ఎక్కడోగాని దానంతటది చిన్నదవదు. మన రచయితలు తమ వ్యాసాలు సంపాదకులు కోరినంత చిన్నవి అవడంకోసమని రసాన్ని ఎండించి వేస్తున్నారు. ఈ మోస్తరుగా వారు వరుగులు తయారుచేస్తున్నారు. దీనికి కారణం సంపాదకుల సైజు నిర్ణయమే. అన్ని వ్యాసాలూ మల్లెపువ్వులలాగ చిన్నవిగా వుండవు. కొన్ని గులాబీలలాగ వుంటాయి, కొన్ని కలువలలాగ వుంటాయి, కొన్ని మందారపువ్వులలాగ వుంటాయి. కాని సంపాదకుని ఆజ్ఞ ఏమిటంటే మిగిలిన పువ్వులన్నీ కూడా మల్లెపువ్వంత చిన్నవిగానే వుండాలని. ఇది న్యాయమా! కాదుకదా! కనకే సంపాదకులు సైజు నిర్ణయం చెయ్యకూడదన్నాను. ఒక్కరూపాయికే చందాదారులకి అనేక వ్యాసాలుగల సంచిక నెలనెలకీ అందచేస్తున్నామని అనిపించుకోడానికి కూడా సంపాదకులు చిన్నచిన్న వ్యాసాలు కోరుతూవుంటారని నేను అన్నాను. అదికాదు అన్నారు సీతారామమూర్తిగారు.

సంపాదకులతో నాకుగల కొంత పరిచయాన్నిబట్టి పైసంగతి రాశాను. 'అయ్యో! ఈమాటు సంచికలో వ్యాసాలసంఖ్య తక్కువయిపోయిందే' అని విచారించిన సంపాదకులను నేను చూశాను. అందుచేతే అలాగు రాశాను. 'జానెడు వ్యాసంలో గ్రంథకర్త ఏమాత్రం పనితనం చూపించగలడు, తన లోకపరిశీలనా, కల్పనా శక్తీ చూపించాలంటే వ్యాసం జానెడవదు' అని నేను అన్నాను. దానికి శ్రీ సీతారామమూర్తిగారు ఆక్షేపణగా ఈ కింది ఉపమానం చూపించారు, 'చిత్రకారుడు ఒకస్త్రీని చిత్రించాలంటే ఆ స్త్రీ అంత ప్రతిమనే వ్రాస్తున్నాడా? ఆ స్త్రీమూర్తిని చిన్న కాగితముపై ఇమిడ్చి తద్రూపమును విస్ఫుటముగ ప్రదర్శింప చేయుచున్నాడు.' ఈ ఉపమానం వాఙ్మయానికి ఏమాత్రముగా సరిపోతుందో నాకు బోధపడటంలేదు. చిన్న చిత్రంలోనైనా పెద్దచిత్రంలోనైనా చిత్రకారుడు చిత్రించే తలిపీర్ఘ్యన్ని ఒక్కటే. పెద్దచిత్రంలో జానెడు పొడుగుగా వేసేవస్తువు చిన్నచిత్రంలో అరంగుళం పొడుగుగా వేస్తాడు. చిన్న చిత్రానికీ పెద్ద చిత్రానికీ అంతే తేడావుంటుంది. ఈ ఉపమానం సాహిత్యానికి ఏమాత్రముగా సరిపోతుంది. పెద్దవ్యాసాన్ని కుదించిరాస్తే అది వ్యాససంగ్రహ మవుతుంది కాని వ్యాసంకాదు. నేను చెప్పిన ఆక్షేపణ ఎప్పటిలాగేవుంది. పెద్ద చిత్రానికీ చిన్న చిత్రానికీ వుండేపోలిక ఎటువంటిదంటే—ఒక శతకాన్ని హెడ్డింగుటైపులో అచ్చు వెయ్యవచ్చు. అదే శతకాన్ని చిన్న తెలుగులో అచ్చు వెయ్యవచ్చు. విమర్శకులుయిచ్చిన ఉపమానం సాహిత్యానికి సరిపోయేటట్లు కనపడదు. 'రాశినిచూసి భ్రమించవద్దు ఇంత రాశివుంది. ఇందులో ఏమాత్రమైనా గుణం వుండకపోదు అనే నమ్మకంతో దానిని ప్రకటించవద్దు. వ్యాసం చిన్నది కనుక గుణంకూడా కొద్దియే అనుకోవద్దు' అని సీతారామమూర్తిగారు అన్నారు. ఇది వారేకాదు ఎవరేనా అంతే అంటారు. కాని నేను చెప్పేదివేరు. ప్రత్యేకంగా ఏవో కొన్ని వ్యాసాలే సహజంగా చిన్నవి అవుతాయి. తక్కిన వ్యాసాలన్నీ చిన్నవిగా వుండవు. ఎందుచేతంటే కవి రసవంతంగా రాయదలచుకొంటే వ్యాసం విస్తరిస్తుందిగాని చిన్నది అవదు. ఈ వ్యాసాలుకూడా చిన్నవిగానే వుండాలంటే వ్యాసాలు రసహీనంగా వుంటాయి. కనుక 'వ్యాసం చిన్నదిగా వుండాలి' అని సంపాదకులు నిర్ణయంచెయ్యవద్దని నేను కోరాను.

—టేకుమళ్ళ కామేశ్వరరావు బి ఏ బి.ఇడి.

* * *

## వ్యాసకర్తలకు విన్నపము

నవంబరు సంచికలో శ్రీకామేశ్వరరావుగారు చిన్న వ్యాసముల వలన నేటి సారస్వతమునకు తీరని నష్టము వాటిల్లుచున్నట్లు చక్కగ నిరూపించిరి. మత సాంఘిక నియమములను చర్చించి, నిగ్గుతేల్చి, చదువరుల కందించుటకు రచయితలు స్వేచ్ఛగ కథావస్తువును బట్టియు తన్మూలమున వ్యక్తపడెడి అమూల్యోపదేశములు, మహాదాశయముల బట్టియు, వారి రచనలకు వారే పరిమితి నిర్ణయించుకొన నిచ్చింతురు. పాత్రపోషణ, కథాసంవిధానము, శైలి యీమూడిటిని కావ్యకర్తకు చేతనయినంత ఉత్తమస్థితికి తెచ్చి, రసవత్తరముగు రచన కావలెనన్న స్వేచ్ఛ యెంతేని ముఖ్యము. ఆద్యంతములు రచయితల భావప్రపంచమును బట్టి దేశ కాల పాత్రానుసారముగ వారిచే నిర్ణయింపబడును. అట్టితరి యీ వ్యాస మిన్ని పేజీలకు మించరాదు, కథను సంక్షేపించి వ్రాయవలెను లేనిచో మాపత్రికలో తమ వ్యాసమునకు తావుదొరకుట దుర్లభము అని నేటి పత్రికాధిపతులు, కళానైపుణ్యమున నేమి దైనందిన మానవ జీవిత పరిశీలనా ప్రభావమున నేమి, ఆర్థిక సాంఘిక రాజకీయ పాండిత్యమున నేమి అపార ప్రజ్ఞాధురీణులయి, ప్రత్యేక వ్యక్తి జీవితములనుండియు, సంఘము నుండియు ఊహాప్రపంచమునుండియు, వస్తుస్వీకారము చేసికొని దానికి వేయిమడుంగులు మెఱుగు బెట్టి, విస్తరింపజేసి, నగిషీచేసిన చిత్తరువువలె మనోహ్లాదకరముగ నొనర్చి, సర్వవిధముల సౌకుమార్యముకల్పించి, విరజాజుల నెత్తావిని మించు రచనా చమత్కార పరిమళోపేతములై నవనవలాడుచు ఉత్తేజముతో వికసిల్లు నట్టి రచనలను—పద్యమైన నేమి గద్యమైన నేమి—

కావించి పవిత్ర సందేశములను, అపూర్వాదర్శములను ప్రతిబింబింపజేయవలెనన్న కుతూహలముతో ఆంధ్ర పారస్వత సేవకేయుచున్న రసికాగ్రగణ్యులగు సుప్రసిద్ధ రచయితల కలములను పాపుగ సాగనివ్వక అడుగడుగున కట్టుతగులుచు ఆగుమాగుమని కళవళపఱచి వారి స్వేచ్ఛాభంగము చేసి ప్రయత్నించుట నిష్ప్రయోజనము విచారకరమైన విషయమే. శ్రీ కామేశ్వరరావుగారు వుడివినరీతిని పేక్కు చిన్న వ్యాసములకు మారుగ ఉత్తమోత్తమములగు చక్కని పెద్ద వ్యాసములు రెండు మూడు ప్రచురించుటయే ప్రశంసనీయము ఆంధ్రవాఙ్మయాభివృద్ధికి తోడ్పడెడి సంపూర్ణ వ్యాసములను, కథలను ప్రకటించుట లెస్స. అంతేకాని ఒకసారి చూచినపిదప నీకెన్నటికిని దానితలపే కిట్టనట్టి మధ్యరకపు వ్యాసములు కోట్లకొద్ది తయారైన ఏమిలాభము? సదుద్దేశములేని రచనమేల? తనివితీరని తమకము, తెంపులేని ఆనందము, అపురూప సౌందర్యలహరి, ఉత్కృష్టభావౌచిత్యము, ప్రసన్నగుణము వ్యక్తపఱచి, చదువరులలో నాయూరసములు రేకెత్తించి, వారి హృదయములు స్పందించునట్లు చేయవలెనన్న ఉత్తమ రచయిత, ఉత్తమరీతిని, ఉత్తమ వస్తువును తీసికొని, తన యనుభవించిన విధముగ, తనకు శ్లాఘ్యమైన రూపమును మృదుమధురపద గుంఫనములచే నిష్కళంక మనసుతో 'వాక్యం రసాత్మకం కావ్యం' అను మడి సువిమర్శముగ నాలోకించి, గ్రంథరచనోద్యుక్తుడై ఉత్తమకావ్యమును లోకమునకు ప్రసాదించుట శ్రేయస్కరము. ఇన్నియు సమకూడవలెనన్న అట్టి రచయిత సంపూర్ణ స్వేచ్ఛ ననుభవింపవలెను. ఎవ్విధమైన కట్టుబాట్లునుండరాదు. అటులని అతడును విజృంభించరాదు. శాస్త్రసంబంధమగు ముఖ్యలక్షణములను లక్ష్యమందుంచుకొనవలెను. జాతీయతను పాటింపవలెను. పరిశుద్ధమగు ఆత్మజ్ఞానముచే తెలిసికొనిన విషయములను మాత్రమే రసావేశ స్ఫురణకలిగిన తోడనే ఉచితరీతిని కావ్యభక్కిని రచింపదగును. ఇందులకు వ్యాసపరిమాణము, లేక కావ్యపరిమాణము ఎవ రునిర్ణయింపగలరు! అందుచే చిన్నవ్యాసములే కావలెనను నిర్బంధ ముండరాదు. సకలవిధముల జనాదరణీయములగు విపులాంశములతో నలరారునట్టి ఉత్తమ వ్యాసములనే పత్రికాధిపతులు స్వీకరించుట ధర్మము. అటులనే కథలను రూపకములును కూడ కవి ప్రతిభతో రులదూగుచుండవలెను. అతడు నిర్మించుకొనిన భావప్రపంచములో సృష్టింపబడిన వ్యక్తులు ఆదర్శ జీవనము గలవారై వాఙ్మయ ప్రపంచమున నిలువవలెనన్న అట్టి రచనలు వాఙ్మయాభివృద్ధికి తోడ్పడవలెనన్న కవి నిరంకుశుడై మృదుమధుర భావతరంగ డోలికలనూయలలూగుచుండవలెను. ఒకవేళ గ్రంథవిస్తర భీతిచే పత్రికలలో వారికి తావుండదేమో అని వారెన్నడును భయపడకూడదు. శ్రేష్ఠతమమగు రచన చేయవలెనని నిశ్చయించుకొని, చిన్నపెద్ద తారతమ్యము మరువవలెను. అప్పుడే ఉత్తమరచనలు బయలుదేరును.

—శ్రీపాద వేంకటావధాని.



# ఇన్స్యూరెన్సు విషయములు

## బీదవారికి భీమా రక్షణ

౧

'వార్ధక్యే హేతోర్వ్యుపాసతే:—అని శాస్త్రములు చెప్పుచున్నవి. అనగా వార్ధక్యమునకు ముందుగానే, దాపరికము అవసరము. దీనికొరకే ప్రతి దేశమునందును భీమాపద్ధతులు యేర్పరుపబడినవి. మన దేశమునందు సయితము అనేక భీమాకంపెనీలు పనిచేయుచు ప్రజలకొరకై పాటుపడుచున్నవి.

తనువులు శాశ్వతములుగావు. జీవితము నీటిబుడగవలె క్షణభంగురము. మానవుడు జీవించియున్నంత కాలము భోగపరాయణుడై యుండ నిచ్ఛగించును. అందులకై ధనము వివిధ విషయములయందు వెచ్చించునేగాని, తన ముసలితనమందు, సుఖజీవనము గడపుటకుగాని, లేక తనువు వీడినపిమ్మట తన భార్యాపుత్రాదుల పోషణకొరకై గాని, కొంతధనము దాచుట అవసరమని గ్రహింపడు; ముఖ్యముగా మన భారతీయులు యెప్పటికయ్యది ప్రస్తుతమో, అద్దానిని గూర్చి యోచించునేగాని, భవిష్యత్తును గూర్చి చింతసేయరు. బ్యాంకులయందు అప్పుడప్పుడు కొంతధనము నిలువ సేయుచున్న చేతిలో రూకలున్నపుడు ఖర్చులు తమంతతామె పెరిగికొనవచ్చును. అట్టితరి జీవితాంతమున, మానవునికి సహకారి భీమాయని అర్థికవేత్తలు నుడివియున్నారు. విధి నెదుర్కొనుట ధైర్యమును సూచించును. తన భార్యాపుత్రాదుల క్షేమముకొరకు వారికితగు రక్షణ లేర్పరచుట దూరదృష్టిని గనపరచును. ఈ రెండును.భీమాద్వారా చేకూరుననుట నిస్సంశయము,

పై విషయములను గమనించినపుడు భీమా యెంతో అవసరమో బోధపడగలదు. కాని, ఎట్టి భీమా అవసరము? అను విషయము ఆలోచింపదగును. భీమా ధనవంతులకు మాత్రమే కాదు. ముఖ్యముగా బీదవారికే భీమా ఆవశ్యకత మెండు. బీదవారు తక్కువ మొత్తములకు మాత్రమె భీమాచేయగలరు. అట్టి తక్కువ మొత్తములకు భీమా తీసికొని, ప్రజలకు సౌకర్యముల గూర్చు కంపెనీలు మన దేశమునందు అత్యవసరమైయున్నవి. ప్రస్తుతము మన దేశమున యిట్టి సంస్థలకే తావుగలదు.

ఏలయన, మన దేశమునందు నూటికి 70 మంది వ్యవసాయమువలన జీవించుచున్నారు. వ్యవసాయము వలన సంవత్సరాదాయము అత్యల్పము. మన దేశమున ప్రతివ్యక్తియొక్క సరాసరి ఆదాయము రూ॥ 30 లు అని అంచనా వేయబడియున్నది. అనగా ఇంగ్లండు, అమెరికా, దేశములయందు పనివారలకు వారమునకు లభించు వేతనముల 6-వ భాగము. ఇట్టి పరిస్థితులలో, భారతీయులు స్వల్పమొత్తములకు మాత్రమే భీమా చేయగలరనుట నిర్వివాదాంశము.

పాశ్చాత్య దేశములయందు వేతనములు హెచ్చుగానున్నను, వారమునకు ఒక పెన్నీచొప్పున ప్రీమియములు పుచ్చుకొని, గొప్ప క్షేమనిధులు Reserves ఏర్పరచి మన భారతదేశమునందు గొప్పవని పేరెన్నికగాంచిన భీమా కంపెనీలకన్న గొప్పవగు సంస్థలెన్నియో గలవు.

ప్రస్తుతము భారతదేశమునందు స్వల్పమొత్తములకు

భీమా తీసికొనవలె ప్రావిడెంటుకంపెనీలు మాత్రమే. వీనియందు లాభములు చాల స్వల్పము. అందుచేత నమ్మకమైనట్టియు, అభివృద్ధిపరులైనట్టియు, దూరదృష్టి గలిగినట్టియు తాబేదారుల నియమించుటకు తగిన అవకాశములు లేకయున్నవి. అందుచే నివి జయప్రదములు గాలేదు. అట్టి సందర్భములలో సాధారణభీమా కంపెనీలు తక్కువ మొత్తములకు భీమా చేయుటకు అవసరమగు అవకాశములు కలుగజేయవలసి యున్నవి. జపాను దేశములో చట్టప్రకారము ప్రతి మనుజుడును భీమా చేయవలసియున్నది.

మరి యితర పాశ్చాత్య దేశములలో, యజమానులు తమ తాబేదారులచేత భీమా చేయించి, వారి ప్రీమియములలో కొంతభాగము తామే చెల్లించుటకలదు.

మన భారతదేశమునందు యెన్ని కర్మాగారములు గలవో, వానియందెంతమంది కూలివారలు పనిచేయుచున్నారో గమనింపుడు. కర్మాగారములయందు అగ్నిరగుల్కొనుటవలనను, పొరబాటున యంత్రములలో చిక్కుకొనుట వలనను, వార లాకస్మిక సమయమందు ప్రాణముల సయితము కోల్పోవలసి యున్నారు. ఒకవేళ యిట్టి దురదృష్టములకు పాల్పడువారు, కొలదియే రైనను, మిగత పనివారలు, త్రాగుడు మొదలగు దుర్వ్యసనములయందు, ధనము పాడుచేసి, సజీవులై యున్నపుడే, భార్యాపుత్రాదులను, మితిలేని కష్టముల పాలుచేయుచున్నారు. యిట్టి పరిస్థితులయందు. యజమానులు, కార్మిక నాయకులు, ప్రజానాయకులు, ఈ విషయముల గమనించి, భీమాసంఘమును, గ్రామపునర్నిర్మాణము నందొక ముఖ్యవిషయముగా చేర్పరవి, ప్రజలయం దుద్బోధము సలుపుట అవసరమై యున్నది. తమ నౌకరులచే భీమాచేయించి, వారికుటుంబముల కాపాడుట, కార్మికయజమానులకు విధియై యున్నది.

